

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 6-4-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 7 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: నవమి రా.7.24 తదుపరి దశమి; నక్షత్రం: పుష్యమి పూర్తి; వర్జ్యం: మ.1.49-3.29; దుర్ముహూర్తం: సా.4.47-5.36; అమృతఘడియలు: రా.11.46-రా.1.26; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 6.25 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కంచ దాటిన వ్యాఖ్యలు!

కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుమోటోగా విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం చేసిన తీవ్ర వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ విశ్వసనీయత, ప్రతిష్ఠపై ప్రభావం చూపవా? రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు, ఇతర అంశాలలో గోటితో పోయే దానిని గొడ్డలి దాకా ఎందుకు తెచ్చుకుంటోంది?

సుప్రీంకోర్టు ఆదేశాలు, వ్యాఖ్యలు పర్యావరణ ప్రియులతోపాటు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించే వారికి సంతోషాన్ని కలిగించాయి.

కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు తుది తీర్పు లేదా ఆదేశాలలో భాగం కావడం లేదు. అయినప్పటికీ, మీడియాలో వాటికి విశేష ప్రచారం లభిస్తుండటంతో సామాన్య ప్రజానీకం ప్రభావితం అవుతున్నారు. సదరు వ్యాఖ్యలను తీర్పులలో భాగంగానే చూస్తున్నారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ విశిష్టతకు నష్టం చేస్తుందన్న అభిప్రాయం బలంగా ఉంది.



కొత్త పలుకు!

విశాఖపట్నంలో రుషికొండను నిబంధనలు పాటించకుండా ముఖ్యమంత్రి నివాసం కోసం బోడి గుండుగా మారుస్తున్నారని, సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని గతంలో సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. అప్పుడు సుప్రీంకోర్టు ఇంత వేగంగా స్పందించలేదు. ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా రుషికొండను తవ్వుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవడానికి మాత్రం ఒక కమిటీని నియమించింది. మామూలుగా ఇలాగే జరుగుతుంది. కానీ, కొన్ని సందర్భాలలో మాత్రం న్యాయస్థానాలు ఇప్పటిలా స్పందిస్తాయి. అంటే, ధర్మాసనంలో కూర్చున్న వారిని బట్టి కొన్నిసార్లు ఇన్‌స్టంట్ న్యాయం లభిస్తుందన్న మాట!

న్యాయస్థానాల్లో న్యాయ సమీక్ష మాత్రమే జరగాలన్నది విస్తృత అభిప్రాయం. సర్వోన్నత న్యాయస్థానానికి మన రాజ్యాంగం కొన్ని విశేష అధికారాలు కల్పించింది. అదే సమయంలో సమాజ హితం దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. ఆమె కెరీర్ ఆసాంతం వివాదరహితంగా సాగింది. గతంలో ఏ హోదాలో కూడా ఆమె కోర్టు ధిక్కరణకు పాల్పడిన రికార్డు లేదు. తన పనేదో తాను చేసుకుపోతుంటారు. అలాంటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేయడం సముచితమా? లేదా? అన్నది న్యాయ వ్యవస్థ ఆలోచించుకోవాలి.

తుది ఆదేశాలలో, తీర్పులలో కనిపించని వ్యాఖ్యలను విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేయడంపై చాలా కాలంగా అభ్యంతరాలు ఉన్నాయి.

ప్రస్తుతం వివాదంగా మారిన 400 ఎకరాలను వనరుల సమీకరణలో భాగంగా విక్రయించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఈ సందర్భంగా ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరించడం వల్ల వివాదం ముదిరింది. లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరించడం వల్ల వివాదం ఇంత దూరం వచ్చింది. చివరకు సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.

ఇక భూముల అమ్మకం సమర్థనీయమా? కాదా? అంటే ఎవరి వాదన వారికి ఉంటోంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగా మాట్లాడటం మన రాజకీయ పార్టీలకు పరిపాటే.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎన్నికల సందర్భంగా ఇస్తున్న అలవి కాని హామీల అమలుకోసం ప్రభుత్వ భూములను విక్రయించడం వాంఛనీయం కాదు. అయినా అన్ని పార్టీలకూ ఈ పాపంలో భాగం ఉంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ 400 ఎకరాలను విక్రయించడాన్ని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిజానికి కేసీఆర్ హయాంలో ఈ భూముల వివాదం పరిష్కారమై ఉంటే అప్పుడే సదరు భూమిని వేలం వేసేవారు.

తాము చేసేది సంసారం- ఇతరులు చేసేది వ్యభిచారం అన్నట్టుగా రాజకీయ పార్టీలు వ్యవహరించడం వల్లనే ప్రతిదీ వివాదం అవుతోంది.

4

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్

ఖరారు చేసిన ముఖ్యమంత్రి నేతృత్వంలోని కమిటీ.. ఇద్దరి పేర్లను గవర్నర్‌కు పంపిన ప్రభుత్వం

నేడో రేపో నియామక ఉత్తర్వుల జారీ.. సమాచార ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి?

ఆయన సీఎం కార్యాలయ కార్యదర్శి.. ఐదుగురు కమిషనర్లను నియమించాలని యోచన

ఎంపిక భేటీకి రాని కేసీఆర్



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



జస్టిస్ షమీమ్ అక్తర్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లోకాయుక్త, సమాచార హక్కు కమిషన్, మానవ హక్కుల కమిషన్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ పేర్లను ఖరారు చేసింది. సమాచార హక్కు కమిషన్ ప్రధాన కమిషనర్ (సీఐసీ)గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి జీ చంద్రశేఖర్‌రెడ్డి పేరు తుది పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ఎంపిక వివరాలను గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. గవర్నర్ నేడో రేపో నియామక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ అంశంపై శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం జరిగింది. నియామకాలపై విడివిడిగా చర్చించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి పాల్గొన్నారు. లోకాయుక్తగా నియమితులు కానున్న జస్టిస్ రాజశేఖర్ రెడ్డిని గత ఏడాది జనవరిలో తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆ పదవిలో కొనసాగుతుండగానే లోకాయుక్తగా ఎంపిక చేసింది. ఆయన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందినవారు. 2022 మే నెలలో హైకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేశారు.

ఇటీవలే వర్గీకరణ కమిషన్‌కు అక్తర్ నేతృత్వం

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్ పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. షెడ్యూల్డు కులాల (ఎస్సీ) వర్గీకరణ కోసం ఇటీవలే ప్రభుత్వం షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆయన పలు దళిత సంఘాలు, ప్రజా సంఘాలతో చర్చించి, ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎస్సీలను మూడు వర్గాలుగా విభజించాలని సూచించారు. దీనిని ప్రభుత్వం పరిశీలించి, ఇటీవలే అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. ఇలా ఎస్సీ వర్గీకరణలో

మిగతా 3వ పేజీలో...



కంచ గచ్చిబౌలి.. నకిలీ ఫొటోలు, వీడియోలపై..

సీఎం సీరియస్

విచారణకు ఆదేశించేలా.. ప్రభుత్వం తరపున హైకోర్టుకు విజ్ఞప్తి చేయండి

సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయండి

ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్‌ని సమకూర్చుకోండి

కంచ గచ్చిబౌలి వివాదంపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు సృష్టించారు

ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు

కిషన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి పోస్టులపై చర్చ

సెలబ్రిటీలు జాన్ అబ్రహం, దియామీర్జా.. రవీనా టాండన్ ట్వీట్‌లపై పోలీసుల ఆరా



శ్రీరామనవమి సందర్భంగా విద్యుద్దీప కాంతుల్లో భద్రాచల రామాలయం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత నకిలీ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టుకు విజ్ఞప్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని, నకిలీ వీడియోలు, ఫొటోలను పసిగట్టేలా అవసరమైన ఆధునిక ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సూచించారు. శనివారం ఆయన కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, అటవీశాఖ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. కృత్రిమ మేధతో తయారు చేసే నకిలీ వీడియోలు, ఫొటోలు కరోనాను మించిన మహమ్మారిలాంటివని.. ఇండో-పాక్, ఇండో-చైనా వివాదాలు, ఘర్షణలకు దారి తీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్‌ను సృష్టించే ప్రమాదముంటుందనే చర్చ ఈ సమీక్షలో జరిగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం లాక్కున్నట్టుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల సమావేశంలో ఆందోళన వ్యక్తమైంది. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఫేక్ కంటెంట్ నిరోధానికి తగిన

మిగతా 13వ పేజీలో...

కంచ గచ్చిబౌలిలో ఏం జరుగుతోంది?.. మంత్రుల కమిటీతో మీనాక్షి భేటీ 13

నేడు భద్రాద్రికి సీఎం

సీతారాముల కల్యాణానికి హాజరై పట్టువస్త్రాలు సమర్పించనున్న రేవంత్‌రెడ్డి 13

ఇంటికెళ్లి సంతకం చేయించండి

నీటిపారుదల సమీక్షకు ముఖ్య కార్యదర్శి గైర్హాజరు.. అధికార్లకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

సీతారామ సవరణ జీవో జారీకి నిర్దేశం

సెక్రటరీ ఫోన్ ఎత్తడం లేదన్న అధికారులు

చర్చనీయాంశమైన వ్యవహారం 2

అమెరికాలో టారిఫ్‌ల కల్లోలం

తిప్పికొడుతున్న ట్రంప్ సుంకాల నిర్ణయం

ఇతర దేశాల దిగుమతులపై అడ్డగోలు సుంకాల ఎఫెక్ట్

నిత్యావసర ధరలు పెరుగుతాయన్న ఆందోళనలో అమెరికన్లు

ఉన్నవీ, లేనివీ ఇప్పుడే కొనేందుకు ప్రయత్నాలు

స్టోర్ల ముందు బారులు.. సూపర్ మార్కెట్లలో సరుకులు ఖాళీ

వస్త్రాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాల దాకా ఇదే పరిస్థితి

ధరలు పెంచిన వ్యాపారులు.. పాత స్టాకుకు కొత్త రేట్లు

ధరల భయంతో అవసరం లేనివి, తాహతుకు మించినవి కొంటూ అప్పుల పాలవుతున్న అమెరికన్లు

అమెరికాలోని భారతీయులపైనా ధరాఘాతం ప్రభావం

విద్యార్థులపై ఖర్చుల వాత.. ఉద్యోగుల పొదుపులో కోత

వాషింగ్టన్, ఏప్రిల్ 5: ప్రపంచ దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై ట్రంప్ విధిస్తున్న టారి‌ఫ్‌లతో అమెరికాలో కల్లోలం మొదలైంది. విదేశాల ఉత్పత్తులపై గంపగుత్తగా సుంకాలు పెంచి ట్రంప్ వాటికి ముకుతాడు వేయడం ఏమోగానీ.. ఆ అడ్డగోలు సుంకాల ప్రభావం అమెరికాలో అప్పుడే కనిపిస్తోంది. ఆ దేశంలో వినియోగించే సరుకులు, వస్తువులలో చాలా వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవే కావడంతో.. ధరలు పెరిగిపోతాయని స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఎందుకైనా మంచిదన్న ఉద్దేశంతో ధరలు తక్కువగా ఉన్నప్పుడే అవసరమైనవన్నీ కొనిపెట్టేసుకోవాలన్న ఆలోచన పెరిగింది. దీనితో అమెరికాలోని సూపర్ మార్కెట్లు, గ్రాసరీ స్టోర్లకు జనం ఎగబడుతున్నారు. చాలా స్టోర్లలో సరుకుల ర్యాక్స్ ఖాళీగా కనిపిస్తున్నాయంటూ అక్కడి మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో

మిగతా 14వ పేజీలో...

ఇలాంటి చర్యలే నేను తీసుకొని ఉంటే.. ఇప్పుడు మౌనంగా ఉన్నవారు అప్పుడెలా వ్యవహరించేవారో ఊహించడం కష్టం. కొత్త టారిఫ్‌లు అమెరికాకు మేలు చేస్తాయని నేను అనుకోవడం లేదు. - బరాక్ ఒబామా





పాంబన్ రైలు బ్రిడ్జి

ఆధునిక 'రామ సేతు'!

ఇంజనీరింగ్ అద్భుతం పాంబన్ రైలు బ్రిడ్జి

మండపం-రామేశ్వరం మధ్య సరికొత్త వారధి

నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

2.07 కి.మీ. పొడవు.. 535 కోట్ల వ్యయం

తొలి 'వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జి'గా ఖ్యాతి

శ్రీలంక పర్యటనలో ప్రధాని.. చరిత్రాత్మక రక్షణ ఒప్పందం.. మోదీకి మిత్ర విభూషణ అవార్డు

(చెన్నై, ఆంధ్రజ్యోతి) దేశమంతా రాములోరి కల్యాణానికి సిద్ధమైంది. ఇదే సమయంలో శ్రీరాముడు నడయాడిన పాంబన్ దీవి మరో అద్భుత ఆవిష్కరణకు వేదికవుతోంది. రావణ లంకకు వెళ్లేందుకు నాడు వానర సేన నిర్మించినట్లు విశ్వసించే రామసేతు మొదలయ్యేది

మిగతా 14వ పేజీలో...

'నమస్తే'పై విజిలెన్స్

తెలంగాణ టుడే, టీన్యూస్‌పైనా.. గత సర్కారు హయాంలో సొంత మీడియాకే భారీగా ప్రకటనలు

రూ.348.43 కోట్ల యాడ్స్‌పై ప్రభుత్వం సీరియస్

ప్రకటనల లోగుట్టు విప్పనున్న విజిలెన్స్ 13

అప్పట్లో సమాచార శాఖకు కేసీఆర్ ప్రాతినిధ్యం

ఈ కేసులో ఆయననూ విచారించే అవకాశం

86 మంది మావోయిస్టుల లొంగుబాటు

వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళలు

అంతా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాల వారే

ఒక్కొక్కరికి రూ.25 వేల ప్రభుత్వ సాయం అందజేత 3

ఆయుధాలు విడిచిపెట్టండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి.. మావోయిస్టులకు కేంద్ర మంత్రి అమిత్ షా పిలుపు

విదేశీ డిగ్రీకి దేశీయ పట్టా



యూజీసీ కొత్త మార్గదర్శకాలు

జాప్యాన్ని తగ్గించడమే లక్ష్యం 14

బీఆర్ఎస్‌ను మించిన దోపిడీ

వాళ్లు పదేళ్లలో రూ.20 వేల కోట్ల విలువైన భూములమ్మారు

వీళ్లు ఏడాదిలోనే రూ.50 వేల కోట్ల భూములు అమ్మాలని చూస్తున్నారు

భవిష్యత్తు తరాలకు గజం భూమైనా మిగల్చరా?

విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి

అంబేద్కర్‌ను, జగ్జీవన్‌రామ్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు 2



బీఆర్ఎస్‌ను మించిన కాంగ్రెస్ దోపిడీ

- వాళ్లు పదేళ్లలో 20 వేల కోట్ల విలువైన భూములమ్మారు
- వీళ్లు ఏడాదిలో 50 వేల కోట్ల భూములమ్మాలని చూస్తున్నారు
- భవిష్యత్ తరాలకు గజమైనా మిగల్చరా?: సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భూముల అమ్మకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్‌ను మించిపోతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రూ.20 వేల కోట్ల విలువైన భూములను విక్రయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ.50 వేల కోట్ల విలువైన భూములు విక్రయించి, పెద్దమొత్తంలో దండుకునేందుకు సిద్ధమైందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు భావితరాలకు గజం జాగా కూడా లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బండి సంజయ్ నివాళులర్పించారు. అనంతరం, మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిందన్నారు. ప్రభుత్వ వైఖరిని విమర్శించిన స్కాలర్ రోహిత్‌పై దాడి చేయడమే కాకుండా ఆయన్ను జైలుకు పంపించారన్నారు. రోహిత్ మీద అక్రమ ఆయుధాల కేసు పెట్టి ఆయన జీవితాన్ని నాశనం చేస్తారా? అని మండిపడ్డారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అట్టడుగువర్గాల ఆణిముత్యం జగ్జీవన్‌రాం అని సంజయ్ కొనియాడారు. 'కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ. అంబేద్కర్‌ను పార్లమెంటులో అవమానించి మంత్రి పదవికి రాజీనామా చేయించింది. డుప్లికేట్ గాంధీలకు భారతరత్న ఇచ్చిన కాంగ్రెస్ పాలకులు అంబేద్కర్‌ను మాత్రం విస్మరించారు. ప్రధాని అయ్యే అర్హత ఉన్న నేత జగ్జీవన్‌రాం. కానీ, దళితుడికి అవకాశం ఇవ్వవద్దన్న కుట్రతో నాడు ఇందిర ఎమర్జెన్సీ విధించింది' అని సంజయ్ ఆరోపించారు.

ఆఫీసు లీజుల్లో తెలంగాణ వెనకడుగు: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కొత్త ఐటీ పార్కుల కోసం ఆలోచించే ముందు గణనీయంగా తగ్గిపోతోన్న ఆఫీసు లీజింగ్ స్థలాల విషయంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా కోరారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 41 శాతం ఆఫీసు వసతి లీజు తెలంగాణలో తగ్గిపోయిందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్‌లో ఆఫీసు వసతి లీజుకి విపరీతమైన డిమాండ్ ఉండేదని, నేడు ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పెద్ద కంపెనీలు ఇటువైపు చూసే పరిస్థితి కన్పించడం లేదని ఆయన అన్నారు. బుల్డోజర్లతో ఉద్యోగాలు రావని, సరైన పారిశ్రామిక నిర్ణయాలు, భరోసాతోనే అవి సాధ్యమవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. బెంగళూరులో గత ఏడాది తొలి త్రైమాసికంలో ఆఫీసు వసతి లీజు 4.0గా ఉంటే ఈ ఏడాది 4.5కి పెరిగిందని ఇది 13 శాతం పెరుగుదల అని, తెలంగాణలో గత ఏడాది 2.9 ఉంటే ఈ ఏడాది 1.7కి చేరుకుందని, ఇది మైనస్ 41 శాతం అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ 3 పార్టీలు కుమ్మక్కు: లక్ష్మణ్

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కయ్యాయని బీజేపీ ఎంపీ- పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కే లక్ష్మణ్ ఆరోపించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఎంఐఎంకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపు కోసం అభ్యర్థులనే పోటీలో పెట్టలేదన్నారు. మూడు పార్టీల కుమ్మక్కు రాజకీయాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటు వక్ఫ్‌బోర్డులో పారదర్శకత కోసమే కేంద్రం కొత్త చట్టం తెచ్చిందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విక్రయాలు నిలిపేయాలని పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలు మాట్లాడారని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై ప్రాంతీయ పార్టీల ముసుగులో డీఎంకే ద్వారా కాంగ్రెస్ ఆడిస్తున్న నాటకంలో బీఆర్ఎస్ పాత్రధారి అని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

ఇంటికెళ్లి సంతకం చేయించండి

సమీక్షకు ముఖ్య కార్యదర్శి గైర్హాజరుతో మంత్రి ఆదేశం.. నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

- సీతారామ సవరణ అంచనాలకు జీవో జారీ చేయాలని నిర్దేశం
- సెక్రటరీ ఫోన్ కూడా ఎత్తడం లేదన్న అధికారులు
- చర్చనీయాంశమైన ముఖ్య కార్యదర్శి వ్యవహారం



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి వ్యవహార శైలి మరోసారి చర్చనీయాంశం అయింది. సీనియర్ ఐఏఎస్ అయిన ఆయనకు నిజాయితీపరుడిగా పేరున్నప్పటికీ.. విధులు, బాధ్యతల పట్ల ప్రభుత్వం ఆశించినంత వేగంగా స్పందించడం లేదనే అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై శనివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు ముఖ్య కార్యదర్శి గైర్హాజరయ్యారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలంలో పర్యటించనుండడంతో.. సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సంబంధించి సవరణ అంచనాలకు పరిపాలనపరమైన అనుమతినిస్తూ జీవో జారీ చేయాలని సమీక్ష సందర్భంగా మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. అయితే ముఖ్య కార్యదర్శి ఫోన్ ఎత్తడంలేదని, అలాంటప్పుడు జీవో ఎలా జారీ చేయాలని అధికారులు విన్నవించుకున్నారు. దీంతో, "ఇంటికెళ్లి.. ఫైలుపై సంతకం చేయించుకొని రండి. వెంటనే పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ ఈ రోజే (శనివారం) జీవో జారీ చేయండి" అంటూ మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. వాస్తవానికి సీతమ్మసాగర్ ప్రాజెక్టు సవరణ అంచనాలను నిశితంగా పరిశీలించి.. హేతుబద్ధంగా ఉన్నాయో, లేదో ప్రతిపాదనలు పరిశీలించాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శి రామకృష్ణారావుకు ఇటీవలే మంత్రివర్గం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సవరణ అంచనాలకు రామకృష్ణారావు ఆమోదముద్ర కూడా వేశారు. కాగా, ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో పాటు సన్నబియ్యం అందుకుంటున్న లబ్ధిదారుడి ఇంట్లో భోజనం కూడా చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుపై సీఎం ప్రకటన ఉంటుందని గుర్తించిన మంత్రి ఉత్తమ్.. వెంటనే సవరణ అంచనాలకు పరిపాలనపరమైన అనుమతులు ఇస్తూ జీవో జారీ చేయాలని ఆదేశించారు. కానీ, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి బాధ్యతలు చూస్తున్న కీలక ఐఏఎస్ అధికారి.. మంత్రి నిర్వహించిన సమావేశానికి దూరంగా ఉండటమే కాకుండా మంత్రి ఓఎస్డీలు చేసే ఫోన్ కూడా ఎత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించాలంటూ మంత్రి ఉత్తమ్ ప్రభుత్వాన్ని కోరినట్లు కూడా తెలిసింది.

ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెప్పించండి..

సమ్మక్కసాగర్ బ్యారేజీకి ఛత్తీస్‌గడ్ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తెప్పించుకోవాలని, దీనికోసం అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సమీక్ష సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఈ ఎన్‌వోసీ తెచ్చుకుంటేనే సమ్మక్కసాగర్‌కు క్లియరెన్స్‌లు ఇస్తామని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిచెప్పగా.. దాదాపు రెండేళ్లకు పైగా ఎన్‌వోసీ అంశం తేలడంలేదు. ఇక గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుతో పాటు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై సుప్రీంకోర్టులో కేసు వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనిపై ఆదివారం హైదరాబాద్‌కు రానున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో ఉత్తమ్ సమావేశం కానున్నారు. ఇదిలా ఉండగా.. కడెం, లోయర్ మానేరు, భద్రకాళి చెరువుల్లో ప్రస్తుతం జరుగుతున్న పూడికతీత పనులను ఇతర రిజర్వాయర్లకు విస్తరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జూరాల, నిజాంసాగర్, ఎస్ఆర్ఎస్పీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కూడా పూడికతీత చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. మరోవైపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొలిదశను రానున్న డిసెంబరుకల్లా పూర్తి చేసి, నార్లాపూర్‌లో 6.40 టీఎంసీలు, ఏదులలో 6.55 టీఎంసీలు, వట్టెంలో 16.70 టీఎంసీలు, కరివెనలో 19 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ పథకంపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. నార్లాపూర్-ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించే ప్యాకేజీ-3లోని కెనాల్ పనులను రానున్న అక్టోబరు కల్లా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇక నార్లాపూర్, ఏదుల, వట్టెం పంపింగ్ కేంద్రాల వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి వీలుగా రూ.262 కోట్లను తెలంగాణ ట్రాన్స్‌కోకు విడుదల చేశామని చెప్పారు. ఆయా పంపింగ్ స్టేషన్ ల వద్ద సబ్‌స్టేషన్‌ల నిర్మాణం పూర్తి చేసి, రానున్న జూలైలో పంపుల డ్రై రన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఔట్‌లెట్‌లో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్‌కు అనుమతించం..

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి, అచ్చంపేట) నుంచి కూడా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెలింగ్‌కు అనుమతించాలని జయప్రకాష్ అసోసియేట్స్ (జేపీ) ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని మంత్రి ఉత్తమ్ తిరస్కరించారు. తమిళనాడులోని పోర్ట్ నుంచి బేరింగ్‌లు వస్తున్నాయని, వాటిని టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)కు బిగించి.. టన్నెలింగ్ చేయాలని ఆదేశించారు. టీబీఎం ద్వారా టన్నెల్ తవ్వకానికి నిధులిచ్చాక.. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్‌కు ఎలా అంగీకరిస్తామని ప్రశ్నించారు. శ్రీశైలం (దోమలపెంట) నుంచి టన్నెల్ ఇన్‌లెట్ వైపు ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలడంతో టీబీఎం పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుతం దాని విడిభాగాలను సొరంగం నుంచి బయటికి తీస్తున్నారు. ఇన్‌లెట్‌లో మళ్లీ టీబీఎం ద్వారా టన్నెలింగ్ చేసే పరిస్థితి లేకపోవడంతో.. ఇకపై డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు ముఖ్యమంత్రి, మంత్రి కూడా అనుమతినిచ్చారు. అయితే ఔట్‌లెట్ వైపు కూడా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెలింగ్ చేస్తామని నిర్మాణ సంస్థ ప్రతిపాదించగా.. దీనిని మంత్రి తోసిపుచ్చారు.

సీఎం పర్యటన ఉండగా అమెరికా ఎలా వెళ్తావు?

సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనుండగా.. తాను వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్తున్నానని, అనుమతినివ్వాలని కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ మంత్రి ఉత్తమ్‌ను కోరారు. అయితే, 'సీఎం పర్యటన పెట్టుకొని అమెరికా ఏ విధంగా పోతావు?' అని మంత్రి ప్రశ్నించారు. దాంతో సదరు సీఈ బాధపడినట్లు తెలిసింది.

రెండు ఈఎన్‌సీ పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదనలు

నీటిపారుదల శాఖలో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. మార్చి 31న ఈఎన్‌సీ(ఓఅండ్ఎం)గా పనిచేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి పదవీ విరమణ చేయగా.. అదే రోజు చీఫ్ ఇంజనీర్(మైనర్ ఇరిగేషన్)గా పనిచేస్తున్న సీఎస్ఎస్ చంద్రశేఖర్ కూడా రిటైరయ్యారు. దాంతో ఈఎన్‌సీ(అడ్మిన్)గా కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌గా పనిచేస్తున్న అంజద్ హుస్సేన్‌కు, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం)గా ఆదిలాబాద్ సీఈగా పనిచేస్తున్న టి.శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించేందుకు, సెలవులో ఉన్న వనపర్తి చీఫ్ ఇంజనీర్ రఘునాథరావును సీఈ(మైనర్ ఇరిగేషన్)గా నియమించడానికి వీలుగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు ఈఎన్‌సీ(జనరల్) కార్యాలయంలో ఎస్ఈ(టెక్నికల్)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బస్వరాజును ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఐడీసీ) ఎండీగా నియమించాలని ప్రతిపాదించారు.

లోకం తీరు



క్యాంపస్ నుంచి బలగాలను ఉపసంహరించండి

హెచ్‌సీయూ ప్రొఫెసర్ల సంఘం డిమాండ్

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల భూమిని కాపాడుకునేందుకు ఉద్యమించిన విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని వర్సిటీ ప్రొఫెసర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సంఘం అధ్యక్షుడు భూక్యా బాంగ్యా ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూకి ప్రభుత్వం ఇచ్చిన మొత్తం భూమిని.. అంటే ఆ 400 ఎకరాలతో సహా 2,300 ఎకరాలను వర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ప్రొఫెసర్ల సంఘం కోరింది. హెచ్‌సీయూ భూమిలో జీవ వైవిధ్య వారసత్వ మండలాలను గుర్తించి అధికారికంగా ప్రకటించాలని సూచించింది. హెచ్‌సీయూ భూమికి సరిహద్దు గోడ నిర్మించాలని డిమాండ్ చేసింది.

54 మంది హెచ్‌సీయూ విద్యార్థులపై కేసు

హెచ్‌సీయూలో 54 మంది ఏబీవీపీ విద్యార్థులపై గచ్చిబౌలి ఠాణాలో కేసు నమోదైంది. పీహెచ్‌డీ విద్యార్థి అబ్రహం తదితరులపై 175 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ కింద పోలీసులు కేసు పెట్టారు.

కుక్క కాటు వల్లే జింక మృతి

గాయపడ్డ మరో జింక జూకు తరలింపు

హైదరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ అటవీ ప్రాంతంలో జింక మృతికి కుక్క కాటే కారణమని వైద్యులు నిర్ధారిచారు. జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అదే ప్రాంతంలో గాయపడ్డ మరో జింకకు ప్రాథమిక చికిత్స చేసి.. నెహ్రూ జూ పార్కుకు తరలించారు. హెచ్‌సీయూ అటవీ ప్రాంతంలో కుక్కలు కరిచి జింకలు గాయపడటం, మృతిచెందడం తరచూ జరుగుతుంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో మంత్రి పొన్నం

యూత్ కాంగ్రెస్ రక్షణ కవచంలా ఉండాలి

- పార్టీ నేతలంతా కష్టపడి పని చేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి యూత్ కాంగ్రెస్ రక్షణ కవచంలా పని చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్య నిర్వాహక సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే జూన్, జూలైలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్‌కు తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారంలో యూత్ కాంగ్రెస్ పాత్ర ఆశించిన స్థాయిలో లేదని, సామాజిక మాధ్యమాల్లో యూత్ కాంగ్రెస్ మరింత దూకుడుగా వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని, రాజీవ్ యువ వికాసంపై అవగాహన పెంచాలని సూచించారు. కంచ గచ్చిబౌలి భూములపై ప్రతిపక్షాల అనైతిక విషప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి విష్ణునాథ్ సమక్షంలో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సన్నబియ్యం, రూ.500లకు గ్యాస్, ఉచిత విద్యుత్, వడ్లకు బోనస్ వంటి అనేక పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడానికి యూత్ కాంగ్రెస్ ప్రణాళికాబద్ధంగా ప్రచార కార్యక్రమాలనుచేపట్టాలని కోరారు. యూత్ జోడో- బూత్ జోడో కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లి సోషల్ మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు సంపత్ కుమార్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే టీడీపీ స్థాపన

- తెలుగుదేశంతోనే బలహీన వర్గాలకు న్యాయం
- పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... బాబు జగ్జీవన్ రామ్ బీహార్‌లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చి వివిధ పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆదర్శాలకు, టీడీపీ సిద్ధాంతాలకు అవినాభావ సంబంధం ఉందని అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్టీఆర్ రాజ్యాధికారంలో బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేశారని తెలిపారు. అదే దారిలో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బలహీనవర్గాలకు పెద్దపీట వేశారన్నారు.

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

విశేషమైన సేవలు అందించిన షమీమ్ అక్తర్ సేవలను మరోసారి వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆయననే మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా నియమించాలని గట్టిగా పట్టుబట్టారు. ఈ మేరకు షమీమ్ అక్తర్ పేరును ఖరారు చేసి గవర్నర్ ఆమోదం కోసం ఫైలును శనివారం పంపించినట్లు తెలిసింది. మానవ హక్కుల కమిషన్‌కు సాధారణంగా చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమిస్తారు. హైకోర్టు లేదా జిల్లా కోర్టు రిటైర్డు జడ్జిని ఒక సభ్యుడిగా, మానవ హక్కుల విషయంలో నిపుణుడైన మరో వ్యక్తిని రెండో సభ్యుడిగా నియమిస్తారు. సభ్యుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ నియామక ఉత్తర్వులను గవర్నర్ సోమవారం వెలువరించవచ్చని తెలిసింది.

ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి?

సీఐసీ పోస్టుకు మొదట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేరు వినిపించింది. ఆమె ఈ నెలాఖరున సీఎస్‌గా పదవీ విరమణ చేయనున్నారు. సీఐసీగా నియమించడానికి ప్రభుత్వం ఆఫర్ చేసినట్లు సమాచారం. ఆమె అయిష్టంగా ఉండడంతో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లో కార్యదర్శిగా ఉన్న డా. జీ చంద్రశేఖర్‌రెడ్డి పేరును పరిశీలించినట్లు తెలిసింది. ఆయన పేరు దాదాపు ఖరారు అయినట్లు సమాచారం. కానీ, ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. గతంలో చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో ఆయనను సీఎంవోలో కార్యదర్శిగా సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు. అప్పటి నుంచి సీఎంవోలో వ్యవసాయం, పశుసంవర్ధక, అటవీ శాఖల అంశాలను చూస్తున్నారు. సీఐసీగా చంద్రశేఖర్‌తో పాటు మరో ఐదుగురు రాష్ట్ర కమిషనర్లను కూడా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. 10 మంది వరకు రాష్ట్ర కమిషనర్లను నియమించే అవకాశం ఉంటుంది. కానీ... ఐదుగుర్ని నియమించుకుంటే చాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నట్లు తెలిసింది. ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకానికి సంబంధించి మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్ర కమిషనర్ పదవులకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకసారి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి దరఖాస్తులను ఆహ్వానించడంతో దాదాపు 400 వరకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వీటిని పరిశీలించి, పదవులను భర్తీ చేయడం ప్రభుత్వానికి కాస్త ఇబ్బందికరంగానే మారింది. కాగా, ఉప లోకాయుక్తగా బీసీ వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం యోచించినట్లు సమాచారం. సీఐసీగా చంద్రశేఖర్‌రెడ్డి నియమితులైతే... మూడు కీలక పదవుల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చినట్లవుతుందని, ఈ దృష్ట్యా ఉప లోకాయుక్త పోస్టును బీసీకి ఇవ్వాలని భావించినట్లు తెలిసింది.

కేసీఆర్ గైర్హాజరు

సీఐసీ నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత కేసీఆర్ గైర్హాజరయ్యారు. సాధారణంగా దీనిపై ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, సీనియర్ మంత్రితో కూడిన త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకోవాలి. ఈ కమిటీలో సభ్యుడిగా ప్రతిపక్ష నేత కేసీఆర్ పాల్గొనాల్సి ఉంది. సమావేశానికి రావాల్సిందిగా నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం కేసీఆర్‌కు లిఖితపూర్వక వర్తమానం పంపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో సీఎం రేవంత్ రెడ్డి, సీనియర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి సీఐసీ నియామకంపై చర్చించినట్లు తెలిసింది.

మళ్లీ మండిపోనున్న ఎండలు!

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో మంగళవారంఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటే అవకాశం ఉందని పేర్కొంది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మినహా అన్ని జిల్లాలకు ఎండ తీవ్రతకు సంబంధించి ఆరేంజ్ అలెర్ట్ జారీ చేసింది. అయితే సోమవారం మాత్రం రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


శంకర్ (ఫైల్)

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని బండమీది పల్లి గ్రామానికి చెందిన పిట్టల శంకర్(30) శనివారం వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లొచ్చిన అనంతరం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతణ్ణి వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి శంకర్ మృతిచెందాడు.

నిమ్మకాయ ధరకు రెక్కలు

- నారాయణఖేడ్‌లో కిలో రూ.200
- తగ్గిన దిగుబడి.. పెరిగిన డిమాండ్

నారాయణఖేడ్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి కావడంతో ఎండలు భగభగమండుతున్నాయి. ఎండల్లో తిరిగితే వడదెబ్బ బారిన పడకుండా నిమ్మకాయలు వాడతారు. కానీ, ఎండాకాలం సీజన్ ప్రారంభంలోనే నిమ్మకాయల ధరలు సైతం ప్రజలకు చుక్కలు చూపుతున్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ కూరగాయల మార్కెట్‌లో ఇటీవలి వరకూ కిలో నిమ్మకాయలు రూ.100లకు విక్రయిస్తే.. ఒక్కో నిమ్మకాయ సైజ్‌ను బట్టి రూ.5-10 పలికాయి. మూడు రోజులుగా కిలో నిమ్మకాయలు రూ.200లకు విక్రయిస్తున్నారు. ఒక్క నిమ్మకాయను రూ.10 నుంచి రూ.20లకు విక్రయిస్తున్నారు. దీంతో వాటిని కొనుగోలు చేయడానికి జనాలు భయపడుతున్నారు. ఈ సీజన్‌లో నిమ్మకాయల దిగుబడి తగ్గడంతో పాటు వాటికి గిరాకీ ఎక్కువగా ఉండటంతో ఒక్కసారిగా వాటి ధర పెరిగిందని చెబుతున్నారు.





ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ద్వితీయ భాషగా తెలుగు తప్పనిసరి వద్దు

- ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి
- హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శాంతియుతంగా ధర్నా

కవాడిగూడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగును ద్వితీయ భాషగా తప్పని సరిచేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశాలను పునరాలోచించాలి. ప్రత్యేక నిర్ణయం తీసుకొని చిన్నారుల భవిష్యత్‌ను కాపాడాలి" అని హైదరాబాద్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రభుత్వం తెలుగును ద్వితీయ భాషగా తప్పనిసరి చేయడాన్ని నిరసిస్తూ వారు వారి పిల్లలతో కలిసి శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల ప్రతినిధులు రాహుల్ కేజ్రీవాల్, శృతి జగదీశ్ తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యా స్వేచ్ఛను పరిమితం చేసి.. భాషా ప్రాధాన్యతలను విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటినుంచి తెలుగుచదివిన విద్యార్థులతో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పోటీపడలేరని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించి ద్వితీయ భాషగా నచ్చిన భాషను ఎంచుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

గుంటూరులో బర్డ్‌ఫ్లూ రీజనల్ సర్వేలెన్స్ సెంటర్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరులో బర్డ్‌ఫ్లూ రీజనల్ సర్వెలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పనిచేసే స్టేట్ లెవెల్ వైరస్ రీసెర్చ్ అండ్ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీ (వీఆర్‌డీఎల్)కి అనుబంధంగా ఈ సెంటర్ పని చేస్తుంది. ఈ ల్యాబ్‌కు అవసరమైన డయాగ్నోస్టిక్ కిట్లను, కన్స్యూమబుల్స్‌ను పుణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్ (ఎన్‌ఐవీ) సరఫరా చేస్తుంది. ఈ రాష్ట్ర స్థాయి వైరస్ పరిశోధన, పరీక్షా కేంద్రానికి స్వైన్‌ఫ్లూ, ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ఏ, బీ తదితర వ్యాధులతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏలో రెండు సబ్ టైప్‌లను నిర్ధారించే సాంకేతిక పరిజ్ఞానం ఉంది. ఇకపై బర్డ్ ఫ్లూ తదితర అనుమానిత కేసులు నమూనాలను సేకరించినప్పుడు వాటిని ఐసీఎంఆర్ ద్వారా పుణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు శాంపిల్స్ పంపుతారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూ వైరస్‌తో మృతి చెందిన సంఘటన నేపథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)కి చెందిన సెంట్రల్ టీమ్ సభ్యులు, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వెలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) స్టేట్ అధికారులు శనివారం గుంటూరు వైద్య కళాశాలకు వచ్చారు. మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న రాష్ట్రస్థాయి వైరస్ పరిశోధన, పరీక్షా కేంద్రాన్ని (వీఆర్‌డీఎల్) సందర్శించారు. వీఆర్‌డీఎల్‌కు చెందిన సైంటిస్టులు లోకేశ్, మైమూనా, డాక్టర్ వాణిశ్రీ తదితరులతో ఈ కేంద్ర బృందం సుమారు గంటన్నరపాటు సమావేశమై వివిధ అంశాలను చర్చించింది. ల్యాబ్ పని తీరుపై ఐసీఎంఆర్ వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.


వేడుకల్లో సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్న తెలుగువారు

ఒమాన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

- సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఒమాన్ దేశంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తెలుగు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆధ్యాత్మికత వాతావరణంలో శోభాయమానంగా నిర్వహించారు. ఒమాన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో మస్కట్ నగరంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఇండియన్ సోషల్ క్లబ్ చైర్మన్ పి.బాబు రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి షకీల్ కొమ్మత్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ వేడుకకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంప్రదాయ వస్త్రధారణతో వందలాది మంది హాజరుకావడంతో తెలుగతనం వెల్లివిరిసింది. ఒమాన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండేటి గణేశ్, కో కన్వీనర్ నూనె లక్ష్మణ్ నేతృత్వంలో వైవిధ్యభరిత సాంస్కృతిక కార్యక్రమాలతో ఉగాది సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మస్కట్‌లోని ప్రముఖ వేద పండితులు, సిద్ధాంతి విజయ పంచాంగ పఠనం చేశారు. కుల, మత, ప్రాంతీయ వివక్షకు తావులేకుండా తెలుగువారందరిని కలుపుకుంటూ, అందరి సమన్వయంతో ఒమాన్ తెలంగాణ సమితి పని చేస్తోందని గణేష్, లక్ష్మణ్ తెలిపారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎంఎం సుందరేశ్, డాక్టర్ జి.విశ్వనాథన్ తదితరులు

అంకితభావంతో లక్ష్యసాధన

- విద్యార్థులకు జస్టిస్ సుందరేశ్ పిలుపు
- ఘనంగా వీఐటీ యూనివర్సిటీ డే

వేలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో కష్టపడి విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం వేలూరులో జరిగిన వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) యూనివర్సిటీ డేకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుందరేశ్.. వివిధ క్రీడా, ప్రతిభా పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.1.4 కోట్ల విలువైన బహుమతులను వర్సిటీ అందజేసింది. అనంతరం జస్టిస్ సుందరేశ్ మాట్లాడుతూ.. శిక్షణ, అభిరుచి ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. చైనాకు చెందిన ఝూ వెన్‌జున్ అనే అమ్మాయి చిన్న వయసులోనే చెస్ నేర్చుకుని గొప్ప ఆటగాళ్లందరినీ ఓడించి ప్రపంచ చాంపియన్‌గా నిలిచిందని తెలిపారు. యాపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ ఎన్నో పోరాటాల తర్వాత విజయాన్ని అందుకున్నారన్నారు. ఈ విజయాలకు కారణం వారి కఠోర శ్రమయేనని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాల్లో వివిధ విభాగాల్లో అవార్డులు పొందిన 3,200 మంది విద్యార్థులను అభినందించారు. ఉన్నత విద్యలో ప్రభుత్వాలు మరింత ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి లార్సన్ అండ్ టూబ్రో కార్పొరేట్ సెంటర్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గణేశన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, రమణి బాలసుందరం, వైస్ చాన్సలర్ డాక్టర్ కాంచన భాస్కరన్, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.జయభారతి తదితరులు పాల్గొని విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.

మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- 86 మంది దళ సభ్యుల లొంగుబాటు
- అంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన వారే
- 'ఆపరేషన్ చేయూత' వల్లే లొంగుబాట్లు: ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- ఒక్కొక్కరికి రూ.25 వేల ప్రభుత్వ సాయం
- తెలంగాణలో లొంగిపోతున్న ఛత్తీస్‌గఢ్ మావోయిస్టులు



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శనివారం ఒకేరోజు ఏకంగా 86 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతుండడం, లొంగిపోయిన వారంతా ఆ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందినవారే కావడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల పోలీసుల సమక్షంలో వీరు లొంగిపోయారు. లొంగిపోయిన ఈ మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి తక్షణ సాయంగా రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ పేరుతో బలవంతపు వసూళ్లు ఆపాలని పోలీసులు నిర్ణయించి స్పెషల్ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గడచిన నాలుగు నెలల్లో కొత్తగూడెం జిల్లాలో 203 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు, మరో 66 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం పోలీసు అధికారులు మావోయిస్టులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి లొంగిపోయేందుకు ఒప్పించారని, పోలీసులపై నమ్మకం ఏర్పడిన తరువాతనే వీరంతా లొంగిపోయారని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల తీరుతోనే..

చర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగుతున్న యుద్ధంతో దండకారణ్యం వార్‌జోన్‌గా మారింది. గత 21 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీకి వరుస ఎన్‌కౌంటర్లతో కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పార్టీలో పనిచేస్తున్న మిలీషియా, దళ, డివిజన్, జిల్లా, దండకారణ్య, రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు అడవుల్లోకి దూసుకుపోతున్నాయి. పోలీస్ క్యాంపులు పెట్టే క్రమంలో మావోయిస్టు పార్టీకి సహకరించే సభ్యులను గుర్తించి అరెస్టు చేస్తున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలోని మావోయిస్టు పార్టీ సభ్యులు పెద్దసంఖ్యలో లొంగిపోతున్నారు. అనుకూల పరిస్థితులను బట్టి ఆయా రాష్ట్రాల పోలీసుల వద్ద లొంగిపోతున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు పార్టీ సభ్యులు తెలంగాణలో లొంగుబాట పట్టారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమమే ఇందుకు కారణమని అంటున్నారు. ఇక్కడి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, సౌకర్యాలు వారిని ఆకర్షిస్తున్నట్లు చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుమారు 120 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు తెలంగాణలో లొంగిపోయారు. ఏకపక్షంగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లు, అరెస్టులు కూడా ఈ లొంగుబాట్లకు కారణాలుగా కనిపిస్తున్నాయి. అయితే లొంగుబాట్ల విషయంలో ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కూడా అక్కడి మావోయిస్టులు తెలంగాణకు రావడానికి కారణంగా నిలుస్తోందని పేర్కొంటున్నారు. లొంగిపోవడానికి ముందుకొచ్చేవారికి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా విచారణ పేరుతో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే తమకు అవసరమైన సమాచారం వచ్చేవరకూ వారి లొంగుబాటును నిర్ధారించడం లేదని చెబుతున్నారు.

ప్రజా పాలన ఓర్వలేక హరీశ్‌రావు లేఖలు

ప్రభుత్వ విప్‌లు బీర్ల, రామచంద్రు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని నడుపుతున్న రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఓర్వలేక లేఖలు రాస్తున్నారని ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, రామచంద్రు నాయక్ విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను అణచివేసిన హరీశ్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. రాహుల్ గాంధీకి లేఖలు కాదు కదా.. ఆయన పేరెత్తే అర్హత కూడా హరీశ్‌కు లేదని మండిపడ్డారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇరువురు నేతలు మాట్లాడారు. ప్రజా పాలనను చూసి ఓర్వలేక హరీశ్‌రావు, కేటీఆర్ నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అవినీతి డబ్బుతో సోషల్ మీడియాలో సర్కారుపై తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వేల ఎకరాలు అమ్ముకుని, లక్షల ఎకరాల్లో అడవులను మాయం చేశారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సొమ్ము జీతంగా తీసుకుని ఫాంహౌస్‌లో సేద తీరుతున్న కేసీఆర్‌ను ప్రజల్లోకి రమ్మంటూ ముందు హరీశ్‌రావు లేఖలు రాయాలని వ్యాఖ్యానించారు.

రజిత కంట బొట్టు కన్నీరొస్తే ఒట్టు!

- పిల్లలను చంపుకొన్నానన్న పశ్చాత్తాపమే లేదు
- ప్రియుడితో ఫోన్లో కబుర్లు.. భర్త, పిల్లలపై చికాకు
- పిల్లల్ని చంపేంత సీన్ నీకుందా అని ఆమెను రెచ్చగొట్టిన ప్రియుడు


రజిత (ఫైల్)

అమీన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆ రజిత మనసెంత కఠినం? నిలువెల్లా ఆవహించిన ప్రియుడి మత్తు ఆమెను ఇప్పటికీ వదల్లేదు!. తన ముగ్గురు పిల్లలనూ తానే చంపేసి.. ఆ నేరం భర్తపై నెట్టి.. అతడిని ఇరికించేందుకు విషాహారం నాటకమాడి అడ్డంగా దొరికిపోయినా కూడా ఆ తల్లిలో ఇసుమంతైనా పశ్చాత్తాపం కనిపించడం లేదు. పిల్లల యాదిలో ఆమె బొట్టు కన్నీరు కార్చితే ఒట్టు! భర్త చెన్నయ్య మాత్రం బిడ్డలను గుర్తుచేసుకుంటూ కుమిలిపోతున్నాడు. ఆయనకు కునుకు కరువైంది. పిల్లలతో గడిపిన ప్రతి క్షణం కళ్ల ముందు కదలాడుతోందని, డాడీ అంటూ పిల్లలు పిలుస్తున్నట్లు అనిపిస్తోందని చెప్పాడు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగిన ఘోరం అటు స్థానికులనూ కలవరపాటుకు గురిచేస్తోంది. బిడ్డలను కన్నతల్లే పొట్టనబెట్టుకోవడం ఏమిటి? అని వారంతా చర్చించుకుంటున్నారు. రజితకు టెన్త్ బ్యాచ్‌కు చెందిన స్నేహితుల నుంచి గెట్ టు గెదర్‌కు ఆహ్వానం వస్తే వెళ్లేందుకు తాను ఓకే చెప్పడమే ఘోరానికి కారణమైందని భర్త చెన్నయ్య అంటున్నాడు. గెట్ టు గెదర్‌లో ఆమెకు శివకుమార్ అనే చిన్ననాటి మిత్రుడితో చనువు ఏర్పడి.. అది వివాహేతర సంబంధం దాకా వెళ్లి.. భర్త, పిల్లలను మరిచిపోయేలా చేసింది. భర్తను వదిలేసి శివను పెళ్లిచేసుకోవాలని రజిత భావించింది. శివతో ఇదే అభిప్రాయాన్ని పంచుకుంది. "నీకు పిల్లలు లేకపోతే పెళ్లి చేసుకునేవాడిని" అంటూ శివ బీరాలు పలికాడు. అతడి మాటలను సీరియస్‌గా తీసుకున్న ఆమె పిల్లలను చంపి.. ఆ నేరాన్ని భర్తపైకి నెట్టి.. జైలుపాల్జేస్తే తనకు అడ్డే ఉండదని ఊహల్లో తేలియాడింది. నీతో పెళ్లికి నా ముగ్గురు పిల్లలు అడ్డు అనుకుంటే వారిని చంపేస్తానని రజిత చెప్పగా నీకు అంత సీన్ ఉందా? అంటూ శివ ఆమెను రెచ్చగొట్టినట్లు తెలిసింది. అయితే పిల్లలను ఎలా చంపాలి? అనే విషయంలో ప్రణాళికను శివే రూపొందించినట్లు తెలుస్తోంది. అతడు చెప్పినట్లే.. విషాహారం డ్రామాలో భాగంగా పెరుగన్నం, పప్పన్నం అంటూ పోలీసులను రజిత తప్పుదోవపట్టించే ప్రయత్నం చేసింది. కడుపునొప్పంటూ ఆస్పత్రిలో చేరిన రజితకు ఏమీ కాలేదని డాక్టర్లు తేల్చడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తాను అడ్డంగా దొరికిపోయినా కూడా రజితలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. ప్రియుడు పరిచయ్యాక గత ఆరునెలలుగా రజిత వైఖరిలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపించిందని భర్త చెన్నయ్య చెప్పాడు. అతడితో గంటల తరబడి ఫోన్లో మాట్లాడేదని.. తనపై ఎక్కడాలేని చికాకు ప్రదర్శించేదని.. పిల్లలను అకారణంగా కొట్టేదని వివరించాడు. తన ఆస్తిని లాక్కునేందుకూ రజిత కుట్ర చేసిందని, ఇంట్లో ఆస్తి పత్రాలు కూడా కనిపించడం లేదని చెప్పాడు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా వన్ రేసు నిర్వహణ కోసం ఐఎంజీ భారత్ అనే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాలను తీసుకుంది. ఈ 400 ఎకరాలకు బదులుగా మరోచోట 397 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ వర్సిటీకి కేటాయించింది. అంటే ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ఈ 400 ఎకరాలతో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేదనుకోవాలి. ప్రభుత్వం అమ్మాలనుకుంటున్న ఈ 400 ఎకరాలను ఎవరూ కొనవద్దని, కాదూ కూడదూ అని ఎవరైనా కొంటే తాము మూడేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చాక స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించిన తర్వాత దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని ఆయనకు తెలియదా? ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి 25 సంవత్సరాలు పట్టిన విషయం మరచిపోతే ఎలా?

'కంచ' దాటిన వ్యాఖ్యలు

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ఇంత వివాదాస్పదంగా, ఉద్రిక్తంగా మారడానికి కారణాలు ఏమిటి? ఈ భూములకు సంబంధించిన అసలు వాస్తవాలు ఏమిటి? చినికి చినికి గాలివానగా మారిన ఈ వ్యవహారంపై అటు న్యాయ వ్యవస్థ, ఇటు ప్రభుత్వం వ్యవహరించిన తీరు సమర్థనీయంగా ఉందా? కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుమోటోగా విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం చేసిన తీవ్ర వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ విశ్వసనీయత, ప్రతిష్ఠపై ప్రభావం చూపవా? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూములు, ఇతర అంశాలలో గోటితో పోయే దానిని గొడ్డలి దాకా ఎందుకు తెచ్చుకుంటోంది? ఈ భూముల విషయమై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఎందుకు ఆందోళన చేశారు? ఈ భూములకు, యూనివర్సిటీకి సంబంధం ఉందా? ఇత్యాది ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశంగా ఉన్నాయి. కంచ గచ్చిబౌలి భూముల వివాదాన్ని సుమోటోగా విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాలని, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే అక్కడ చెరువు వద్ద నిర్మించే జైలులో ఉండాల్సి వస్తుందని హెచ్చరించడం కూడా జరిగింది. అయితే, సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులలో ఈ వ్యాఖ్యలు ఏవీ లేవు. ఈ నెల 16 వరకు ఆ భూములలో ఎలాంటి పనులూ చేపట్టకూడదని మాత్రమే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఈ లోపుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమకు సమగ్ర నివేదిక అందివ్వాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు, వ్యాఖ్యలు పర్యావరణ ప్రియులతోపాటు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించే వారికి సంతోషాన్ని కలిగించాయి. అయితే ఆయా కేసుల విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయా? లేక కీడు చేస్తాయా? అన్న దానిపై న్యాయవాద వర్గాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చట్టాలను మాత్రమే సమీక్షించాలా? లేదా వ్యక్తిగత అభిప్రాయాలను కూడా జోడించవచ్చా? అన్న దానిపై కూడా న్యాయ నిపుణులలో కొంత కాలంగా చర్చ జరుగుతోంది. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు తుది తీర్పు లేదా ఆదేశాలలో భాగం కావడం లేదు. అయినప్పటికీ, మీడియాలో వాటికి విశేష ప్రచారం లభిస్తుండటంతో సామాన్య ప్రజానీకం ప్రభావితం అవుతున్నారు. సదరు వ్యాఖ్యలను తీర్పులలో భాగంగానే చూస్తున్నారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ విశిష్టతకు నష్టం చేస్తుందన్న అభిప్రాయం బలంగా ఉంది. కేసులను సుమోటోగా తీసుకుంటున్న విషయంలో కూడా ప్రజలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కంచ గచ్చిబౌలి వ్యవహారాన్ని సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా తీసుకుంది. ప్రతివాది అయిన ప్రభుత్వం అభిప్రాయం కూడా తెలుసుకోకుండా తదుపరి పనులపై ఈ నెల 16 వరకు స్టే విధించింది. సదరు భూములలో చెట్లు కొట్టివేయడానికి పర్యావరణ శాఖ నుంచి అనుమతి పొందారా? అని కూడా సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. నిజమే– అమలులో ఉన్న చట్టం ప్రకారం చెట్లు కొట్టివేయాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. అయితే, ఏ సందర్భంలో కూడా ప్రభుత్వాలు ఇలాంటి అనుమతులు పొందడం లేదు. గతంలో జాతీయ రహదారుల నిర్మాణం సందర్భంగా చెట్లు నరికివేయడంపై సుప్రీంకోర్టు స్పందించింది. అప్పుడు కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయాన్ని ఆ తర్వాత అందరూ మరచిపోయారు. ఇలాంటి చట్టం ఒకటి ఉందని చాలా మంది ప్రభుత్వ అధికారులకు కూడా తెలియదు. తెలిసినా పట్టించుకోరు. అందుకే వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు విద్యుత్ శాఖ అధికారులు రహదారులకు ఇరువైపులా ఉండే చెట్ల కొమ్మలను అడ్డదిడ్డంగా నరికి వేస్తుంటారు. ఇది సర్వసాధారణం. పర్యావరణ శాఖ అధికారులు కూడా చట్టం అమలు గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఏ హైకోర్టో లేదా సుప్రీంకోర్టో స్పందించినప్పుడు మాత్రమే అది ఒక వార్త అవుతోంది. న్యాయస్థానాలు కూడా ఎప్పుడో ఒకసారి స్పందిస్తుంటాయి.

జగన్ హయాంలో పచ్చదనంపై వేటు

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన పర్యటనకు బయలుదేరిన ప్రతిసారీ రహదారులపై చెట్లను నరికిపారేసేవారు. ఈ వ్యవహారంపై మీడియాలో పుంఖాను పుంఖాలుగా వార్తలు వచ్చాయి. అయినా ఏ న్యాయస్థానమూ పట్టించుకోలేదు. పర్యావరణ ప్రియులు కూడా స్పందించలేదు. రహదారులపై ఉన్న చెట్లను ముఖ్యమంత్రి భద్రత పేరిట నరికివేయడం తప్పు కాదన్నట్టుగా అధికారులు భావించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లలేదు కాబోలు! అప్పుడు ఏ న్యాయమూర్తి కూడా సుమోటోగా విచారణ చేపట్టలేదు. విశాఖపట్నంలో రుషికొండను నిబంధనలు పాటించకుండా ముఖ్యమంత్రి నివాసం కోసం బోడిగుండుగా మారుస్తున్నారని, సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. అప్పుడు సుప్రీంకోర్టు ఇంత వేగంగా స్పందించలేదు. ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా రుషికొండను తవ్వుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవడానికి మాత్రం ఒక కమిటీని నియమించింది. మామూలుగా ఇలాగే జరుగుతుంది. కానీ, కొన్ని సందర్భాలలో మాత్రం న్యాయస్థానాలు ఇప్పటిలా స్పందిస్తాయి. అంటే, ధర్మాసనంలో కూర్చున్న వారిని బట్టి కొన్నిసార్లు ఇన్‌స్టంట్ న్యాయం లభిస్తుందన్న మాట! న్యాయస్థానాల్లో న్యాయ సమీక్ష మాత్రమే జరగాలన్నది విస్తృత అభిప్రాయం. సర్వోన్నత న్యాయస్థానానికి మన రాజ్యాంగం కొన్ని విశేష అధికారాలు కల్పించింది. అదే సమయంలో సమాజ హితం దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు మాత్రమే అమలవుతాయి. న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలు ప్రజలపై అనుకూల, ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. తాజా వివాదంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. ఆమె కెరీర్ ఆసాంతం వివాదరహితంగా సాగింది. గతంలో ఏ హోదాలో కూడా ఆమె కోర్టు ధిక్కరణకు పాల్పడిన రికార్డు లేదు. తన పనేదో తాను చేసుకుపోతుంటారు. అలాంటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేయడం సముచితమా? లేదా? అన్నది న్యాయ వ్యవస్థ ఆలోచించుకోవాలి. నిబంధనలు, చట్టాల ఉల్లంఘన జరిగినప్పుడు న్యాయ వ్యవస్థ మౌనంగా ఉండకూడదు. అలా అని వివాదం పూర్వాపరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందా? లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. కంచ గచ్చిబౌలి వద్ద ఉన్న చెరువు సమీపంలో నిర్మించే తాత్కాలిక జైలుకు వెళతారు అని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హెచ్చరించింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదేశాలను పాటించని పక్షంలో అక్కడ కొత్తగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోసం జైలును నిర్మించాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తున్నదా? అలా ఆదేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉంటుందా? సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు తుది ఆదేశాలలో లేకపోవడం గమనార్హం.

వ్యాఖ్యలు.. వివాదాలు!

ఏదేమైనా తుది ఆదేశాలలో, తీర్పులలో కనిపించని వ్యాఖ్యలను విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేయడంపై చాలా కాలంగా అభ్యంతరాలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఈ వ్యాఖ్యలు పరిధి దాటుతున్నాయి. కానీ, సామాన్య ప్రజలు మాత్రం ఆ వ్యాఖ్యలను న్యాయస్థానాల తీర్పులో భాగంగానే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ, విశ్వసనీయత మసకబారిపోయే ప్రమాదం లేకపోలేదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటానికి న్యాయస్థానాలే చొరవ తీసుకోవాలి.

అసలు వివాదం...

ఇప్పుడు కంచ గచ్చిబౌలి భూముల పూర్వాపరాల్లోకి వద్దాం! ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐఎంజీ భారత్ అనే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాలను తీసుకుంది. ఈ 400 ఎకరాలకు బదులుగా మరోచోట 397 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ వర్సిటీకి కేటాయించింది. అంటే ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ఈ 400 ఎకరాలతో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేదనుకోవాలి. ఇక చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూములు కూడా వివాదంలో చిక్కుకున్నాయి. చంద్రబాబు తర్వాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ భూముల కేటాయింపుపై విచారణకు ఆదేశించింది. దీంతో ఆ వ్యవహారం అటకెక్కింది. ఆ తర్వాత ఐఎంజీ సంస్థకు కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ వివాదం న్యాయస్థానానికి చేరుకుంది. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత సదరు భూమి ప్రభుత్వానికే చెందుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ప్రస్తుతం వివాదంగా మారిన 400 ఎకరాలను వనరుల సమీకరణలో భాగంగా విక్రయించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఈ సందర్భంగా ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరించడం వల్ల వివాదం ముదిరింది. విక్రయించాలనుకున్న 400 ఎకరాల చుట్టూ ముందుగా ఫెన్సింగ్ వేసి భూమిని ప్రభుత్వం తన ఆధీనంలోకి తెచ్చుకొని ఉండాల్సింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఈ భూములపై వివాదం నడవడం వల్ల అందులో చెట్లు పెరిగాయి. దీంతో వన్యప్రాణులు కూడా అక్కడ చేరాయి. ఏ భూమి అయినా నిరుపయోగంగా పడి ఉంటే అడవిలా మారడం సహజం. ఈ భూమిని విక్రయానికి అనుగుణంగా చదును చేయాలనుకున్న అధికార యంత్రాంగం అందులో వన్యప్రాణులు ఉన్నాయా? లేవా? అన్నది ముందుగా నిర్ధారించుకోవాల్సింది. అలా చేయకుండా హడావిడిగా డజన్లకొద్దీ జేసీబీలతో భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే పెరిగి ఉన్న చెట్లను కూల్చివేశారు. నిజానికి హైదరాబాద్ నగరంలో జింకలు, నెమళ్లకోసం ప్రత్యేక పార్కులు ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి పార్కులో వందల సంఖ్యలో నెమళ్లు ఉన్నాయి. జింకలకోసం వనస్థలిపురం, మొయినాబాద్ రోడ్డు ప్రారంభంలో, రింగు రోడ్డు సమీపంలో మరో పార్కు ఉంది. వివాదాస్పద భూముల్లో జింకలు, నెమళ్లు ఉన్న విషయం నిజమైతే వాటిని ఈ పార్కులకు తరలించి ఆ తర్వాత భూమిని చదును చేసి ఉండాల్సింది. అలా కాకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరించడం వల్ల వివాదం ఇంతదూరం వచ్చింది. చివరకు సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.

పథకాల కోసం అమ్మకాలు

ఇక భూముల అమ్మకం సమర్థనీయమా? కాదా? అంటే ఎవరి వాదన వారికి ఉంటోంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగా మాట్లాడటం మన రాజకీయ పార్టీలకు పరిపాటే. హైదరాబాద్‌లో అభివృద్ధి పనులకోసం భూములను అమ్మే ప్రక్రియకు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. అప్పుడు ఇళ్ల స్థలాలను మాత్రమే విక్రయించారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూములు విక్రయించారు. తర్వాత రాష్ట్రం విడిపోయి కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఆయన హయాంలో సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వ భూములను విక్రయించారు. ఈ విధంగా వందల, వేల కోట్ల రూపాయలు సమీకరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎన్నికల సందర్భంగా ఇస్తున్న అలవికాని హామీల అమలుకోసం ప్రభుత్వ భూములను విక్రయించడం వాంఛనీయం కాదు. అయినా అన్ని పార్టీలకూ ఈ పాపంలో భాగం ఉంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ 400 ఎకరాలను విక్రయించడాన్ని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిజానికి కేసీఆర్ హయాంలో ఈ భూముల వివాదం పరిష్కారమై ఉంటే అప్పుడే సదరు భూమిని వేలం వేసేవారు. విశ్వవిద్యాలయాలకు వందల వేల ఎకరాలు అవసరమా? మనం రాచరికంలో ఉన్నామా? అని అప్పట్లో కేసీఆర్ ప్రశ్నించారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇకనైనా ఇలాంటి సున్నితమైన విషయాలలో ఆచితూచి వ్యవహరించాలి. లేనిపక్షంలో ప్రతిపక్షాల చేతికి ఆయుధాలు ఇచ్చిన వారవుతారు. ప్రభుత్వం అమ్మాలనుకుంటున్న ఈ 400 ఎకరాలను ఎవరూ కొనవద్దని, కాదూ కూడదూ అని ఎవరైనా కొంటే తాము మూడేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చాక స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించిన తర్వాత దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని ఆయనకు తెలియదా? ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి 25 సంవత్సరాలు పట్టిన విషయం మరచిపోతే ఎలా? కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కోకాపేట వద్ద పెద్ద మొత్తంలో భూములు విక్రయించారు. అప్పుడు ఈ అమ్మకాన్ని ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అలా అని సదరు భూముల్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకోగలదా? తాము చేసేది సంసారం– ఇతరులు చేసేది వ్యభిచారం అన్నట్టుగా రాజకీయ పార్టీలు వ్యవహరించడం వల్లనే ప్రతిదీ వివాదం అవుతోంది. దీంతో ప్రజలు కూడా ఏది మంచి? ఏది చెడు? ఏది న్యాయం? ఏది అన్యాయం? అనేది తేల్చుకోలేక స్పందించడం మానేశారు.

న్యాయమూర్తుల వ్యాఖ్యలు కొన్ని సందర్భాలలో పరిధి దాటుతున్నాయి. సామాన్య ప్రజలు మాత్రం ఆ వ్యాఖ్యలను న్యాయస్థానాల తీర్పులో భాగంగానే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ, విశ్వసనీయత మసకబారిపోయే ప్రమాదం లేకపోలేదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటానికి న్యాయస్థానాలే చొరవ తీసుకోవాలి.



'ట్రంపరి తనం'...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయమే తీసుకుందాం. ఆయన ఒక అగ్ర దేశాధినేతగా కాకుండా పక్కా రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. సుంకాల విషయంలో ఆయన తన రాజకీయ జాణతనాన్ని ప్రదర్శిస్తున్నారు. వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ఆయన ఎడా పెడా సుంకాలు విధిస్తున్నారు. నిజానికి ఈ సుంకాల భారాన్ని అమెరికన్లే భరించాలి. దిగుమతి అయ్యే వస్తువుల ధరలు పెరిగితే ఆ భారం ప్రజలపైన పడుతుంది కదా? అయితే తన చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా 'అమెరికాకు విముక్తి కల్పిస్తున్నాను. దోపిడీ నుంచి కాపాడుతున్నాను' అని డొనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తున్నారు. అమెరికన్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులు కొనుగోలు చేస్తున్న దేశాలు అధిక పన్నులు వసూలు చేస్తున్నది వాస్తవమే. దీనివల్ల ఆయా దేశాల్లో వాటి ధరలు అధికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. స్వదేశీ కంపెనీలను కాపాడుకోవడానికి ఆయా దేశాలు ఈ పన్నుల శాతాన్ని నిర్ణయిస్తాయి. ఒకప్పుడు మన దేశంలో రక్షిత ఆర్థిక వ్యవస్థ ఉండేది. అప్పుడు స్వదేశీ కంపెనీలు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టలేదు. తర్వాత స్వేచ్ఛా వాణిజ్య విధానం అమలులోకి వచ్చింది. అంబాసిడర్ కారునే ఉదాహరణగా తీసుకుందాం! రక్షిత ఆర్థిక విధానం అమలులో ఉన్నప్పుడు దేశ ప్రజలకు అంబాసిడర్ కారు మాత్రమే దిక్కుగా ఉండేది. కార్లను దిగుమతి చేసుకోవాలంటే 300 శాతానికి పైగా పన్ను చెల్లించాల్సి వచ్చేది. స్వేచ్ఛా వాణిజ్య విధానం అమల్లోకి వచ్చాక అంబాసిడర్ కార్లు టెక్నాలజీ విషయంలో దిగుమతి చేసుకున్న కార్లతో పోటీపడలేక కనుమరుగయ్యాయి. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగితే పెరగవచ్చుగానీ ప్రజల జేబుకు చిల్లు పడుతుంది. ఫార్మా ఎగుమతులపై కూడా సుంకాలు వేయబోతున్నట్టు ట్రంప్ తాజాగా ప్రకటించారు. పర్యావరణ చట్టాల కారణంగా అమెరికా వంటి దేశాలలో మందుల కంపెనీలు ఆయా ఉత్పత్తులను చేపట్టలేని స్థితి. ఈ కారణంగానే మన దేశంలో ఫార్మా రంగం అభివృద్ధి చెందింది. ఫార్మా ఉత్పత్తుల వల్ల నీరు, భూమి కలుషితం కాకుండా కాపాడుకున్నందుకు గాను అమెరికా ప్రభుత్వం ఇప్పటి వరకు ఫార్మా కంపెనీలపై తక్కువ పన్నులు విధించింది. ఇప్పుడు సుంకాలు పెంచితే దాని భారం ప్రజలే భరించాలి. ఈ చర్యలన్నీ అంతిమంగా అమెరికాకు నష్టం చేయవచ్చు. అయితే, తన నిర్ణయాల వల్ల అన్ని దేశాలు దారికొస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రపంచంలో అత్యధిక దేశాలు అమెరికాను తమ పెద్దన్నగా గుర్తించి గౌరవించడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో సుంకాలు తక్కువగా విధించడం కూడా ఒక కారణం. వివిధ రూపాలలో అమెరికా నుంచి సహాయం పొందుతున్న దేశాలన్నీ అమెరికాను పెద్ద దిక్కుగా అంగీకరించాయి. ఇప్పుడు అమెరికాకు పోటీగా చైనా ఎదుగుతోంది. ట్రంప్ చర్యల వల్ల వాణిజ్య యుద్ధం ముదిరితే ఇప్పటి వరకు అమెరికా పంచన ఉన్న దేశాలు చైనా వైపు చూసే అవకాశాలు లేకపోలేదు. ట్రంప్ విధించిన సుంకాలకు పోటీగా చైనా కూడా 34 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ చర్య కూడా అమెరికన్లకు నష్టం కలిగిస్తుంది. ట్రంప్ చర్యల వల్ల ఆయనకు బలమైన మద్దతుదారుగా ఉన్న ఎలాన్ మస్క్ కూడా భారీగా నష్టపోతున్నారు.

పిచ్చితనం కాదు... అది రాజకీయం!

డొనాల్డ్ ట్రంప్ తీరు చూస్తుంటే ఆయన మన దేశంలోని రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరనిపిస్తోంది. ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం మన రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అదే విధానం అందిపుచ్చుకున్నారు. నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ మేడిపండు చందంగా ఉంది. దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తున్నానంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే ప్రయత్నం ట్రంప్ చేస్తున్నారు. తాము ఇంతకాలం నిజంగానే దోపిడీకి గురయ్యామని అమెరికన్లు ఆయన ప్రచారాన్ని నిజంగా నమ్మితే భవిష్యత్తులో తమపై పడబోతున్న భారాన్ని ఇప్పట్లో గుర్తించలేరు. చాలామంది ట్రంప్‌ను 'మెంటల్' అని నిందిస్తున్నారు. అయితే ఆయన పిచ్చివాడు కాదు. పక్కా రాజకీయ నాయకుడి అవతారం ఎత్తారు. మన నాయకుల వలె ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి పిచ్చివాళ్లను చేస్తున్నారు. ట్రంప్ చర్యలు అంతిమంగా అమెరికాకు మంచి చేస్తాయా? కీడు చేస్తాయా? అన్నది కాలమే చెప్పాలి. ఆయన మొదలెట్టిన వాణిజ్య యుద్ధం ముదిరితే అది ప్రపంచ మానవాళిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే వివిధ దేశాల స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. అమెరికా మార్కెట్లు కూడా నష్టపోతున్నాయి. ఈ పతనం ఇలాగే కొనసాగితే బ్యాంకింగ్ వ్యవస్థ కూడా కుప్పకూలుతుంది. అప్పుడు ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టే ప్రమాదం ఉంది. అమెరికా ఇప్పటికే ఆర్థిక మాంద్యం అంచున ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం వేరు, వ్యాపారం వేరు. వ్యాపారులు లాభాలు మాత్రమే చూస్తారు. ప్రభుత్వాధినేతలు ప్రజల హితాన్ని చూస్తారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్, మస్క్ వంటి వ్యాపారవేత్తలు అధికారంలోకి వచ్చారు. అందుకే వారు ప్రతి దానినీ లాభాల కోణంలోనే చూస్తున్నారు. అగ్ర రాజ్యంగా తాము చెలామణి అవడానికి కారణాలు ఏమిటి? అగ్రరాజ్యం బాధ్యతలు ఏమిటి? అని గుర్తించలేకపోతున్నారు. అమెరికా తన విధానాలను సవరించుకోని పక్షంలో ఇప్పటి వరకు మిత్ర దేశాలుగా ఉన్నవారు సైతం శత్రు దేశాలుగా మారే ప్రమాదం లేకపోలేదు. అదే సమయంలో ప్రస్తుతం అమెరికాకు ప్రత్యర్థిగా ఉన్న చైనా కొత్త మిత్రులను చేరదీసి మరింత బలపడవచ్చు. అమెరికా భవిష్యత్తు మాత్రమే కాదు, ప్రపంచ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నది డొనాల్డ్ ట్రంప్ చేతుల్లోనే ఉంది!

డొనాల్డ్ ట్రంప్ తీరు చూస్తుంటే ఆయన మన దేశంలోని రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరని పిస్తోంది. ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం మన రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అదే విధానం అందిపుచ్చుకున్నారు. నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ మేడిపండు చందంగా ఉంది. దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తున్నానంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే ప్రయత్నం ట్రంప్ చేస్తున్నారు. తాము ఇంతకాలం నిజంగానే దోపిడీకి గురయ్యామని అమెరికన్లు ఆయన ప్రచారాన్ని నిజంగా నమ్మితే భవిష్యత్తులో తమపై పడబోతున్న భారాన్ని ఇప్పట్లో గుర్తించలేరు. చాలామంది ట్రంప్‌ను 'మెంటల్' అని నిందిస్తున్నారు. అయితే ఆయన పిచ్చివాడు కాదు. పక్కా రాజకీయ నాయకుడి అవతారం ఎత్తారు. ట్రంప్ చర్యలు అంతిమంగా అమెరికాకు మంచి చేస్తాయా? కీడు చేస్తాయా? అన్నది కాలమే చెప్పాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

తెలుగు బొమ్మలో తెలంగాణ శోభ

'నా పల్లె నా కాన్వాసు, నా ప్రజలే నా వస్తువు, వాళ్ల జీవనమే నా ప్రేరణ, ఈ ప్రకృతే నాకు గురువు, నా సమాజాన్ని, సంస్కృతిని, దేశాన్ని, విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం'– 1945లో హైదరాబాద్‌లో ఒక చిత్రకళా ప్రదర్శనలో యువ రాజయ్య వ్యక్తం చేసిన మనోరథమది. ఆ మాటలను ఆయన తదనంతర జీవితమంతా నిజం చేసి చూపించారు. తెలంగాణ సంస్కృతి అన్నా, జీవనశైలి అన్నా, సంప్రదాయం అన్నా, బోనాలన్నా, బతుకమ్మ అన్నా ముందుముందుగా గుర్తుకు వచ్చేది రాజయ్య జానపద చిత్ర రాజాలే.

జానపద చిత్రాలను సాధారణంగా పురాణాలు, ఇతిహాసాలతో చిత్రిస్తారు. రాజయ్య మాత్రం అందుకు పూర్తి భిన్నంగా తెలంగాణ తెలుగు సంస్కృతిని, కాన్వాస్‌పై ప్రాథమిక రంగుల్లో ఆవిష్కరించారు. స్వస్థలమైన సిద్ధిపేట గ్రామీణులు, వారి వృత్తులు, ఉత్సవాలు, పండుగలకు సమకాలీనతను తన చిత్రాల్లో చూపించారు. తెలంగాణ సంస్కృతిని తన చిత్రాలతో విశ్వవ్యాప్తం చేశారు. రాజయ్య అంటే తెలంగాణ చిత్రం, తెలంగాణ అంటే రాజయ్య అనే విధంగా ఆయన సృజన వర్ధిల్లింది.

సిద్దిపేటలో ఒక నిరుపేద కుటుంబంలో 1925, ఏప్రిల్ 7న జన్మించిన రాజయ్య చిన్నతనంలో మట్టి ముద్దలతో బాతులు, ఎద్దులు వంటి బొమ్మలు చేసేవారు. పాఠశాలలో 7వ తరగతి చదివేటప్పుడు రాజయ్యను ఒక టీచర్ బాంబే ప్రభుత్వం నిర్వహించే ఇంటర్మీడియట్ డ్రాయింగ్ పరీక్షలకు పంపించారు. తర్వాత కుబేరుడు అనే డ్రాయింగ్ టీచర్ హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ స్కూల్ అఫ్ ఆర్ట్, క్రాఫ్టలలో ఐదేళ్ల పెయింటింగ్ డిప్లొమాలో చేర్పించారు.

సంగారెడ్డి మిడిల్ పాఠశాలలో 1947లో రాజయ్య డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. చిత్రకళ పట్ల ఆసక్తి చూపిన వారిని డ్రాయింగ్ పరీక్షలకు పంపి వారిని చిత్రకారులుగా, చిత్రకళోపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ఆయన చిత్రరచన ప్రధానంగా మూడు దశలుగా జరిగింది. ప్రారంభంలో చిత్రకళ నేర్చుకున్నప్పుడు అందరిలా కాగితాలపై వాష్ టెక్నిక్‌లో చిత్రాలు గీశారు. 1960 నుంచి టెంపరరీ రంగులు అలవాటు చేసుకున్నారు. 1970 నుంచి అంతర్జాతీయ మీడియం అయిన నూనె రంగులు వాడకం ప్రారంభించారు. రాజయ్య చిత్రరచన ఏ మీడియంలో కొనసాగినా తన సంస్కృతిని, మూలాల్ని మర్చిపోలేదు. పేపర్లు, రంగులు మార్చారు గాని భావం, చిత్రీకరణలను, తనదైన జానపదాన్ని వీడలేదు. అదేవిధంగా నీటి రంగుల నుంచి నూనె రంగులకు మారినా ప్రాథమిక రంగులే కొనసాగించారు. రంగుల శోభ, లావణ్యం, మృదుత్వం, సహజత్వం ఆయన ప్రత్యేకత. వెలుగు నీడలు ఆయన చిత్రాల్లో ఉండవు.

తెలంగాణ సంస్కృతి అన్నా, జీవనశైలి అన్నా, సంప్రదాయం అన్నా, బోనాలు అన్నా, బతుకమ్మ అన్నా ముందుగా గుర్తుకు వచ్చేది రాజయ్య చిత్రాలే. రంగుల శోభ, లావణ్యం, మృదుత్వం, సహజత్వం ఆయన సృజనాత్మక ప్రత్యేకత.



తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో విరివిగా సంచరించడం, పల్లె ప్రజల జీవనశైలిని సన్నిహితంగా పరిశీలించడం వల్ల రాజయ్య చిత్రాల్లో సహజత్వం కనబడుతుంది. ఆయన చిత్రాలు చూస్తే తెలంగాణ పల్లెలో ఉన్న అనుభూతి కలుగుతుంది. పెళ్ళి వేడుకలకు సంబంధించిన చిత్రాలు ఆయన సూక్ష్మ పరిశీలనకు నిలువెత్తు నిదర్శనం. 'నా చిత్రకళకు పట చిత్రకళే ప్రేరణ' అని ఆయన తరచు చెప్పేవారు.. రాజయ్య సృజించిన 'బోనాలు' ముఖచిత్రంగా ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ మ్యాగజైన్ 'స్టూడియో లండన్' ఒకసారి వెలువడింది. ఆ సంచికలో ప్రముఖ చిత్రకళా విమర్శకులు ఎ.ఎస్. రామన్ రాజయ్య చిత్రకళ విశిష్టత గురించి ఒక విపుల వ్యాసం రాశారు. 'దేశ కాలాపేక్ష లేని, శాశ్వతమైన, సార్వజనీనమైన, లోకంలో ఏ శక్తి అంతరింప చేయలేని, నిత్య నూతన సౌందర్యం కోసం అన్వేషిస్తున్న రాజయ్యకు తన చుట్టూవున్న జానపద రూపాల్లోనూ, జాతీయాల్లోనూ అలాంటి శాశ్వత సౌందర్యం సాక్షాత్కరించింది' అని రామన్ ప్రశంసించారు.

రాజయ్య చిత్రించిన చిత్రాల్లో బతుకమ్మ, పంటపొలాలు, శ్రమజీవులు, రిక్షా లైఫ్, ముస్తాబు, నీలి భాగవతం, అంపశయ్యపై భీష్ముడు, జీవాత్మ పరమాత్మ వైపు తదితరాలు ఆయనకు అత్యంత ఇష్టమైనవిగా చెప్పుకున్నారు. వేంకటేశ్వర స్వామిపై ఆయన పాతికకు పైగా చిత్రాలు సృజించారు. రిక్షాలైఫ్ చిత్రానికి జాతీయ అవార్డు లభించింది. సిద్దిపేటలోనే ఆయన మూడున్నర దశాబ్దాల పాటు చిత్రకళోపాధ్యాయుడుగా పనిచేశారు. 1963లో లలితకళా సమితిని ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహించి, ఔత్సాహికుల్ని విరివిగా ప్రోత్సహించారు. 1956–88 సంవత్సరాల మధ్య హంగేరీ, బల్గేరియా, రొమేనియా, చెకొస్లోవేకియా, ఆస్ట్రేలియా, క్యూబా, మెక్సికో, రష్యా, ఇటలీ, బ్రిటన్ తదితర దేశాలలో నిర్వహించిన ఆయన చిత్రకళా ప్రదర్శనలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజయ్య సృజన జీవన వ్యాసంగాలు తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదు. విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, వెల్లటూరు తదితర ప్రాంతాలలో జరిగే చిత్రకళా ప్రదర్శనలకు హాజరై యువ, బాల చిత్రకారులను ప్రోత్సహించేవారు. కేంద్ర లలితకళా అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా రాజయ్య మా విశాఖ చిత్రకళా పరిషత్‌కు సహాయ సహకారాలు అందించారు. పరిషత్ పునరుద్ధరణకు, ఇంకా చిత్రకళా రత్నాలు, చిత్రకళా చరిత్ర, వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు తదితర గ్రంథాల ముద్రణకు, సింహాచలం, భీమిలి, కోణార్క్ తదితర ప్రాంతాలలో వర్క్‌షాపుల నిర్వహణకు లలితకళా అకాడమీ గ్రాంట్లు ఇప్పించడానికి సహకరించారు. 'కుంచెపదాలు' కవిగా ఆయన కవిలోకంలో కూడా ప్రసిద్ధులు. 2013లో 9వ తరగతి తెలుగు ఉపవాచకంలో స్ఫూర్తిదాతలు పేరిట ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. 1978లో ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ వీరి కళాజీవితాన్ని మోనోగ్రాఫ్‌గా ప్రచురించింది.. సిద్దిపేట ప్రజలు 2019లో తమ ఊరికి గర్వకారణమైన రాజయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆయన పట్ల తమ గౌరవాదరాలు చాటుకున్నారు. రాజయ్య 2012, ఆగస్టు 20న తన 87వ ఏట మరణించారు. ఆయన కళాకృతులు జాతి ఆస్తులు. వాటిని సేకరించి భద్రపరచాలి.

▪ సుంకర చలపతిరావు

(ఏప్రిల్ 7: కాపు రాజయ్య శతజయంతి)

పరిహారంతోనే పంచాయితీ..

కొలిక్కిరాని మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ

- నిర్మాణానికి 253 ఎకరాలు అవసరమని అంచనా
- సేకరణకు రూ.205కోట్లు విడుదల చేసిన సర్కారు
- రైతులతో ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం
- ఎకరాకు రూ.2కోట్లకు రైతుల డిమాండ్.. రూ.60లక్షలలోపే అధికారుల మొగ్గు
- కొలిక్కిరాకపోవడంతో రైతుల వెనుకంజ
- ఒకే గ్రామంలోనే భూముల విలువలో తేడాలు ఉండడంతో ఆగ్రహం
- రెవెన్యూ అధికారులు మార్కెట్ ధర పెంచలేదని రైతుల ఆగ్రహం

7



దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని చందంగా ఉంది మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం అంశం. ఓరుగల్లు వాసుల చిరకాల వాంఛ అయిన విమానయానం దరిచేరిందనుకున్న తరుణంలో ఇతర అంశాలు అడ్డుపడుతుండడం నిరాశను కలిగిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగంగా చేపట్టారు. ఇందులో ప్రధానంగా భూసేకరణ సవాల్‌గా పరిణమించింది. ఇంతకు ముందు మామునూరులో ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉన్న సుమారు 694ఎకరాలకు తోడుగా మరో 253 ఎకరాల భూమి కావాల్సి వచ్చింది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205కోట్లను విడుదల చేసింది. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు మామునూరు పరిసర గ్రామాల రైతులతో చర్చించారు. భూమి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే రైతులు భూమి ఇవ్వడానికి కొన్ని షరతులు పెట్టారు. తొలుత భూమికి బదులు భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కుదరదని అధికారులు చెప్పడంతో ఎకరాకు రూ.2కోట్ల వరకు చెల్లించాలని పట్టుబట్టారు. అయితే ఎకరాకు రూ.30లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు ఒప్పుకోలేదు. ప్రాంతాన్ని బట్టి రూ.60లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు సమ్మతించలేదు. పరిహారం విషయం కొలిక్కిరాకపోవడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ పెద్దలు స్పందించి పరిష్కరించాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

చిరస్మరణీయుడు జగ్జీవన్ రామ్

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా 118వ జయంతి వేడుకలు

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చి మ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివా రం హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాన్ని హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ చరిత్రను సమాజంలోని ప్రతీ ఒక్కరు స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఆనాటి కుల వివక్షపై పోరాటం చేసిన గొప్ప చరిత్ర ఆయనదని అన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాలు, చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని కొనియాడారు. నగరంలో జగ్జీవన్‌రాం విగ్రహాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల త్యాగాల స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. జగ్జీవన్‌రామ్ జీవించినంత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఒక చిన్న కుటుంబం నుంచి దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆధునిక పరిజ్ఞానం నైపుణ్యాలు, పెంపొందించే విధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, జిల్లాలోని పరకాల నియోజక వర్గ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ చేసినట్లు చెప్పారు.



బాబు జగ్జీవన్ రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ ఆర్డీవో రమేష్‌రాథోడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులుపాల్గొన్నారు. మగ్ధుం చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకోగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలాపించిన పాటలు ఆద్యంతం అలరించాయి.

రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే..

- సన్న బియ్యం పంపిణీకి చట్ట భద్రత కల్పించాం..
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పులో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

గిర్మాజీపేట,ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజోపయోగ కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో 15ఏళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆమె వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో సన్న బియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు బియ్యం అందించాలనే కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి రుపాయిన్నరకు కిలో బియ్యం పథకాన్ని అమలుచేశారని మంత్రి గుర్తు చేశారు. పేదలకు బియ్యం అందించేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకు వస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాన్ని ఉగాది నుంచి అమలు చేస్తూ తెలంగాణ పేదలకు సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నారని అన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకానికి చట్టభద్రత కల్పించామని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ పథకాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. నాడు కేసీఆర్ దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి హాస్టళ్లకు పంపిణీ చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందన్నారు. అంతేగా కుండా విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందిస్తూ తమ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంటే.. బీఆర్ఎస్ పార్టీ కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి సురేఖ మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ఆదాయం పెంచుతూ, అప్పులు తీరుస్తూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే పేదల కళ్లల్లో సంతోషం కనిపిస్తోందని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పేదలందరికీ సన్న బియ్యం అందించే బాధ్యత రేషన్ డీలర్లదేనని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్, కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజ్, జారతి రమేష్, చింతాకుల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుల్లతో మంత్రి సురేఖకుస్వాగతం పలికారు.


సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

- నేడు శ్రీ జానకీరాఘవుడి కల్యాణోత్సవం
- ముస్తాబైన రామ, హనుమ ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాదాయ శాఖ అధికారులు
- పలు ఆలయాల్లో సంప్రదాయంగా ఎదుర్కోలు కార్యక్రమం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చైత్రశుద్ధ నవమి ఆదివారం జిల్లా అంతటా శ్రీరామ నవమి వేడుకలను జరుపుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు. శ్రీరామ నవమి వేళ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని వాడవాడలా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈసారి అనేక ఉత్సవ కమిటీలు సీతారాములోరి పెళ్లికి కల్యాణ పత్రికలను ముద్రించి సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహించారు. దేవుడి పెళ్లికి ఊరి పెద్దలే ప్రముఖులై నిర్వహించనున్న క్రమంలో ప్రతీ ఒక్కరు రాములోరి పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆరుబయట కల్యాణోత్సవాలు నిర్వహించే ఆలయాల ముందు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, మంచినీటి, మజ్జిగ వసతిని ఏర్పాటు చేశారు. హనుమాన్, రామాలయాలతోపాటు ఇతర అన్ని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు భద్రాచంలో జరిగే 12 గంటల సమయంలో అభిజిత్ లగ్న సుమూర్తంలో జరగనున్నాయి. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం జరగనున్న నేపథ్యంలో శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో సంప్రదాయంగా సీతారాముల ఎదుర్కోలు ఉత్సవాలను మంగళవాయిద్యాల నడుమ నిర్వహించడం విశేషం.



వేయిస్తంభాల ఆలయంలో..

వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా జరుగుతున్న సీతారామ వసంత నవరాత్రి వేడుకల సందర్భంగా శనివారం సీతారాముల ఎదుర్కోలును వైభవంగా నిర్వహించారు. కృష్ణ యజుర్వేద పండితుడు గుడిమల్ల విజయ కుమారాచార్యులు, ఆలయ వేద పండితులు మణిశర్మ, ప్రణవ్‌ల వేద మంత్రాల మధ్య గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఎదుర్కోలు వేడుకలు జరిగాయి. అంతకుముందు ధ్వజారోహనం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో నిత్య మహాసుదర్శన హోమం కూడా జరిగింది. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు. ఆదివారం పెద్ద ఎత్తున కల్యాణోత్సవం నిర్వహించేందుకు అనంతరం భక్తులకు ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో చెప్పారు.


రెవెన్యూకాలనీలోని రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రెవెన్యూ రామాలయంలో..

రెవెన్యూ కాలనీలోని సీతారామ ఆలయంలో ఈసారి 40వ కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహింపజేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భూసూరి సాంబమూర్తి, వైస్‌చైర్మన్ రామారావు, సెక్రటరీ ప్రసాద్‌లు చెప్పారు. ఆలయాన్ని మరింత ఆధునీకరింపజేసిన నేపథ్యంలో మొట్టమొదటిసారిగా విశాల మైదానంలో ఆరుబయట కల్యాణోత్సవాన్ని నిర్వహింపజేస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవల్ల శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సంప్రదాయంగా ముత్యాల తలంబ్రాలను తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర అధికార, అనధికారులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు చెప్పారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధిచెందిన చిన్న కోవెలలో పెద్దఎత్తున కల్యాణోత్సవాన్ని

మిగతా 8వ పేజీలో

పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క

- రాజాజీనగర్ పెద్ద నాలా నిర్మాణంలో అవకతవకలు
- బడా వ్యక్తి కోసం నాలా ప్లానింగ్ మార్పు
- నాలా మధ్యలో పిల్లర్లు వేసి రోడ్డు నిర్మాణం
- నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెక్షన్ వాల్
- స్మార్ట్ సిటీ నిధులతో నాసిరకం పనులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న 52, 53 డివిజన్ల ప్రజలు


అక్రమ కట్టడాలు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని 52, 53 రెండు డివిజన్ల పరిధిలోని హనుమకొండ రాజాజీనగర్ నుంచి పెగడపెల్లి డబ్బాల పెద్ద మోరి వరకు నిర్మిస్తున్న నాలా పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, సిల్ట్, గుర్రపు డెక్క తొలగింపునకు టెండర్లు పిలువగా ఇద్దరు బడా కాంట్రాక్టర్లు రూ.50 కోట్లకు పనులు దక్కించుకున్నారు. మూడేళ్లుగా జరుగుతున్న పనుల్లో నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ముడుపులకు ఆశపడి బల్దియా అధికారులు నాలా ప్లాన్‌నే మార్చి నిర్మాణాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్నారు. శనివారం హనుమకొండ రాజాజీనగర్ కాలనీవాసులు అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని అక్కడి బ్రిడ్జిపై నిరసన వ్యక్తం చేసి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

పెద్దోళ్లకు వెన్నుదన్నుగా..

హనుమకొండ పెద్దమోరి పెద్దనాలా చుట్టుపక్కల భూమి కబ్జాలను నియంత్రించేందుకు బల్దియా అధికారులు పూనుకున్నారు. నాలా ప్రాంతాలైన వడ్డెపల్లి, సమ్మయ్యనగర్, రాంనగర్, లష్కర్‌సింగారం, రాజాజీ నగర్, నయీంనగర్, బొక్కలగడ్డ, ఈదులవాగు నాలాస్థలంతో పాటు బఫర్ జోన్‌ను అక్రమార్కులు ఆక్రమించి శాశ్వతంగా ఇళ్లు, ప్రహరీలు నిర్మించుకున్నారు. దీంతో వంద మీటర్ల వెడల్పు కలిగిన నాలా కుచించుకుపోయింది. ఈ క్రమంలో మూడేళ్ల కిందట భారీ వర్షాలు కురిసి నీరు సరిగా ప్రవహించక సమీపం కాలనీల ఇండ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. దీన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు సీరియస్‌గా తీసుకుని సమ్మయ్యనగర్ నుంచి హనుమాన్‌నగర్ కేసీ కెనాల్ వరకు అక్రమ కట్టడాలను కొంత మేరకు తొలగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలా 80 ఫీట్ల వెడల్పు ఉండాలి. కానీ కొన్ని చోట్ల 30 ఫీట్లు, మరికొన్ని చోట్ల 50. 60. 70 ఫీట్ల వెడల్పును నిర్ధారించారు. అయితే ఈ బఫర్ జోన్‌లో ఉన్న పేదల ఇండ్లను మాత్రమే కూల్చి పెద్దలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నట్టు తెలుస్తోంది. ఈ నాలా పరివాహక ప్రాంతంలో పేదవారికి ఒక న్యాయం.. పెద్ద వారికి ఒక న్యాయం చేశారని అధికారులు తీరుపై ప్రజలు మండి పడుతున్నారు. కొన్నిచోట్ల 60 ఫీట్ల వెడల్పు తీయగా.. మరి కొన్నిచోట్ల ముడుపులు, ప్రజాప్రతినిధులు ఆదేశాలు, కోర్టు కేసులో ఉన్న పత్రాలు చూపించిన వారిని వదిలివేసినట్టు తెలుస్తోంది.

నాసిరకం నిర్మాణం

సుమారు 2 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్న పెద్ద మోరి పెద్ద నాలా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం పనులు నాసిరకంగా చేపడుతున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. గోడ నిర్మాణంలో సిమెంట్ తక్కువగా ఉపయోగిస్తూ ఇసుక, చిప్స్ ఎక్కువగా వాడుతూ పనులు చేస్తున్నారని అంటున్నారు. పనులను నిత్యం పర్యవేక్షించవలసిన బల్దియా ఇంజనీరింగ్ అధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే నాసిరకం పనులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే బొక్కలగడ్డ ప్రాంతంలో ప్రొటెక్షన్‌వాల్ నాసిరకంగా నిర్మించడం వల్ల కిందికి వంగిపోయిందని భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందే అని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రాజాజీనగర్ వద్ద నాలా మధ్యలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిని వేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


నాలా మధ్యలో పిల్లర్లు వేసి రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్


అడ్డదిడ్డంగా నిర్మిస్తున్న నాలా ప్రొటెక్షన్ గోడ

ఇష్టారీతిన బ్రిడ్జి నిర్మాణం

హనుమకొండ నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో జవహర్‌కాలనీ, రాజాజీ నగర్, నయీంనగర్ పెద్దమోరిపై కొత్తగా బ్రిడ్జిలు నిర్మించారు. కానీ రాజాజీనగర్‌లో నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులు విచిత్రంగా ఉన్నాయని అక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు. రాజాజీనగర్ బ్రిడ్జి పక్కన ఓ బడా వ్యాపారి ఇల్లు బఫర్‌జోన్‌లో ఉన్నా.. అతడి గోడను ఏ మాత్రం ముట్టుకోకపోవడంతో పాటు అతడి కోసం బల్దియా రూ.1.50కోట్లు ఖర్చు చేసి నాలా మధ్యలో 15 పిల్లర్లు వేసి రహదారి నిర్మించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలను తొలగించాల్సిన అధికారులు.. నలా ప్లానింగ్ (నక్ష) మార్చి మరీ మురికినీటి ప్రవాహానికి అడ్డుగా పిల్లర్లు నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గతంలో వర్షాలతో ఆర్థికంగా నష్టపోయాం..

సుధాకర్, లష్కర్ సింగారం

గతంలో కురిసిన వర్షాల వల్ల నాలా నుంచి నీరు పరిగా ప్రవహించక ఇళ్లల్లోకి మురికి నీరు చేరుకున్నాయి. ఇంట్లో నిత్యావసర సరుకులు నీటితో తడిచిపోయి ఒక్కో కుటుంబానికి రూ.5 నుంచి రూ.10లక్షల ఖర్చు అయింది. అధికారులు కాలువ నిర్మాణం చేస్తున్నా నాలా మధ్యలో పిల్లర్లు పోయడం వల్ల తిరిగి అదే పరిస్థితి వస్తుంది. కొందరి స్వలాభం కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదు.

నాలుగు కాలనీలు జలమయమయ్యాయి..

టి.నాగయ్య, రాజాజీనగర్ కాలనీవాసుడు

గతంలో వర్షాల కారణంగా రాజాజీనగర్, రాంనగర్, లష్కర్‌సింగారం, నయీంనగర్ ప్రాంతాలు సుమారు కిలోమీటరు దూరంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవించారు. అధికారులు స్మార్ట్‌సిటీ నిధులు కేటాయించినా అవి కొందరు వ్యక్తుల సౌకర్యార్థం కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో నాలా సరిగా లేకపోవడం వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం. నాలా మధ్యలో నిర్మించే పిల్లర్లను వెంటనే తొలగించి కాలువ పనులు సక్రమంగా చేపట్టాలి.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- కమిషనరేట్ పరిధిలో నెల రోజుల పాటు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం నుంచి నెల రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల అనుమతులు లేకుండా మీటింగ్, ర్యాలీలు, ఊరేగింపులను నిర్వహించడం నిషేధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని తెలిపారు. వృద్ధులు, రోగులతో పాటు విద్యార్థుల చదువులను దృష్టిలో పెట్టుకొని, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా డీజే సౌండ్స్ వినియోగించడంపై నిషేధాన్ని కొనసాగిస్తామన్నారు. ఎవరైనా తప్పని పరిస్థితులలో మైక్‌లను ఏర్పాటు చేయాలనుకుంటే ఏసీపీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రులు, విద్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో మైక్‌లను ఏర్పాటు చేయరాదని, ఇది ఏప్రిల్ 6 నుంచి మే 5వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేశారు.

రామప్ప ఆలయ సన్నిధిలో సీపీ


రామప్ప విశిష్టతను గైడ్ ద్వారా తెలుసుకుంటున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వెంకటాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఈసందర్భంగా అర్చకులు, అధికారులు ఆయన్ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సీపీ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరించారు.

రెండో వివాహం కావడం లేదని..

- ఉపాధ్యాయుడు రైలు కిందపడి ఆత్మహత్య
- మృతుడిది హనుమకొండ జిల్లా పులిగిల్ల గ్రామం


వల్లాగి కిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెండో వివాహం జరగడం లేదని మనస్తాపం చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్యానికి బానిసై.. శనివారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు (స్కూల్ అసిస్టెంట్) వల్లాగి కిరణ్ (45) జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండ లంలోని ఉప్పుగల్లు పాఠశాలకు ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. 2009లో పాలకుర్తి మండల పరిధిలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కిరణ్, మేనమామ కుమార్తెను 2011లో వివాహం చేసుకున్నాడు. ఆరు నెలల వ్యవధిలోనే విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తల్లి సుశీలతో కలిసి పాలకుర్తిలో కిరాయి ఇంట్లో ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడు. తండ్రి గతంలోనే చనిపోయాడు.

కాగా, రెండో పెళ్లి కోసం కిరణ్ ప్రయత్నిస్తున్నా సంబంధం కుదరడం లేదు. దాంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కిరణ్ శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, పీసీ నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి

- సంపు మోటార్ సరి చేస్తుండగా ప్రమాదం
- మృతుడిది ఆంధ్రప్రదేశ్‌లోని వదర్లపాడు గ్రామం


నాగదుర్గ బాలాజీ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి చెందిన ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లా కైకలూరు మండలం వదర్లపాడుకు చెందిన బాలాజీ(27) తపాలాశాఖలో ఉద్యోగం రాగా మీదికొండలో ఆరు నెలల క్రితం బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధుల్లో చేరాడు. ఘన్‌పూర్ పట్టణంలోని తిరుమలనాథస్వామి కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. స్నానం చేయడానికి వాటర్ సంపులోని విద్యుత్ మోటార్ ఆన్ చేసి నీళ్లు తోడుకునే ప్రయత్నం చేయగా నీళ్లు రాలేదు. దాంతో మోటార్ రిపేరు వచ్చి ఉంటుందని భావించిన బాలాజీ, స్విచ్‌ఆఫ్ చేయకుండానే సంపు వద్దకు వెళ్లి మోటార్‌ను బయటకు తీసి పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించా, అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట పీఎస్ పరిధిలో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసి రూ.20వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాగా, బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉండగా, పట్టుబడ్డ నలుగురు వ్యక్తుల నుంచి నగదును స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

ఆత్మకూర్ పీఎస్ పరిధిలో..

ఆత్మకూర్ పీఎస్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రూ.42,100 సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాగా, ఈ బెట్టింగ్‌లో పాల్గొన్న నల్లగొండకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారన్నారు.

పోతన హాస్టల్‌ను అల్లుకున్న పొదలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పోతన మహిళ హాస్టల్‌లో గడ్డి పొదలు ఏపుగా పెరిగి బిల్డింగ్‌ను చుట్టాయి. పోతన హాస్టల్ వెనుక వైపు బాత్‌రూమ్, టాయిలెట్స్ వైపు ఏపుగా పెరిగాయి. ఆ పొదల్లోంచి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఉండే పాములు, తేళ్లు ఇతర విష పురుగులు హాస్టల్‌లోకి వస్తున్నాయి. హాస్టల్ అధికారులు తక్షణమే స్పందించి పోతన వద్ద ఏపుగా పెరిగిన పొదలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేయూ క్యాంపస్‌లోని బాటనీ, జువాలజీ విభాగం ఎదురుగా విద్యుత్ స్తంభాల వద్ద వైర్లు బయటకు రావడంతో అటుగా వెళ్తున్న విద్యార్థులకు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లను సరి చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.



తొర్రూరులో కొత్తతరహాలో దొంగతనం

- కూలి పనులకంటూ బైక్ ఎక్కించుకొని బంగారు ఆభరణాలు చోరీ
- సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల విచారణ
- మానుకోట జిల్లాలో ఘటన


తొర్రూరు నుంచి ద్విచక్ర వాహనంపై కూలీలను తీసుకెళ్తున్న దుండగుడు

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కూలి పనులకు తీసుకెళ్తామంటూ బైక్‌పై వచ్చిన వ్యక్తి.. ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారం ఆభరణాలు అపహరించుకుపోయాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం జరిగిన ఈ కొత్తతరహా దొంగతనం కలకలం రేపుతోంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. తొర్రూరులోని అన్నారం రోడ్డులో ఉన్న కూలీల అడ్డా వద్దకు పట్టణ కేంద్రానికి చెందిన మూగ మహిళా కూలీ గూబ కొమురమ్మ, చింతలపల్లి గ్రామ శివారు కొమ్మనపల్లి గ్రామానికి చెందిన భూక్య సునీత పనుల కోసం వచ్చారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఇద్దరు మహిళా కూలీలు కావాలనడంతో కొమురమ్మ, సునీత బైక్ ఎక్కి వెళ్లారు. మహబూబాబాద్ రోడ్డులో కొద్ది దూరం వెళ్లిన తరువాత బైక్ ఆపి, తాగడానికి నీళ్లు తీసుకువస్తానని ఆ ఇద్దరు మహిళలను దింపాడు. అనంతరం ఆ ద్విచక్రవాహనంపై నీళ్లు తీసుకొని వస్తానని వెళ్లి, మరో వ్యక్తికి తీసుకుకొని వచ్చి గూబ కొమురమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసును అపహరించుకుపోయిన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై భూక్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్ ఆధారణంగా విచారణ చేపడుతున్నట్లు సీఐ గణేష్ వివరించారు.

పరిహారంతోనే పంచాయితీ

- కొలిక్కిరాని మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ
- పరిహారంపై స్పష్టత రాకపోవడంతో రైతుల వెనుకంజ
- ఎకరానికి రూ.2 కోట్లకు డిమాండ్.. రూ.60 లక్షలలోపే అధికారుల మొగ్గు
- సీఎం చొరవతో సమస్య పరిష్కారం అవుతుందంటున్న ఓరుగల్లు వాసులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)


వరంగల్ ఎయిర్‌పోర్టుకు చకచకా అనుమతులు వచ్చినా.. భూసేకరణకు అడుగులు ముందుకు పడటం లేదు. విమానాశ్రయానికి కావాల్సిన 253 ఎకరాల భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేసినప్పటికీ రైతులకు చెల్లించే పరిహారం కొలిక్కిరావటం లేదు. ఎకరాకు రూ. 2 కోట్లతో పాటు నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తుండగా ఇచ్చే పరిస్థితి కనబడడం లేదు. దీంతో భూసేకరణపై పలు దఫాలుగా రైతులతో చర్చలు జరిపినప్పటికీ కొలిక్కి రాకపోవటంతో విమానాశ్రయం నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది.

కొలిక్కిరాని భూసేకరణ

వరంగల్ ఎయిర్‌పోర్టుకు కావాల్సిన అనుమతులన్నీ దాదాపుగా వచ్చేసినప్పటికీ కీలకమైన భూసేకరణ అంశమే తేలటం లేదు. మామునూరులో ఇప్పటికే 669ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉంది. అయితే ఇప్పుడున్న రన్‌వేను విస్తరించటంతో పాటు టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టేందుకు ఎయిర్‌పోర్టుకు మరో 253 ఎకరాల భూమి అవసరంగా ఏఏఐ గుర్తించింది. దీంతో నవంబరు 17వ తేదీన ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఖిలా వరంగల్ మండలం పరిధిలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో 233 మంది రైతుల నుంచి 253 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు సర్వే పూర్తి చేశారు. ఇందులో వ్యవసాయ, అసైన్డ్ భూములతో పాటు లేఅవుట్ ప్లాట్లు, 13 నివాస గృహాలు కూడా ఉన్నాయి. దీనికి సంబంధించి మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. పరిహారం విషయంలో రైతులు పట్టుబడుతున్నారు. తొలుత తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అయితే ఇది సాధ్యమయ్యే పని కాదని, మార్కెట్ విలువకు అనుగుణంగా ధరలు చెల్లిస్తామని చెప్పి అధికారులు సర్వే పూర్తి చేశారు. చివరిగా గత గురువారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో రైతులతో జిల్లా కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్ తదితరులు చర్చించారు. భూమికి బదులు భూమి ఇవ్వకుంటే తమకు ఎకరాకు రూ.2కోట్ల పరిహారంతో పాటు ప్రభుత్వం నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎకరాకు రూ.30లక్షల వరకు చెల్లించేందుకు అధికారులు రైతులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే రైతులు పట్టువీడకపోవటంతో చివరకు ఏరియాను బట్టి భూమికి రూ.60లక్షల వరకు చెల్లించేందుకు ముందుకు వచ్చినప్పటికీ రైతులు ఒప్పుకోవటం లేదు.

విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

వరంగల్ ఎయిర్‌పోర్టుకు అన్ని అనుకూలతలు ఉన్నాయని ఫిబ్రవరి 28న ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రకటించింది. అలాగే ఎయిర్‌పోర్టుకు అడ్డంకిగా ఉన్న 150కిలో మీటర్ల నిబంధనపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (హెచ్‌ఐఏఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం చర్చించింది. హెఐఏఎల్‌ను ఒప్పించటంతో పాటు ఏఏఐతో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇప్పించింది. ఇక ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపేందుకు అనుకూలంగా ఉందని సర్వే రిపోర్టులు రావటంతో ఏఏఐ వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



గాడిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 40/ఏ భూమికి మార్కెట్ విలువ రూ.6 లక్షలు, ఇదే గ్రామంలో సర్వే నెంబరు 78కి మార్కెట్ విలువ రూ.40.66 లక్షలు చూపిస్తున్న దృశ్యం

భారీగా తేడాలు

మామునూరు ఎయిర్‌పోర్టు పరిధిలోని గ్రామాలన్నీ కూడా గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో లేక ఉద్దేశపూర్వకంగానో గానీ.. ఎయిర్ పోర్టు పరిధిలోకి వచ్చే చాలా భూముల మార్కెట్ విలువలో వ్యత్యాసాలు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మామునూరు ఎయిర్ పోర్టు కోసం 2008 నుంచి పలుమార్లు భూముల సర్వే నిర్వహిస్తున్నారు. 2020లో కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాడిపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో భూముల సర్వే నిర్వహించింది. తాజాగా 2025 మార్చిలో కూడా భూముల సర్వే నిర్వహించారు. అయితే గాడిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 40/ఏ భూమికి మార్కెట్ వాల్యూ రూ.6లక్షలు ఉండగా, ఇదే గ్రామంలో సర్వే నెంబరు 78కి మార్కెట్ వాల్యూ రూ.40.66లక్షలు ఉంది. భూముల ధరల్లో భారీగా తేడాలు ఉండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లున్నప్పటికీ తమ భూములను ఎయిర్‌పోర్టుకి ఇవ్వాల్సిందేనని, అందుకే రెవెన్యూ అధికారులు భూముల మార్కెట్ ధరను తక్కువ నిర్ణయించారని ఆరోపిస్తున్నారు. పూర్వం నుంచి భూమినే నమ్ముకుని బతుకుతున్నామని, ఇదికూడా పోతే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. అయితే రైతులు పరిహారం విషయంలో పెడుతున్న డిమాండ్లపై అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లుగా సమాచారం.

ఎయిర్‌పోర్టు పనుల్లో జాప్యం

భూసేకరణ కొలిక్కిరాకపోవటంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో కూడా జాప్యం జరుగనుంది. ప్రస్తుతం మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. మిగతా 253 ఎకరాల భూమిని కేటాయిస్తే ఎయిర్‌బస్‌లను నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఈ నెలఖారులోగా భూసేకరణ పూర్తిచేస్తే మే నెలలో విమానాశ్రయం పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సుమారు రూ.450కోట్ల వరకు నిధులు కేటాయించింది. భూసేకరణ పూర్తయితే పనులు చేపట్టేందుకు ఏఏఐ సిద్ధంగా ఉంది. మొత్తానికి భూసేకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించి, సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓటరు నమోదు.. నిరంతరం

18 ఏళ్లు నిండితే అర్హులు » ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

వర్ధన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ రానుంది. ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా యువత ఓటరుగా నమోదు చేసుకోవడమే మేలు.

నిరంతర ప్రక్రియ

గతంలో ఓటర్ల నమోదుకు జనవరి 1వ తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. ఆ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటర్లుగా అర్హత లభించేది. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, ఏప్రిల్ 1. జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. జాబితాలో లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫిక్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించింది.

ఓటరు నమోదుకు మార్గదర్శకాలు

అరచేతిలోనే ఓటరు నమోదు చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో మొబైల్ నెంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్తఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, ఓటుహక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదానిని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేరువేరుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావలసిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపరచాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలని. వివరాలు ఏఈఆర్‌ఓ వద్దకు వెళతాయి. ఆయన వాటిని పరిశీలించి ఆమోదిస్తారు.



యాప్‌తో కూడా..

వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద మొబైల్‌లో ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చూసుకునే అవకాశం కల్పించారు.

గుర్తింపు కార్డు పొందడమిలా..

ఓటరు గుర్తింపుకార్డు కావాలనుకునేవారు వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి మొబైల్, ఎపిక్‌కార్డు నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే రాదు. ఫారం -8 ద్వారా ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తరువాత గుర్తింపు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నమోదుపై సందేహం

ఓటరు నమోదు, ఎన్నికల సంబంధించి 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయవచ్చు.

ఆఫ్‌లైన్ లోనూ యువ వికాసం



- దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం
- అందుబాటులో ఫారాలు
- ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో హెల్ప్‌డెస్క్‌లు
- ప్రత్యేకంగా సిబ్బంది నియామకం

దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్

దరఖాస్తు ఫారాల కోసం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అన్ని వివరాలతో పూర్తి చేసిన తర్వాత వాటిని స్వయంగా అందచేస్తే సరిపోతుంది. దరఖాస్తు ఫారమ్ కోసం https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో క్లిక్ హియర్ టు డౌన్‌లోడ్ అప్లికేషన్ ఫామ్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే దరఖాస్తు ఫామ్ ఓపెన్ అవుతుంది. ప్రింట్ లేదా డౌన్‌లోడ్ ఆప్షన్‌పై నొక్కి ఆప్లికేషన్ ఫామ్‌ను పొందవచ్చు.

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దాఖలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరించారు. అయితే తరుచూ సర్వర్ డౌన్ అవుతుండడం, సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో మీ సేవా కేంద్రాల్లో ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకోలేక పోయారు. మొదట నిర్ణయించిన గడువు ఈనెల 5వ తేదీ దరకు జిల్లాలో 14,496 మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా అనేక మంది దరఖాస్తులు చేసుకోవలసి ఉంది. వీరంతా మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం దరఖాస్తుల దాఖలు గడువును ఈనెల 14 వరకు పొడిగించింది. దీంతో పాటు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తుల దాఖలుకు వీలు కల్పించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఎంపీడీవో, నగర పాలక సంస్థ, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అయితే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సమస్యలు ఎదురైనవారే ఆఫ్‌లైన్‌ను ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే అభ్యర్థుల కోసం ప్రభుత్వం నమూనా ప్రతులను రూపొందించింది. అభ్యర్థికి సంబంధించిన వివరాలను 27 కాలమ్స్‌లో పూరించాలి. ఆధార్‌కార్డు జతపరచాలి. ఆహార భద్రతా కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, రెండింటిలో ఏది జతపరిచినా సరిపోతుంది. కుల ధృవీకరణ పత్రం, దివ్యాంగులైతే సదరం ధృవపత్రం జతపరచాలని అధికారులు స్పష్టం చేశారు. ఆఫ్‌లైన్ వచ్చిన దరఖాస్తు లను పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

సిబ్బంది నియామకం

రాజీవ్ యువ వికాసం పథకంపై నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దరఖాస్తు చేసుకోవడంలో సహాయం అందించేందుకు, మార్గదర్శనం నెరపడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. అన్ని మండల పరిషత్‌లు, మున్సిపల్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మున్సిపాలిటీల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించే బాధ్యతను వార్డు ఆఫీసర్లకు అప్పగించారు.

యూనిట్లకు సబ్సిడీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చింది తెలిసిందే. రాజీవ్ యువ వికాస పథకం కింద రూ.50,000 విలువ చేసే యూనిట్‌కు వంద శాతం ఇస్తారు. రూ. 50,001 నుంచి రూ.1,00,000 విలువ చేసే యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ లభిస్తుంది. మిగతా పది శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. రూ.1,00,001 నుంచి రూ.2,00,000 విలువ కలిగిన యూనిట్లకు 80 శాతం సబ్సిడీ లభించగా మిగతా 20 శాతం లబ్ధిదారులు భరించాలి. అలాగే రూ.2,00,001 నుంచి రూ.4,00,000 విలువైన యూనిట్లకు సబ్సిడీ 70శాతం ఇస్తారు. మిగతా 30 శాతం లబ్ధిదారుడు సమకూర్చుకోవాలి.

కోచ్ కావాలనుకుంటున్నారా ?

- 'సాయ్' సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎన్ఐఎస్ ఆధ్వర్యంలో ఆరు వారాల పాటు శిక్షణ

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో అభిరుచి ఉండి కోచ్ కావాలనుకునేవారికి భారత క్రీడా ప్రాధికారిక సంస్థ (సాయ్) అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి కలిగిన వారి నుంచి ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నేతాజీ సుభాష్ జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) ఆధ్వర్యంలో ఆయా క్రీడల్లో ఆరు వారాల పాటు సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తుంది.



క్రీడలు.. శిక్షణ

కన్నోయింగ్ అండ్ కయాకింగ్, హాకీ, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, జూడో, షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఖోఖో, తైక్వాండో, ఉషూ, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, రోల్‌బాల్, టేబుల్ టెన్నిస్, యోగాసన, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, రోయింగ్, లాన్ టెన్నిస్ క్రీడల్లో ఈ కోర్సులను నిర్వహిస్తారు. ఇందులో ఎంచుకున్న క్రీడాంశాల్లో ఆరు వారాల పాటు శిక్షణ ఇస్తారు. పటియాల, బెంగుళూరు, కోల్‌కతా ప్రాంతాల్లో ఎన్ఎస్, ఐఎన్ఎస్ శిక్షణా కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది.

కోర్సు వ్యవధి

కోర్సు వ్యవధి ఆరు వారాలు. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఈ ఆరు వారాల్లో నెలరోజులు ఆన్‌లైన్‌లో థియరీ, పదిహేను రోజులు హాఫ్‌లైన్‌లో ప్రాక్టికల్స్ ఉంటాయి. ఏప్రిల్ 14లోగా http:///www.6wcc.nsnis.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఈ కోర్సులో శిక్షణ తీసుకున్నవారు తాము ఎంచుకున్న క్రీడలో కోచ్‌గా రాణించవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే చాలా మంది క్రీడాకారులు శిక్షణ పొంది ఆయా సంస్థల్లో కోచ్‌లుగా కొనసాగుతున్నారు. పిల్లలకు క్రీడల్లో కోచింగ్ ఇవ్వాలనుకునేవారు ఈ కోర్సులో చేరవచ్చు.

అర్హులు

క్రీడా కోర్సుల్లో చేరాలనుకునేవారు ఇంటర్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. వయసు 2025 ఏప్రిల్ 14వ తేదీ నాటికి 24 నుంచి 42 ఏళ్లలోపు ఉండాలి. జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో మొదటి మూడు స్థానాలు పొంది ఉండాలి. రాష్ట్ర స్థాయి, ఆలిండియా యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్, జోనల్ ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం నెరిపి ఉండాలి. ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో జూనియర్, సీనియర్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలి.

పచ్చదనం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఆహ్లాదాన్ని పంచుతున్న వృక్షాలు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న వేపచెట్టు నీడలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

పర్వతగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో పచ్చదనం వెల్లువిరుస్తోంది. ఆఫీసులోకి వెళ్లేందుకు గేటు లోపలికి రాగానే సుమారు వంద చెట్లు దర్శనమిస్తాయి. పలు పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు, వచ్చిన పని ఆలస్యమైతే అదే చెట్ల నీడన కూర్చుంటున్నారు. 1991లో తహసీల్దార్ కార్యాలయం, 1994లో ఎంపీడీవో కార్యాలయాలు ఒకే ఆవరణలో నిర్మించి ప్రారంభించారు. అయితే అప్పటి అధికారులు కార్యాలయాల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో వేప, మర్రి, రావి, టేకు తదితర మొక్కలను నాటారు. అయితే అవి ఇప్పుడు వృక్షలుగా మారి పని కోసం వచ్చే ప్రజలతోపాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు నీడనిస్తున్నాయి. ఉద్యోగులు వారి వాహనాలను సైతం చెట్ల నీడలోనే పెట్టుకుంటున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది ప్రతీ రోజు ఆ చెట్ల వద్ద శుభ్రంచేస్తూ, వాటికి నీళ్లు పోస్తూ కాపాడుకుంటూ వస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మర్రిచెట్టు



తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్లు

వారికి.. ఆరు బయటే.. బారు



మందు బాబులకు ఏ చోటైనా ఒకటేలా ఉంది. వైన్స్‌షాపుల ముందే ఎంచక్కా లాగించేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండలోని పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో ఇది మరీ ఎక్కువైంది. ఇక్కడ వైన్‌షాపునకు ఇరువైపులా మద్యం యథేచ్ఛగా తాగుతున్నారు. ఈ మందుబాబుల తాకిడితో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అలాగే అటుగా వెళ్లే వారికి అసౌకర్యంగా మారింది. పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కూటి కోసం.. ఎండ తిప్పలు!

ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ సందర్భంగా రేషన్‌షాపుల వద్ద ఏర్పాట్లు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలోనే బారులుతీరి అవస్థలు పడుతున్నారు. సన్నబియ్యం పంపిణీ సందర్భంగా తాకిడి ఎక్కువకావడంతో ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపుల వద్ద సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్/హనుమకొండ

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని 51, 57, 59 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 57వ డివిజన్‌లోని గోకుల్ జంక్షన్‌లో ప్రారంభమైన జై బాపు, జై భీమ్, జై సంవిధాన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర 51వ డివిజన్ శాంతినగర్ హౌసింగ్ బోర్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధినేతలు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, డివిజన్ ఇన్‌చార్జి కేతిరి దీపక్‌రెడ్డి, 51, 57, 58, 59, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకల ఉత్సవ కమిటీ నియామకం



కమిటీ చైర్మన్, ధర్మకర్తలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని మెట్టురామలింగేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన ఉత్సవ కమిటీని నియమించారు. చైర్మన్‌గా పల్లపు అర్జున్, ధర్మకర్తలుగా హనంకొండ మల్లికార్జున్, బిల్ల రాజ్‌కుమార్, మూగల రాము, మండల రఘు, జిట్ట హనుమంత రావు, దండిగం రమాదేవి, వలబోజు ఉపేందర్, గుగులోతు నాగేశ్వర్‌రావు, ముంజ రమేష్, నర్ర వెంకటేశ్, గంగారపు రమేష్, మండల సంపత్‌రెడ్డి నియమితులైనట్లు ఈవో శేషభారతి తెలిపారు. నూతన ఉత్సవ కమిటీ శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, సారుపెల్లి సత్యానారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్వేతార్కలో ఘనంగా భవాని అష్టమి పూజలు

మడికొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలోని స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో శనివారం చైత్రశుద్ధ అష్టమిని పురస్కరించుకొని భవానీమాత అష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవిగా కొలువై ఉన్న అమ్మవారికి ఆలయ అర్చకులు ఆనంద్‌త్రిపాఠి, మనోజ్ త్రిపాఠి, హరిక్రిష్ణస్వామి ఆధ్వర్యంలో 51కిలోల పసుపు కుంకుమ నీళ్లతో అభిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకరణ చేసి అష్టోత్తర శతనామార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, కార్యకర్తలు లక్ష్మి, శీనమ్మ, ఉమారాణి, కల్పన, భాగ్యలక్ష్మి, వారికోల్ సాయి, వెంకటసాయి, తేజ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి




సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌లు రాజకీయాలకు అతీతంగా సంఘటితమై స్వయంకృషితో ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర నేత పులి ప్రభాకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పులి దేవేందర్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులు విద్య, ఉద్యోగాల్లో రాణించి సమాజానికి దిక్సూచిగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం మెపా హనుమకొండ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు దేవేందర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పులి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా అమ్మగారి శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడిగా పులి సదానందం, ఉపాధ్యక్షులుగా సిద్ద సుమన్, గోనెల విజేందర్, మట్టెపల్లి సాంబయ్య, కార్యదర్శులుగా వి.శ్రీను, రోకుల సందీప్, కేశబోయిన కోటేశ్వర్‌రావు, కోశాధికారిగా మట్టెపల్లి రణధీర్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భైరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు డాక్టర్ల మెరిట్ తుది జాబితా విడుదల

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లాలో ఖాళీగా ఉన్న 13 ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్) పోస్టులకు దరఖాస్తులు స్వీకరించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. మార్చి 29వ తేదీన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ప్రదర్శించామని, అభ్యంతరాలు పరిశీలించిన అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా, మెసేజ్ ద్వారా తెలియజేశామన్నారు. సమాచారం అందిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 7వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

విద్యాభ్యాసం ఆటపాటలతో సాగాలి



పల్లవి కిడ్స్ స్కూల్ వార్షికోత్సవంలో చిన్నారులు, ఉపాధ్యాయులు

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసం ఆటపాటలతో సాగాలని, తద్వారా పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందని కార్పొరేటర్ చాడా స్వాతి అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని పల్లవికిడ్స్ స్కూల్ మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో స్వాతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లలు ఇష్టంగా, ఉత్సాహంగా చదువుకున్నప్పుడే విద్యలో రాణిస్తారని పేర్కొన్నారు. స్కూల్‌డైరెక్టర్ కొండా శిరీష మాట్లాడుతూ.. పిల్లలు ఇష్టంగా చదువు నేర్చుకునేలా తమ పాఠశాలలో ఆధునిక విద్యాబోధనను అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో చిన్నారి విద్యార్థుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విభిన్న వేషధారణల్లో పిల్లలు అలరించారు. జాతీయ సమైక్యతను చాటేలా కార్యక్రమం కొనసాగింది. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పల్లవి ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ నవీన్, పరకాల ఆర్‌డీవో నారాయణ, శ్రీనివాస్, స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

» జయంతి వేడుకల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రామ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుధీర్‌బాబు, జనార్ధన్‌గౌడ్, పులి రజినీకాంత్, యాదగిరి, రవీందర్‌రావు, నయీమొద్దీన్, సదాంత్, ఖలీల్, మహేందర్, కేశవరెడ్డి, వీరస్వామి, రఘు, రాజ్‌కుమార్, యాకూబ్, అశోక్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

- వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమసమాజ స్థాపన కోసం తపించిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ విద్యార్థి దశ నుంచే కుల వివక్షపై పోరాడి స్వాతంత్ర్య ఉద్యమంలో, ఆధునిక భారతదేశ నిర్మాణంలో స్ఫూర్తి వంతమైన సేవలను అందించి సమాజ అభ్యున్నతికి సామాజిక సమానత్వం కోసం పోరాడారని సీపీ తెలిపారు.
- బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ కార్పొరేషన్: డాక్టర్ జగ్జీవన్‌రామ్ జీవితం పేద ప్రజలకు అంకితమని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ జేఏసీ గౌరవ అధ్యక్షుడు వేల్పుల ధర్మరాజు యాదవ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను శనివారం బల్దియా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మరాజుతో పాటు జేఏసీ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో జాక్ అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, కోశాధికారి స్వర్ణన్ రాజ్, సెక్రెటరి బాలు నాయక్, సూపరింటెండెంట్ రావుల ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.
- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ సమానత సద్వ్యవస్థ కోసం జీవితాన్ని ధారపోశారని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడారని వరంగల్ ఎన్ఐటీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ ఉమామహేశ్వర్ అన్నారు. శనివారం వరంగల్ నిట్ క్యాంపస్‌లోని బోస్ హాల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ ఉమామహేశ్వర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు.
- హనుమకొండ సిటీ: మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, కార్పొరేటర్ మామిండ్ల రాజు, డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ అనిల్, ఎం.విజయ్‌కుమార్, జనార్ధన్, రాజేందర్, జాఫర్, సతీశ్, కుమార్ యాదవ్, నజీర్, రాజ్‌కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కేయూ క్యాంపస్ : దళిత, పేద వర్గాల అభ్యున్నతికి ఆద్యుడిగా బాబు జగ్జీవన్‌రామ్ గుర్తింపు పొందారని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్ఘాటించారు. శనివారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, వరంగల్ నిట్ ప్రొఫెసర్ పులి రవికుమార్‌లు హాజరయ్యారు.
- వరంగల్ ఎల్‌బీ కళాశాల ఇంటర్ స్పాట్ వాల్యూవేషన్ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ నేతృత్వంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేయూలో బీఎస్ఎఫ్ నేతృత్వంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్డీఎల్‌సీఈ ఆవరణలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ నేతృత్వంలో నివాళులర్పించారు.
- మడికొండ: మడికొండ చౌరస్తాలో శనివారం 46వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి భారత తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు.
- వడ్డెపల్లి: హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతిని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లస్కర్ సింగారం ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు.
- కాజీపేట: కాజీపేట చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు మాదిగ మహాజనుల వేదిక ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



బీఆర్‌ఎస్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వినయ్‌భాస్కర్



పోలీసు కమిషనరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్



బల్దియాలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



కేయూలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, సుదర్శన్, సురేశ్‌లాల్

గ్రామ శాఖలే పార్టీకి పట్టుకొమ్మలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామశాఖలే భారత కమ్యూనిస్టు పార్టీకి పట్టుకొమ్మలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లో సీపీఐ గ్రామ శాఖ మహాసభ గిన్నారపు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశంలో పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతమే ఆయుధంగా శ్రామికవర్గ పార్టీగా దోపిడీ, పీడన, వివక్షత అసమానతలు లేని సమసమాజం నిర్మాణం కోసం ఎన్నో వీరోచిత పోరాటాలు నిర్వహించిందన్నారు. మే 26, 27వ తేదీలలో హనుమకొండ జిల్లా సీపీఐ మహాసభలు హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, సభల విజయవంతానికి విరివిగా విరాళాలు అందించి సహకరించాలన్నారు. అనంతరం బీకేఎంయూ జాతీయ నాయకుడు మోతె లింగారెడ్డి సీపీఐ జెండా ఎగురవేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, హసన్‌పర్తి సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు మంద రమేష్, రేణికుంట్ల రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

నేడు హిందూ విజయ యాత్ర

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 4 గంటలకు కాజీపేటలోని కడిపికొండ బ్రిడ్జి వద్ద హిందూ విజయ యాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించనున్నట్లు హిందూ సేవా సమితి అధ్యక్షుడు నాగపురి వెంకటేష్‌గౌడ్ తెలిపారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ సేవా సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

న్యూశాయంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్‌లోని దుర్గాదేవి కాలనీ, వాసవికాలనీలలో సుమారు రూ.కోటితో నిర్మించే సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావుతో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు, క్యాకర్తలు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డలో ఎమ్మెల్యే నాయిని పర్యటన

రెడ్డికాలనీ: హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఎస్సీ కాలనీలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం పర్యటించారు. 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబేద్కర్ రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కాలనీలోని ఇనుముల మణెమ్మ ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కుటుంబానికి సన్న బియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం మణెమ్మ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్ లైన్ క్లియర్ యాప్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో భాగంగా ఆన్‌లైన్ ఎల్‌సీ(లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశపెడుతున్నట్లు హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సి.మధుసూదన్‌రావు తెలిపారు. ఎల్‌సీలు తీసుకొని పనిచేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్నాయని, విద్యుత్ ప్రమాదాల నివారణకు ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కొత్తపల్లిలో ఇటుక బట్టీల కార్మికులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ అప్పయ్య, మెడికల్ సిబ్బంది

మడికొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడిపికొండ పీహెచ్‌సీ పరిధిలోని భట్టుపల్లి, కొత్తపల్లి శివారులోని ఇటుక బట్టీల వద్ద నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సిబ్బంది సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఇటుక బట్టీల్లో పని చేస్తున్న వలస కార్మికులతో మాట్లాడారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే బాలింతలలకు, తగు సూచనలు చేశారు. కార్మికుల కుటుంబాలు, పిల్లలకు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కార్మికుల కుటుంబాలకు ఓఆర్‌ఎస్ పంపిణీ చేయించారు. కార్యక్రమంలో విప్లవ, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటస్వామి, వల్లభ, హెల్త్ అసిస్టెంట్ రంజిత్, ఏఎన్‌ఎంలు సుశీల, సల్మా, ఆశాలు చంద్రకళ, సునీత, సుమలత, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

(5వ పేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశీయ ధర్మకర్త చెరకుపెల్లి నర్సింహాచార్యులు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక షామియానాల కింద విశాల వేదికపై కల్యాణం నిర్వహిస్తామన్నారు. హనుమకొండలోని గుడిబండల్ శ్రీ వెంకటేశ్వరాలయంలో ఈసారి కల్యాణోత్సవాన్ని భద్రాచల సమయంలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ప్రధాన అర్చకుడు కలకోట శ్రీనివాసాచార్య తెలిపారు. ఆలయ చైర్మన్ పులి విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం స్వామి వారిని ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. హనుమకొండ చౌరస్తాలోని శివశక్తి స్థల్‌లో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు ఆలయ ఉత్సవ సమితి ప్రత్యేక ఆహ్వాన పత్రికలను ముద్రించి ఇంటింటికి పంపడం విశేషం. ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించి అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు మహా ప్రసాద వితరణ చేస్తాని ఆటయ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ చెప్పారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని రామ్‌మందిర్‌లో ఆదివారం మధ్యాహ్నం శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఘనశ్యామ్ శర్మ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ మేనేజర్ కనపర్తి రఘువీర్ తెలిపారు. అదే విధంగా హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వర ఆలయంలో కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. శనివారం ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు దేశికన్ స్వామి సంప్రదాయంగా సంప్రోక్షణ చేసి ఎదుర్కోలు ఉత్సవాలకు సిద్ధంగా చేశారు. విద్యానగర్ కాలనీలోని విజయ గణపతి ఆలయంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలను శనివారం సాయంత్రం ఈ ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ సీఈ వెంకటకృష్ణ-మాధవి దంపతులు రాముడిని పెళ్లి కొడుకుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకెళ్లారు. అదే విధంగా ఎన్‌జీవోస్ కాలనీ రోడ్‌లోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలో, పోస్టల్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, షిరిడీ సాయిబాబా ఆలయంలో, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయంలో, ఏకశిలా పార్కు సమీపంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతా రామ చంద్రస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

బాలసముద్రం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద హైదరాబాద్‌లో ఈనెల 8న జరిగే ప్రజా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి బన్న నర్సింగం, అనిల్, రాజేష్, శ్రీను , మురళి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతోనే అనేక అనర్థాలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతోనే అనేక అనర్థాలు, ఆరోగ్య సమస్యలు ఉంటాయని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవిందర్ అన్నారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో 5వ రోజు శనివారం ఎస్సార్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం, మాదక ద్రవ్యాలపై అవగాహన, స్వచ్ఛ భారత్ వంటి అంశాలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులతో సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సంపత్‌తో పాటు గ్రామస్థులు, 212 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

నిట్‌లో ఇటికాల విగ్రహం ఏర్పాటు చేయాలి


• ఘనంగా మధుసూదన్‌రావు 107వ జయంతి

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆర్‌ఈసీ (ప్రస్తుతం నిట్) వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ ఇటికాల మధుసూదన్‌రావు కాంస్య విగ్రహాన్ని నిట్ ప్రధాన గేటు ముందు ఏర్పాటు చేయాలని నిట్ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. శనివారం వరంగల్ నిట్ మెయిన్ గేటు వద్ద మధుసూదన్‌రావు జయంతిని ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఖైదం సంజీవ అధ్యక్షతన జరిగింది. తొలుత నిట్ మాజీ డీన్ ప్రొఫెసర్ పులి రవికుమార్ మధుసూదన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఈసీ స్థాపనకు మధుసూదన్‌రావు విశేషంగా కృషి చేశారన్నారు. అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూతో ఆర్‌ఈసీ ఏర్పాటు చేయించారన్నారు. ఆయన పట్టుదలతోనే నెహ్రూ వరంగల్‌కు వచ్చి ఆర్‌ఈసీకి పునాది రాయి వేశారన్నారు. ఆర్‌ఈసీ స్థాపనకు కృషి చేసిన మధుసూదన్‌రావు సేవలకు గుర్తింపుగా ఆయన కాంస్య విగ్రహాన్ని నిట్ మెయిన్ గేటు ముందు ఏర్పాటు చేయాలని కోరారు. టెక్నికల్ ఎంప్లాయీస్ యూనియన్ పక్షాన వై. రాంచందర్, ఎస్.వేణుగోపాల్, సపోర్టింగ్ స్టాఫ్ తరుపున కె.రాజు, పి.కుమారస్వామి, హాస్టల్ ఎంప్లాయీస్ పక్షాన టి.పోషయ్య, బి.యాకూబ్, పి.రమేష్, కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన కె.కర్ణాకర్, ఎం.మల్లేశం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్ర మంలో బొట్టు శ్రీనివాస్, ఎ.కుమారస్వామి, గడ్డం రవి, మురళి, బి.లాల్, శారద, విజయ, యాదగిరి, తార, ఇసాకు, ఎ.కొమురయ్య, మరో 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.



నిట్ ప్రధాన గేటు వద్ద మధుసూదన్‌రావు జయంతిని నిర్వహిస్తున్న ఉద్యోగులు

నవ్య కుటుంబ కదంబం ఆదివారం



మన రాముడు ఆనంద స్వరూపుడు

'రామో విగ్రహవాన్ ధర్మః' అని రామాయణం చెబుతోంది. అంటే రాముడు ధర్మానికి ప్రతి రూపం. రాముడు అంత ధర్మబద్ధంగా జీవించాడు. 'మరి అంత ధర్మబద్ధంగా జీవించిన రాముడికి ఎందుకు అన్ని బాధలు, కష్టాలు? ధర్మాచరణ అంటే అలా కష్టాలు, బాధలు అనుభవించాలా? సాక్షాత్తూ పరమాత్మ అయిన రాముడే ధర్మాచరణ కోసం అన్ని కష్టాలు ఎదుర్కోవలసివస్తే మరి మనలాంటి సామాన్య మానవుల పరిస్థితి ఏంటి? ధర్మాచరణలో వచ్చే కష్టాలు, బాధలు మనం తట్టుకోగలమా?'- ఇలాంటి సందేహాలు కొందరికి కలుగుతూ ఉంటాయి. ఇదే విధంగా - 'ధర్మం కోసం ఆనందాన్ని పణంగా పెట్టడమా లేక ఆనందం కోసం ధర్మాన్ని తప్పడమా?' అనే సంకోచం కూడా కలుగుతుంది. అలాంటి సందర్భాలలో ఎక్కువ మంది రెండో వైపే మొగ్గు చూపుతారు. దీనికి ప్రధాన కారణం- ధర్మాచరణ గురించి సరైన అవగాహన లేకపోవటమే!

అంటే ఏమిటి?

ధర్మాచరణ అంటే శాస్త్ర నియమాలను పాటించడం. ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించడం. ఇటువంటి జీవనం మనకు ఇహలోకంలో సుఖసంతోషాలు ఇవ్వడమే కాకుండా, మరణానంతరం ఉన్నత గతులను ప్రసాదిస్తుంది. అంతేకాని ధర్మం అంటే కష్టాలు మోయడం కాదు, బాధలు అనుభవించడం అంతకన్నా కాదు. నిజానికి ధర్మం వలన మాత్రమే మనం అసలైన ఆనందాన్ని పొందగలం, సుఖప్రదమైన జీవితం అనుభవించగలం. అధర్మం వలన, అనగా ప్రకృతి విరుద్ధ చేష్టల వలన, మనకు వచ్చేది కేవలం క్షణికమైన ఆనందం మాత్రమే. ఉదాహరణకు మద్యపానం మనకు ఆనందాన్ని, సుఖాన్ని ఇస్తుంది. కానీ హ్యాంగోవర్‌లు మిగులుస్తుంది. విషవలయంలోకి నెడుతుంది. కానీ ధర్మం వలన వచ్చే ఆనందం అమృత పానం లాంటిది. దానికి 'హ్యాంగోవర్' లాంటి దుష్ప్రభావాలు ఉండవు. నిలకడ అయిన ఆనందం లభిస్తుంది.

ఎందుకన్ని కష్టాలు?

మరి మన రాముడు ధర్మాచరణ చేసి కూడా ఎందుకు అన్ని కష్టాలు అనుభవించాడు? నిజానికి మనం ఊహించుకున్నట్లు రాముడు అన్ని కష్టాలూ పడలేదు, అంత దుఃఖమూ అనుభవించలేదు. రాముడు అయోధ్యను పాలించే సమయంలో ప్రజలందరూ ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించారు. అలానే రాముడూ ఆనందంగా జీవించాడు. కాకపోతే పట్టాభిషేకానికి ముందు పద్నాలుగు ఏళ్ళు వనవాసం చేయవలసి వచ్చింది. విలాసవంతమైన రాజభోగాలు వదిలి అలా 14 ఏళ్ళు వనవాసానికి వెళ్లడం మనలాంటి మనుషులకు నిజంగా చాలా బాధాకరమైన విషయమే అవుతుంది. కానీ రాముడు మహాజ్ఞాని, చిన్న వయస్సులోనే వసిష్ఠుడు వంటి మహర్షుల నుంచి బ్రహ్మ జ్ఞానాన్ని పొందినవాడు. అటువంటి జ్ఞానులకు రాజభోగాలు, అధికారం వంటివి తృణప్రాయాలు. రాముని వంటి పరాక్రమవంతులకు వనవాసం ఒక విహారయాత్ర అవుతుంది.

కాబట్టి రాముడు వనవాసం చేసి బాధలు అనుభవించాడు అనుకోవడం పొరపాటు.

ఇక పోతే తండ్రి మరణం, సీతా వియోగం, రావణ పీడ... వాటి వలన రాముడు కొంత దుఃఖాన్ని అనుభవించాడు. కానీ జ్ఞాని కాబట్టి తండ్రి మరణాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాడు, సీతా వియోగాన్ని సహనంతో భరించాడు. ధైర్యంగా శత్రువుతో పోరాడి విజయం సాధించాడు. రాముడు కూడా కొన్ని కష్టాలు, బాధలు, సవాళ్లు ఎదుర్కొన్నాడు. కానీ వాటిని తప్పించుకోడానికి ఆయన ధర్మాన్ని తప్పలేదు. ఇదే రామకథలో ముఖ్యమైన అంశం.

నిజానికి కష్టాలు, బాధలు అనేవి అసలు లేకపోతే, జీవితంలో సుఖాల్ని, ఆనందాల్ని ఆస్వాదించలేం. ఏసీ యొక్క సుఖాన్ని ఆస్వాదించాలంటే మనం కనీసం అప్పుడప్పుడు ఎండలో తిరగాలి. కాబట్టి మనం జీవితంలో అప్పుడప్పుడూ వచ్చే కష్టాలను, బాధలను తలుచుకుని కుమిలిపోకుండా ధైర్యంతో, సహనంతో ధర్మ మార్గంలో ముందుకు సాగాలి. అప్పుడూ మన జీవితం కూడా శ్రీరాముడి జీవితంలా అధిక శాతం ఆనందమయమవుతుంది.

అందరికీ తప్పవు..

మానవులందరూ ఇలాంటి క్లిష్ట పరిస్థితులు ఎప్పుడో ఒకసారి ఎదుర్కొనాల్సి ఉంటుంది. మనం కూడా భోగాల్ని వదిలి వేయాల్సిన సందర్భాలు వస్తాయి, మనకు కూడా ఆప్తుల వియోగం కలుగుతుంది. అలానే రావణుడి లాంటి పెద్ద శత్రువులు కాకపోయినా మన స్థాయిలో మనకూ శత్రువుల నుంచి బాధలు తప్పవు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే మనం జ్ఞానం సంపాదించుకోవాలి, సహనం అలవర్చుకోవాలి, ధర్మ సూక్ష్మాలు తెలుసుకోవాలి, ధైర్యంగా పోరాడాలి. అంతే కాని కష్టాలు, బాధలు తప్పించుకోడానికి మనం అధర్మాన్ని ఆశ్రయిస్తే, అంతకు పది రెట్లు కష్టాలు, బాధలు కొనితెచ్చుకుంటాం.

డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు
నరసరావుపేట, ఫోన్: 9989749075

తెలుగులో సీక్వెల్స్ సంస్కృతికి విజయవంతంగా తెరతీసిన నిర్మాత, సితార ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత నాగవంశీ. ప్రస్తుతం తెలుగులో అగ్ర నిర్మాతల్లో ఒకరైన నాగవంశీ సోషల్ మీడియాలో తరచూ కనిపిస్తూ ఉంటారు. ప్రస్తుతం తెలుగు నిర్మాతలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి.. పరిశ్రమకు ఉన్న అవకాశాల గురించి ఆయన 'నవ్య'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలలోకి వెళ్తే...

ఇప్పుడు సినిమాలు తీయడం కష్టమే..!

'మ్యాడ్ 2' విజయం మీకు ఎలాంటి అనుభూతి మిగిల్చింది?

చాలా ఆనందంగా అనిపించింది. ఎందుకంటే ఒక సీక్వెల్ తీసి ప్రేక్షకులను మెప్పించటమనేది అంత సులభం కాదు. 'మ్యాడ్ 2'- హిందీలో బ్లాక్‌బస్టర్ అయిన 'గోల్‌మాల్' ఫ్రాంచైజ్ సినిమాల మాదిరిగా ఉంటుంది. దీనిలో స్టోరీ లైన్ ఉండదు. ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే ఉంటుంది. ఈ సినిమాకు 'మ్యాడ్' కన్నా నాలుగైదు రెట్లు వసూళ్లు వచ్చాయి. నా వరకు చాలా సంతృప్తిగా ఉన్నా.

హాలీవుడ్‌లో సీక్వెల్స్ బంగారు గుడ్లు పెట్టే బాతులు... ఆ తరహా వ్యూహంతోనే మీరు ఈ సినిమాలు తీసారా?

'టిల్లు', 'మ్యాడ్' సినిమాలు తీసే సమయంలో అవి సీక్వెల్స్‌గా మారతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. రెండో పార్ట్ విజయవంతమయిన తర్వాత మాత్రమే వీటిని ఫ్రాంచైజ్‌గా మార్చాలనుకున్నా. ఎందుకంటే- సినీ రంగంలో విజయం సాధించే సినిమాలు ఐదు శాతం మాత్రమే. ఎంత మంచి కంటెంట్‌తో సినిమా తీసినా- అది హిట్ అవుతుందని మనం చెప్పలేం. ఏవైనా పరాజయాలు ఎదురయితే - సీక్వెల్స్ ట్రంప్ కార్డ్స్‌గా ఉపయోగపడతాయి. ఎందుకంటే సీక్వెల్స్‌ను ఎప్పుడూ తీసినా అవి తప్పనిసరిగా విజయవంతమవుతాయి.

సినీ నిర్మాణం చాలా కష్టమయిపోయింది.. నిర్మాతలు సమస్యలు ఎదుర్కొంటున్నారనే వార్తలు వింటుంటాం.. వీటిలో నిజమెంత?

సినీ నిర్మాణం చాలా కష్టమయిపోయింది. ఇది వాస్తవం. ఎందుకంటే నిర్మాణ వ్యయం పెరిగిపోతోంది. ఆదాయ మార్గాలు మాత్రం మూసుకుపోతున్నాయి. ఉదాహరణకు శాటిలైట్ రైట్స్ (టీవీలలో ప్రసారాల ద్వారా) నుంచి వచ్చే ఆదాయం దాదాపు సున్నా అయిపోయింది. హిందీ డబ్బింగ్ నుంచి వచ్చే ఆదాయం కూడా రావటం లేదు. ఇక ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటున్నాయి. వీటికి తోడు - సినిమా చాలా బావుంటే తప్ప ప్రేక్షకులు థియేటర్‌కు రావటం లేదు. కొన్ని సినిమాలకు ఓపెనింగ్స్ కూడా ఉండటం లేదు. ఈ కారణాల వల్ల నిర్మాతకు ఆదాయ మార్గాలు తగ్గాయి.

మరి నిర్మాణ వ్యయం తగ్గించుకోవచ్చు కదా...

నిర్మాణ విలువలు ఒక స్థాయిలో ఉంటే తప్ప ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమాలు చూడటం లేదు. సాంకేతిక విలువలు కావాలంటే ఖర్చు పెట్టాల్సిందే. అందుకే సినీ నిర్మాణం రిస్క్‌గా మారింది.

వందల కోట్ల కలెక్షన్లు వచ్చేస్తున్నాయని పోస్టర్లు పడుతున్నాయి కదా...

ఒక సంవత్సరంలో 100 సినిమాలు విడుదల అయ్యాయి అనుకుందాం. మీరు చెప్పిన వందల కోట్లు ఐదారు సినిమాలకే వస్తున్నాయి. మిగిలిన నిర్మాతలందరూ దెబ్బతింటున్నారు కదా..

మరి ఇంత రిస్క్ అయినప్పుడు సినిమాలు ఎందుకుతీస్తున్నారు?

మిగిలిన వారి గురించి నేను మాట్లాడను. కానీ నాకు కానీ.. మైత్రీ మూవీ మేకర్స్‌కు కానీ తెలిసిన పని ఇదే! "తెలిసిన పని ఫ్రీగా చేయకూడదు.. రాని పని చేయకూడదు" అని 'జులాయి'లో ఒక డైలాగ్ ఉంది. దాన్నే ఫాలో అవుతున్నాం. వేరే వ్యాపారాల్లోకి వెళ్లి దెబ్బతినటం కన్నా- తెలిసిన ఈ పని బాగా చేయటం మంచిది కదా!



ఉండాలనుకుంటాం... కానీ

తెలుగు పరిశ్రమలో ఉన్న నిర్మాతలందరూ అన్ని విషయాల్లో ఏకాభిప్రాయంలో ఉండాలనుకుంటాం. మీటింగ్‌లలో మాట్లాడుకున్నప్పుడు ఏకాభిప్రాయమే ఉంటుంది. బుధవారం వరకు ఒక మాటపైనే ఉంటారు. గురువారం- అంటే సినిమా విడుదలవ్వటానికి ఒక రోజు ముందు నిర్మాతపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. కమిట్‌మెంట్స్ ఉంటాయి. అప్పటి దాకా ధైర్యంగా ఉన్న నిర్మాతలో ఎక్కడో చిన్నపాటి అభద్రతాభావం మొదలై 'ఇంతింతై వటుడింతై..' అన్నట్లు పెరిగిపోతుంది. ఈ సమయంలో వారిపై పీఆర్‌ఓలు ఒత్తిడి పెట్టడం మొదలుపెడతారు. "ఇది చేయకపోతే వాళ్ల ఇలా చేస్తారు..అలా చేస్తారు.." అని భయపెడుతూ ఉంటారు. దీంతో కొన్ని విషయాల్లో నిర్మాతలు రాజీపడిపోతారు. 'సినిమా బావుంటే చూస్తారు. బావుండకపోతే చూడరు'.. ఈ విషయం అందరి నరనరాల్లో జీర్ణమయిపోతే- ఇలాంటి ఒత్తిళ్లకు భయపడటం మానేస్తాం. దానికి చాలా ధైర్యం కావాలి..

కార్పొరేట్ పెట్టుబడులు రావటం వల్ల మంచి సినిమాలు ఎక్కువగా తీయగలుగుతాం. సితారలో 'మైహోం' సంస్థ పెట్టుబడులు పెట్టింది.. 'మైహోం' రాముకు సినిమాలపై మంచి అభిరుచి ఉంది. ఏదో చేయాలనే తపన ఉంది. అందుకే 'ఆహా' కూడా ప్రారంభించారు. ఇక సృజనాత్మకమైన నిర్ణయాలు విషయంలో కలగజేసుకోరు కాబట్టి ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

నిర్మాణ వ్యయం పెరిగిపోవటానికి ఎక్కువ రోజులు షూటింగ్ చేయటమే కారణమంటున్నారు కదా...

వర్కింగ్ డేస్ తగ్గించాలని ప్రయత్నిస్తున్నాం. కానీ కొన్ని సినిమాలకు తప్పదు. కంటెంట్‌పై రాజీ పడితే మొత్తానికే మోసం వస్తుంది. అందువల్ల కొన్ని సినిమాలకు ఖర్చు పెట్టక తప్పటం లేదు.


సినిమా విడుదలయిన వెంటనే 'ఐబొమ్మ' లాంటి వాటిలో పైరసీ ప్రింట్స్ వచ్చేస్తున్నాయి.. వీటిని అరికట్టలేరా?

గత కొన్ని నెలలుగా పైరసీ బాగా పెరిగింది. మంచి క్వాలిటీ ఉన్న ప్రింట్స్ బయటకు వచ్చేస్తున్నాయి. నా ఉద్దేశంలో పైరసీ చూసే వారు ఓ ఐదు శాతం మాత్రమే ఉంటారేమో.. ఎక్కువ మంది థియేటర్లలోనే సినిమా చూడాలనుకుంటారు. అయినా కలెక్షన్లకు ఇది పెద్ద ప్రమాదంగా మారింది. ప్రస్తుతం ఛాంబర్‌లో ఉన్న యాంటీ పైరసీ విభాగం ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి సరిపోదు. ఇంతకు ముందు థియేటర్లలో ప్రింట్స్ తీసేవారు. ప్రస్తుతం పైరసీ అవుతున్నవి అలాంటివి కావు. మంచి క్వాలిటీ ఉన్న ప్రింట్స్. ఎక్కడి నుంచి లీక్ అవుతు న్నాయో 'క్యూబ్' ద్వారా కనుక్కోవటానికి ప్రయత్నిస్తున్నాం.

సోషల్ మీడియా ప్రేక్షకుల అభిప్రాయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుందని మీరు భావిస్తున్నారా?

సోషల్ మీడియా వల్ల మంచి, చెడు- రెండూ ఉన్నాయి. మంచి విషయానికి వస్తే ఏదైనా కంటెంట్ వైరల్ కావాలంటే సోషల్ మీడియానే కావాలి. సోషల్ మీడియా యుగంలో దేనిని దాచుకోవాలనుకున్నా దాచుకోలేం. ఇక చెడు విషయానికి వస్తే- వ్యక్తిగత అభిప్రాయాలే ఎక్కువ ప్రచారంలోకి వస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఒక సినిమా బావుందా? లేదా అనే విషయంలో 40 మంది బావుంది అంటారు.. 40 మంది బావులేదంటారు. 20 మంది తటస్థంగా ఉండిపోతారు. ఇది పర్వాలేదు. కానీ ఎవరో ఒకరి అభిప్రాయం విస్తృతంగా ప్రచారమైతేనే సమస్య.

● సివిఎల్ఎన్ ప్రసాద్



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కిల్ టోనీ	హాలీవుడ్‌మూవీ	ఏప్రిల్ 07
ఛావా	హిందీ చిత్రం	ఏప్రిల్ 11
అమెజాన్ ప్రైమ్		
జీ 20	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 10
ఛోరీ 2	హిందీ చిత్రం	ఏప్రిల్ 11
జియో హాట్‌స్టార్		
ది లెజెండ్ ఆఫ్ హనుమాన్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 11
పీస్ బై పీస్	యానిమేషన్ సిరీస్	ఏప్రిల్ 11
సోనీ లివ్		
ప్రవీణ్‌కూడు షాప్పు	మలయాళ చిత్రం	ఏప్రిల్ 11

ఛోరీకి సీక్వెల్

అతీంద్రియ శక్తులు, సామాజిక దురాచారాల నుంచి తన బిడ్డను కాపాడుకునేందుకు ఓ తల్లి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో తెరకెక్కిన సూపర్ నేచురల్ హారర్ 'ఛోరీ 2'. గతంలో వచ్చిన హిందీ చిత్రం 'ఛోరీ'కి ఇది సీక్వెల్. ఓ మారుమూల గ్రామంలోని పాడుపడిన కోట నేపథ్యంలో బీభత్సరస ప్రధాన కథాంశంగా రూపుదిద్దుకుంది. నుస్రత్ భరూచా లీడ్‌రోల్ పోషించారు. విశాల్ ఫ్యూరియా దర్శకుడు. భూషణ్‌కుమార్ నిర్మించారు.



శిరోజాల కుదుళ్లు బలంగా...



పోషకాహార లోపం, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల కుదుళ్లు బలహీనమై శిరోజాలు రాలిపోతాయని నిపుణులు చెబుతున్నారు. కుదుళ్లు బలంగా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

- మాడు మీద చర్మం పొడిబారకుండా చూసుకుంటే కుదుళ్లు బలపడతాయి. ఆముదం, కొబ్బరినూనె, బాదం నూనె, ఆలివ్ నూనెల్లో ఒకదానితో తలంతా మర్దన చేసుకుంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఆ నూనెని కొద్దిగా వేడిచేసి ఉపయోగించడం వల్ల మాడు మీద రక్తప్రసరణ పెరిగి కుదుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.
- ప్రోటీన్లు, ఇరన్, బయోటిన్ లాంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలి. గుడ్లు, పాల ఉత్పత్తులు, తాజా కూరగాయలు, ఆకు కూరలు, పళ్లను ఆహారంలో చేర్చుకుంటే శిరోజాల కుదుళ్లు బలపడతాయి.

వెండి తెర రాముడు

తెలుగు సినిమాలకు, శ్రీరామునికి ప్రత్యేక అనుబంధం ఉంది. సినిమాల్లో రాముడు అనగానే మొదట గుర్తుకొచ్చే పేరు నందమూరి తారక రామారావు. నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు తెలుగులో తొలిసారిగా రాముడి పాత్రను పోషించినవారు యడవల్లి సూర్యనారాయణ. ఆ తర్వాత పారుపల్లి సుబ్బారావు. కానీ, రాముడి పాత్రలో ఎంత మంది నటించినా గుర్తొచ్చేది ఒక్క ఎన్టీఆర్ మాత్రమే.

1932లో వచ్చిన 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం'లో యడవల్లి సూర్యనారాయణ తొలిసారిగా రాముని పాత్రలో కనిపించారు. అప్పటికే రంగస్థల నటుడిగా పేరున్న సూర్యనారాయణ ఈ చిత్రం ద్వారా సినీ రంగంలోకి ప్రవేశించారు. బాదామి సర్వోత్తం దర్శకత్వంలో సాగర్ స్టూడియోస్ నిర్మించింది. తెలుగులో రెండో టాకీ చిత్రంగా తెరకెక్కింది. ఆ తర్వాత 1934లో వచ్చిన మొదటి 'లవకుశ'లో పారుపల్లి సుబ్బారావు రాముడి పాత్రను పోషించారు. 1959లో ఎస్.ఎ స్.ఎ. ఆచార్య దర్శకత్వంలో తెరకెక్కిన 'శ్రీ రామాంజనేయ యుద్ధం'లో అమర్‌నాథ్ రాముడిగా నటించారు.

- 'సీతారామ కల్యాణం', 'శ్రీరామ కథ' చిత్రాల్లో హరనాథ్ రాముడి పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకుల మనసులు దోచుకున్నారు.
- తొలి తరం తెలుగు నటుల్లో ఒకరైన కాంతారావు 'వీరాంజనేయ'లో రాముడిగా కనిపించారు.
- కృష్ణ తన తొలి చిత్రం 'తేనె మనుసులు'లో రాముడి అవతారంలో కన్పించారు. 'అల్లూరి సీతారామరాజు'లో కూడా ఓ చోట రాముడి పాత్రను పోషించారు.
- 'రామదాసు' సినిమాలో సుమన్, 'దేవుళ్లు' చిత్రంలో శ్రీకాంత్ రాముడిగా అలరించారు.
- రామాయణం నేపథ్యంలో చివరగా వచ్చిన చిత్రం 'ఆదిపురుష్'. ఈ చిత్రంలో కథను ఆధునిక రీతిలో చెప్పే ప్రయత్నం చేశారు.



రెండో రాముడు ఏఎన్ఆర్

1944లో వెండితెరకు రెండో రాముడిగా అక్కినేని నాగేశ్వరరావు పరిచయమయ్యారు. 'సీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను ఆయన చక్కగా పోషించారు. ఈ సినిమా తర్వాత 1945లో వచ్చిన 'పాదుకా పట్టాభిషేకం'లో సీఎస్ఆర్ ఆంజనేయులు రాముడిగా కనిపించారు.

అదే మొదటిసారి

'చరణదాసి' అనే సాంఘిక కథా చిత్రంలో ఎన్టీఆర్ తొలిసారిగా రాముడి వేశంలో కన్పించారు. 1958లో విడుదలైన తమిళ 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముని పాత్రలో పూర్తి స్థాయిలో నటించారు. ఆ తర్వాత వచ్చిన 'లవకుశ' ఎన్టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. రామాంజనేయ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం చిత్రాల్లోనూ ఎన్టీఆర్ శ్రీరాముడి పాత్రలో నటించారు. 'శ్రీరామ పట్టాభిషేకం', 'సీతారామ కల్యాణం' చిత్రాలకు ఎన్టీఆర్ దర్శకత్వం కూడా వహించారు.


శోభన్‌బాబు

'భక్త పోతన'లో శోభన్‌బాబు తొలిసారిగా రాముడి పాత్రలో ఓ ఐదు నిమిషాలు కన్పిస్తారు. అలాగే బాపు దర్శకత్వంలో రూపొందిన 'సంపూర్ణ రామాయణం'లో పూర్తి స్థాయిలో రాముడి పాత్రను పోషించారు. ఈ సినిమా శోభన్‌బాబుకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఎన్టీఆర్ తరవాత రాముడి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన ఘనత ఒక్క శోభన్‌బాబుకే దక్కుతుంది. బాపు దర్శకత్వంలోనే వచ్చిన మరో సినిమా 'సీతాకల్యాణం'. ఇందులో జయప్రద సీతగా, మలయాళ నటుడు రవి రాముడిగా నటించారు. బాపు తెరకెక్కించిన చివరి చిత్రం 'శ్రీరామరాజ్యం'లో నందమూరి బాలకృష్ణ రాముడిగా నటించారు. 'లవకుశ'కు రీమేక్‌గా తీసిన ఈ చిత్రంలో బాలకృష్ణ అద్భుతంగా నటించి ఎన్టీఆర్‌ను మైమరపించారు.

బాల రాముడు

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణం(1996)'లో జూనియర్ ఎన్టీఆర్ రాముడిగా కనిపించారు. అన్ని పాత్రలనూ బాలలతో తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.









అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

- అమెరికా, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్‌లో దందా
- నేరుగా కాకుండా.. ఫొటో, లొకేషన్ ద్వారా డ్రగ్స్ సరఫరా
- సంపాదించిన డబ్బంతా నైజీరియాకు
- 9 మందిని అరెస్టు చేసిన టీజీ న్యాబ్
- భారీగా మాదకద్రవ్యాల స్వాధీనం


తేజస్


సోహైల్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాతోపాటు.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో డ్రగ్స్ దందా చేస్తున్న అంతర్జాతీయ ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీజీ-న్యాబ్) అధికారులు రట్టుచేశారు. ఈ ముఠాలోని కీలక వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ ముఠాకు బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులను సరఫరా చేస్తున్న వారు, విదేశాల నుంచి వస్తున్న డబ్బును నగదుగా మార్చుకోవడానికి సహకరిస్తున్న ఫారెక్స్ ఏజంట్లతోపాటు మొత్తం 9 మందిని అరెస్టు చేసినట్లు టీజీ-న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఎబుకా అలియాస్ ఇమాన్యుయెల్ అమెరికాతోపాటు.. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లో డ్రగ్స్ దందా చేస్తుంటాడు. ఇందుకోసం ఎక్కడికక్కడ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ముఠా తమ కస్టమర్లకు నేరుగా మత్తుపదార్థాలను అందించకుండా.. నిర్మానుష్య ప్రదేశాల్లో దాచి, ఆ ఫొటో, లొకేషన్‌ను షేర్ చేస్తుంది. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠా గురించి ఉప్పందుకన్న టీజీ-న్యాబ్, సైబరాబాద్ యాంటీ నార్కోటిక్స్ వింగ్ సంయుక్తంగా రాజేంద్రనగర్‌లోని ఉప్పరపల్లిలో దాడులు చేసిన, కీలక వ్యక్తులను అరెస్టు చేసింది. అమెరికాలో కూడా ఇదే నేరశైలితో డ్రగ్స్‌ను విక్రయిస్తారని, కస్టమర్ల నుంచి అమెరికా జాతీయురాలైన ఓ యువతి ఖాతాకు.. అక్కడి నుంచి కొందరు ఎన్నారైల ఖాతాల ద్వారా డబ్బును భారత్‌కు తరలిస్తారని వివరించారు. వస్త్రవ్యాపారం పేరిట నైజీరియా నుంచి బెంగళూరుకు వచ్చే తమ దేశస్థులకు ఆ మొత్తం ఇచ్చి, దేశం దాటిస్తారని సందీప్‌శాండిల్య వివరించారు. డబ్బు బదిలీకి సహకరించేవారు ఒబుకా నుంచి భారీ మొత్తంలో కమీషన్లు తీసుకుంటారని చెప్పారు. 2020 నుంచి ఈ ముఠా ఇప్పటి వరకు 6,60,52,940 నైజీరియన్ కరెన్సీ(ఎన్‌జీఎన్), 6,34,426 అమెరికన్ డాలర్లు, రూ.85,42,191 నగదును వివిధ బ్యాంకింగ్ చానల్స్, వెస్ట్రన్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజన్సీల ద్వారా నైజీరియాకు తరలించినట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో ఒబుకా సోదరుడు ఇలాషీ, స్థానిక ఏజెంట్లు బిగ్ జోయ్, విక్టర్ డానియల్, వీరికి నగదు బదిలీలో సహకరించే ఫైన్ మల్టీ పర్పస్ సర్వీసెస్ యజమాని మతీన్ సిద్దిఖీ, గోయన్ ఫారెక్స్ యజమాని ఆనంద్ జైన్, శాంతి ఫారెక్స్ యజమాని సురేశ్ జైన్, జైన్ ఫారెక్స్ యజమాని ఉత్తమ్ జైన్‌ను అరెస్టు చేశామన్నారు. ఫారెక్స్ సంస్థల యజమానులు ఈ ముఠాకు నగదు బదిలీతోపాటు.. ఎన్నారైల బ్యాంకు ఖాతాలను అందజేసి, సహకరించే వారని సందీప్ శాండిల్య వివరించారు. ఈ ముఠా నుంచి 15 గ్రాముల కొకైన్, 50 గ్రాముల ఎండీఎంఏను సీజ్ చేశామన్నారు.

ఎన్నారై డ్రగ్ పెడ్లర్ అరెస్టు

డ్రగ్స్‌కు బానిసై.. ఆపై డ్రగ్స్ దందాను ఎంచుకున్న ఓ ఎన్నారై, అతని స్నేహితుడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.లక్ష నగదు, 32.5గ్రాముల చరాస్, 56గ్రాముల ఎల్‌ఎస్‌డీ, 21గ్రాముల ఓజీఖుష్, ఒక కారు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బేగంపేటకు చెందిన తేజస్ కట్టా(29)కు అమెరికా పౌరసత్వం ఉంది. ఏడాది వయసున్నప్పటి నుంచి అతను అమెరికాలోనే ఉండేవాడు. కొన్నాళ్ల క్రితం భారత్‌కు వచ్చేశాడు. రెండేళ్లు ముంబైలో ఉద్యోగం చేశాడు. ఆ క్రమంలో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఎంఎన్‌సీలో ఉద్యోగం చేస్తుండగా.. డ్రగ్స్ వ్యసనపరుడైన సోహైల్ అహ్మద్ అనే ఉద్యోగి పరిచయమయ్యాడు. వీరిద్దరూ 15 రోజులకోసారి ముంబై వెళ్లి, డ్రగ్స్ తెచ్చుకునేవారు. క్రమంగా.. డ్రగ్స్ విక్రయాలను ప్రారంభించారు. ఉప్పందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం.. నన్‌సిటీ వద్ద వలపన్ని వీరిద్దరినీ అరెస్టు చేసింది.

రూ. 10 లక్షల విలువైన కొకైన్ పట్టివేత

టూరిస్టు బస్సులో తరలిస్తున్న కొకైన్‌ను ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జానకిపురానికి చెందిన డి.చంద్రశేఖర్ టూరిస్టు బస్సులో గోవా నుంచి కర్ణాటక మీదుగా తెలంగాణకు 10.30 గ్రాముల కొకైన్‌ను తీసుకొస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు చిరాగ్‌పల్లి వద్ద దాడి చేసి, అరెస్టు చేశారు. అతని నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 10.30 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'జనచైతన్య హౌసింగ్'కు చుక్కెదురు

మణికొండ జాగీర్ విలేజ్‌లో రిజిస్ట్రేషన్ల నిరాకరణ సబబే: హైకోర్టు



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీర్ విలేజ్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్, దాని అధీకృత అధికారి వై.శ్రీధర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఈ భూముల్లోని మూడు ప్లాట్ల సేల్‌డీడ్ డాక్యుమెంట్ల (471, 472, 473) రిజిస్ట్రేషన్‌కు తిరస్కరిస్తూ శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ తీసుకున్న నిర్ణయం సబబే అని హైకోర్టు పేర్కొంది. మణికొండ జాగీర్ విలేజ్‌లోని సర్వే నెంబర్ 250లో తమ భూముల్లో ప్లాట్ల విక్రయానికి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నిరాకరిస్తున్నారని, అది ప్రభుత్వ భూమి అని, నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్లు చేయడం లేదని 'జనచైతన్య' హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ గుర్తింపు లేని లేఅవుట్లకు ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద తమకు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి లభించిందని పేర్కొన్నారు. మరోవైపు సదరు భూములు వక్ఫ్ బోర్డుకు సంబంధించినవన్న వాదనను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని, సదరు భూముల్లో రిజిస్ట్రేషన్లకు అనుమతి ఉందని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ సదరు భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ కంపెనీకి సదరు భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేవని స్పష్టం చేసింది. ఎలాంటి టైటిల్ లేని భూములను రిజిస్ట్రేషన్ చేయాలని కోరలేరని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టేసింది.

చిత్రజ్యోతి

SINCE 1965



రేయి లోలోతుల..

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శనివారం రష్మిక పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమా నుంచి పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల'ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రష్మిక చేతిలో కత్తి పట్టుకొని, నడుమున గన్‌తో శక్తిమంతంగా కనిపిస్తున్నారు. 'రేయి లోలోతుల' పాటకు హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించడంతో పాటు విజయ్ దేవరకొండ, చిన్మయి శ్రీపాదతో కలసి ఆలపించారు.

విచారణకు భయపడం

- మల్లిక సుకుమారన్



'నా కొడుకు ఏ తప్పూ చేయలేదు. ఎలాంటి విచారణనైనా ఎదుర్కోవడానికి మేము సిద్ధం. భయపడాల్సిన అవసరం మాకు లేదు' అని మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక సుకుమారన్ స్పష్టం చేశారు. మార్చి 29 ఆదాయపు పన్ను శాఖ అధికారులు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు నోటీసులు జారీ చేయగా, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో దీనిపై మల్లిక స్పందిస్తూ పైవిధంగా వ్యాఖ్యానించారు. కాగా, 2022లో పృథ్వీరాజ్ నటించిన మూడు చిత్రాలు 'కడువ', 'జనగణ మన', 'గోల్డ్' విడుదలయ్యాయి. ఈ చిత్రాలకు సహనిర్మాతగా కూడా వ్యవహరించిన పృథ్వీరాజ్ నటుడిగా ఎలాంటి పారితోషికం తీసుకోలేదు. అయితే ఆ వివరాలను ఈనెల 29వ తేదీలోగా తెలియజేయాలంటూ ఐటీ అధికారులు నోటీసులు ఇచ్చారు.



వినసొంపైన మెలోడీ

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్, భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్‌లో రూపొందింది. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషించారు. ఈనెల 11న విడుదలవుతోంది. తాజాగా, ఈ చిత్రం నుంచి 'ప్రియమారా మౌనాల చాటు మాటలే తెలియదా' అంటూ సాగే వినసొంపైన మెలోడీని మేకర్స్ విడుదల చేశారు. రాకేందు మౌళి పాటను రచించగా, శరత్ సంతోష్, లిప్సిక భాష్యం ఆలపించారు. రధన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: ఎమ్ఎన్ బాలరెడ్డి.

ఘంటసాల రవికుమార్ కన్నుమూత



దివంగత దిగ్గజ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కుమారుడు ఘంటసాల రవికుమార్ (72) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మధ్యాహ్నం కార్డియాక్ అరెస్టుకు గురయ్యారు. ఆ వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారని ఆయన ఏకైక కుమారుడు మొహీందర్ ఘంటసాల 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఘంటసాల రవికుమార్ సౌండ్ రికార్డిస్టుగా ఉన్నారు. దూరదర్శన్‌తో పాటు సన్ టీవీ, జయా టీవీల్లో ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేశారు. కాగా, తన కుటుంబ సభ్యులు విదేశాల నుంచి నగరానికి రావాల్సి ఉందని, అందువల్ల అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం జరుగుతాయని మొహీందర్ వెల్లడించారు. ఘంటసాల రెండవ భార్య కుమారుడే రవికుమార్.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



రామాయణం.. అమితాబ్ గొంతుతో

శ్రీరామనవమి సందర్భంగా అమితాబ్ బచ్చన్ రామకథను వినిపించబోతున్నారు. ఓటీటీ వేదిక డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ఆదివారం ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ రామాయణంలోని ఏడు కాండాలను ప్రేక్షకులకు వివరించనున్నారు. ఈ లైవ్ స్ట్రీమ్‌లో అయోధ్య, భద్రాచలం, పంచవటి, చిత్రకూట్ వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాల్లోని పూజా కార్యక్రమాలను, వేడుకలను ప్రసారం చేస్తున్నారు. అలాగే కైలాష్ కేర్, మాలినీ అవస్థీ, పాలక్ ముచ్చల్ వంటి గాయకులు తమ ప్రదర్శనతో ఆకట్టుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ లైవ్‌స్ట్రీమ్ ప్రసారం కానుంది.



స్వచ్ఛమైన ప్రేమకథ

రాజేశ్ కొంచాడా, శ్రావణి శెట్టి జంటగా స్వామి పట్నాయక్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కౌసల్య తనయ రాఘవ'. అడపా రత్నాకర్ నిర్మాత. ఈనెల 11న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో రాజేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. అందరూ చూసి ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ 'నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు' అని చెప్పారు. నిర్మాత రత్నాకర్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని స్వామి పట్నాయక్ అద్భుతంగా తెరకెక్కించారు' అని ప్రశంసించారు.

మహాకాళి చిత్రంలో అక్షయ్ ఖన్నా



'హను-మాన్' చిత్రం ఘన విజయం తర్వాత ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న చిత్రం 'మహాకాళి'. ఆర్‌కేడీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో పౌరాణిక ఇతివృత్తంతో సూపర్‌హీరో జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా చిత్రబృందం ఆసక్తికర అప్డేట్‌ను పంచుకుంది. 'ఛావా' చిత్రంలో ఔరంగజేబ్‌గా పాత్రోచిత నటనతో ఆకట్టుకున్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్‌ఖన్నా. ఇప్పుడు ఆయన 'మహాకాళి' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ శనివారం ప్రకటించారు.



విత్తనాల పండుగలో మాట్లాడుతున్న మోహన్ గురుస్వామి

భూతాపం పెరిగే కొద్దీ ఆహార ఉత్పత్తి తగ్గుతోంది

» విత్తనాభివృద్ధికి సర్కార్ చర్యలు తీసుకోవాలి

» విత్తనాల పండుగలో మోహన్ గురుస్వామి

కడ్తాల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భూతాపం కారణంగా ఆహార ఉత్పత్తి తగ్గడంతో పాటు జీవ వైవిధ్యంలో మార్పులు, విపత్తులకు దారి తీసే అవకాశముందని ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు మోహన్ గురుస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగినట్లయితే 15 నుంచి 20% మేర ఆహార ఉత్పత్తి తగ్గుతుందన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ (సీజీఆర్), భారత్ బీజ్ స్వరాజ్‌మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ తొలి విత్తనాల పండుగలో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. గడిచిన ఐదు దశాబ్దాల్లో వ్యవసాయంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. గతంలో ఉన్న 1.20 లక్షల వరి వంగడాల స్థానంలో కేవలం 3 వేల రకాల విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విత్తనాభివృద్ధి కోసం సరైన కృషి జరగడం లేదని, విత్తన పరిశోధనకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళా కూలీ మెడలో నుంచి 2 తులాల బంగారం అపహరణ

» పని కోసమంటూ బైక్ మీద తీసుకెళ్లి ఓ వ్యక్తి దుశ్చర్య

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అడ్డా మీది మహిళా కూలీలను పనికి తీసుకువెళ్తూ వారి మెడలో బంగారం గొలుసును ఎత్తుకుపోయిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం జరిగింది. కూలీ పని కోసమని తొర్రూరుకు చెందిన మూగ మహిళ గూబ కొమురమ్మ, చింతలపల్లి గ్రామశివారు కొమ్మనపల్లికి చెందిన భూక్యా సునీత శనివారం అన్నారం రోడ్డులో అడ్డా వద్ద నిలబడ్డారు. ఓ వ్యక్తి వచ్చి ఇద్దరు మహిళా కూలీలు కావాలని చెప్పి వారిని బైక్‌పై ఎక్కించుకొని పోయాడు. కొద్ది దూరం వెళ్లిన తరువాత బైక్ ఆపి, తాగడానికి నీళ్లు తీసుకొస్తానని చెప్పి వారిని దింపేశాడు. కొద్దిసేపటి తర్వాత మరో వ్యక్తితో కలిసి వచ్చి కొమురమ్మ మెడలో ఉన్న 2తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉక్కపోస్తోందని తలుపు తీసి బయట పడుకుంటే ఇంట్లోని బంగారం చోరీ

పెనుబల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఉక్కపోస్తోందని తలుపు తీసి బయట పడుకుంటే ఆ ఇంట్లో దొంగలు పడి 13కాసుల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గుట్టపాడు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటి తలుపులు తీసిపెట్టి నిద్రపోయారు. దీంతో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న చంద్రహారం, నాంతాడు, మూడు ఉంగరాలు, చెవిదిద్దులు ఎత్తుకెళ్లారు. బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి ఆత్మహత్య

» అనారోగ్య సమస్యలతో తీవ్ర మనోవేదనకు లోనై ఆఫీసులోని 8వ అంతస్తు నుంచి దూకి బలవన్మరణం

కవాడిగూడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనోవేదనతో ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్‌లోని తమ కార్యాలయం సీజీవో టవర్స్ 8వ అంతస్తు నుంచి దూకి చనిపోయారు. శనివారం గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటున్న జయలక్ష్మి(52), రమేశ్ భార్యాభర్తలు. వీరికి భావన అనే కూతురు ఉంది. జయలక్ష్మి కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్‌తో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం కార్యాలయానికి సెలవు అయినప్పటికీ ఆమె ఆఫీసుకు వచ్చారు. ఉదయం 11-12 గంటల సమయంలో సీజీవో టవర్స్ 8వ అంతస్తుకు వెళ్లి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. జయలక్ష్మి కూతురు భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎల్పీజీ కంపెనీల కొత్త 'బదిలీ విధానం'పై స్టే

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ కంపెనీలైన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్లు ఫిబ్రవరి 21న జారీ చేసిన 'వినియోగదారుల బదిలీ-మార్కెట్ పునర్వ్యవస్థీకరణ పాలసీ'పై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. 40 లక్షల జనాభా కంటే ఎక్కువ ఉన్న నగరాల్లో గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్‌ను గరిష్ఠ పరిమితి 20 వేలు, కనిష్ఠ పరిమితి 10 వేలుగా నూతన విధానంలో నిర్దేశించారని, ఇది తమకు ఆమోదయోగ్యం కాదంటూ గౌలిపురాకు చెందిన శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ సహా 33 గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ నూతన పాలసీ వల్ల డిస్ట్రిబ్యూటర్లు వినియోగదారులను కోల్పోవాల్సి వస్తుందని, భారీగా పెట్టుబడులు పెట్టిన వారికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఇదే అంశంపై బాంబే హైకోర్టు ఇప్పటికే స్టే ఇచ్చినందున ప్రస్తుత పిటిషన్‌పై సైతం మధ్యంతర స్టే ఇస్తున్నట్లు ప్రకటించింది. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ఉమ్మడి పంపిణీ ఒప్పందం తయారు చేయాలని సూచిస్తూ విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

సీఎండీఎఫ్ నేత ఫాస్టర్ అజయ్‌బాబు అరెస్ట్

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం దళిత్ డిఫెన్స్‌ఫోర్స్ (సీఎండీఎఫ్) నేత ఫాస్టర్ అజయ్‌బాబును ఖమ్మంలోని ఆయన నివాసం వద్ద శనివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కేసు దర్యాప్తు విషయమై హైదరాబాద్‌లోని రాష్ట్ర కేంద్ర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం.. స్థానిక ఖమ్మం పోలీసుల సహకారంతో జయనగర్ కాలనీలోని ఆయన నివాసం వద్దే అజయ్‌బాబును అరెస్ట్ చేసి వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇటీవల ఏపీలో అనుమానాస్పద స్థితిలో ఫాస్టర్ ప్రవీణ్ మృతి విషయమై ఇది హత్య అంటూ చురుగ్గా స్పందించిన ఫాస్టర్ అజయ్‌కుమార్.. సోషల్ మీడియాలోనూ పోస్టులు పెట్టాడు.

పూర్వ స్థానాలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు

» బదిలీల ఫైలుపై సీఎం సంతకం!

» అసెంబ్లీ ఎన్నికలకు ముందు వీరి బదిలీలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీవోలను తిరిగి పూర్వ స్థానాలకు పంపే ఫైలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2023 ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా సొంత జిల్లాల్లో, ఒకే జిల్లాలో 3 ఏళ్ల సర్వీసు పూర్తయిన తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అయితే ఎన్నికల తర్వాత తిరిగి పూర్వ స్థానాలకు బదిలీ చేసేవారు. ఈసారి మాత్రం 20 నెలలైనా బదిలీలు జరగకపోవడంతో తహసీల్దార్లు మానసిక వేదనకు గురవుతున్నారు. ఇదే సమస్యతో కామారెడ్డి జిల్లాలో ఓ తహసీల్దారు మరణించారు. దీంతో బదిలీల అంశంపై పలు దఫాలుగా రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, టీజీవో సంఘం అధ్యక్షుడు ఏలూరి. శ్రీనివాసరావులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సంబంధిత ఫైలుపై సంతకం చేసినట్టు సమాచారం. ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన 26మంది డిప్యూటీ తహసీల్దార్లు కూడా పూర్వ జిల్లాలకు బదిలీకానున్నారు.

పోస్టల్ ఖాతాలో నెలకు రూ.2500 వేస్తారట..!

» కేంద్ర ప్రభుత్వ పథకమంటూ ప్రచారం

» ఆబిడ్స్ పోస్టాఫీసుకు పోటెత్తుతున్న మహిళలు

» 12 రోజుల్లో 2500 ఐపీపీబీ ఖాతాలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సమృద్ధి యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిరుపేద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున పోస్టాఫీసు ఖాతాలో జమ చేస్తుంది. ఇందుకోసం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతా ఉంటే చాలట..!! ఎలా మొదలైందో ? ఎక్కడ మొదలైందో ? తెలియదు కానీ.. ఈ ప్రచారం హైదరాబాద్ గల్లీల్లో కొద్ది రోజులుగా జోరుగా జరుగుతోంది. ఈ ప్రచారాన్ని నమ్మిన హైదరాబాద్ మహిళలు.. ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతా తెరిచేందుకు ఆబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసు(జీపీవో)కు కొద్దిరోజులుగా పోటెత్తుతున్నారు. ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు వచ్చే వారి కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా, మార్చి 24 నుంచి శనివారం దాకా 12 రోజుల వ్యవధిలో 2500 మంది మహిళలు ఐపీపీబీ ఖాతాలు తెరిచారు. ఇది వరకు రోజుకు ఐదు లేదా ఆరు ఐపీపీబీ ఖాతాలు మాత్రమే తెరిచేవారమని, ఇప్పుడు ఆ సంఖ్య రోజుకు 200 దాటుతుందని పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు. అయితే, మహిళలకు నెలకు రూ.2,500 పథకంపై సంబంధిత అధికారులు ఎవరైనా స్పష్టమైన ప్రకటన చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


అబిడ్స్ పోస్టాఫీసులో మహిళల రద్దీ

చిన్న కాళేశ్వరం.. పెద్ద అడుగు!

కాళేశ్వర ముక్తేశ్వర ఎత్తిపోతల పథకంలో కదలిక.. ప్రాజెక్టు కోసం తన వాటా నిధులిచ్చేందుకు కేంద్రం ఓకే

» భూసేకరణ కోసం ముమ్మరంగా గ్రామసభల నిర్వహణ

» కాల్వ నిర్మాణం జరిగితే 45వేల ఎకరాలకు సాగునీరు

భూపాలపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిపై ప్రతిపాదించిన చిన్న కాళేశ్వరం పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. పదిహేనేళ్ల క్రితం భూపాలపల్లి జిల్లాలో అప్పటి వైఎస్ సర్కార్ శంకుస్థాపన చేసిన కాళేశ్వర ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం (కేఎల్ఐఎస్-చిన్న కాళేశ్వరం) ప్రాజెక్టు నిర్మాణం పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. తాజాగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం తన వాటాగా నిధులను ఇవ్వడానికి అంగీకరించడంతో రాష్ట్రప్రభుత్వం చిన్న ప్రాజెక్టు పనులను పూర్తి చేయించి, ఆయకట్టు రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. నిన్న మొన్నటి దాకా భూసేకరణ అడ్డంకిగా మారగా మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు ఆ సమస్య పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. ఫలితంగా ప్రాజెక్టు పరిధిలోని కాటారం, మల్హర్ మండలాల పరిధిలో భూసేకరణ కోసం ముమ్మరంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రిజర్వాయర్ పనులు, పంప్‌హౌస్ మోటార్ల బిగింపు ప్రక్రియ పూర్తయింది. ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ సబ్ డిస్ట్రిబ్యూటరీల తవ్వకాలకు అవసరమైన భూసేకరణ పూర్తయితే రైతాంగానికి సాగునీరు అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల మధ్యలో ఉన్న కాటారం, మల్హర్, మహాదేవపూర్, మహాముత్తారం మండలాలకు చెందిన 63గ్రామాల రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోని 45,232 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. ఇందుకుగాను 14చెరువులను పునరుద్ధరించి రిజర్వాయర్లుగా మార్చాలని సంకల్పించారు. వీటికి అదనంగా మరో మూడు చెరువులనూ కలపాలని మంత్రి అధికారులకు సూచించడంతో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు రివైజ్ చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. కాగా, ఇప్పటికే గారెపల్లి సమీపంలో నూతన రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. మహాదేవపూర్ మండలంలోని ఎర్రచెరువు, మందిరం చెరువు, కాటారం మండలంలోని కొత్తపల్లి, కొత్తపల్లి తండా, గారెపల్లి చింతల చెరువు, ఆదివారంపేట, ధన్వాడ, గుమ్మళ్లపల్లి, గూడూర్ ఊర చెరువులు, వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్ట్, మల్హర్ మండలంలోని రుద్రారం, మహాముత్తారం మండలంలోని పోలారం, ఎల్లాపూర్ చెరువులను రిజర్వాయర్లుగా మార్చడానికి ప్రతిపాదించి పనులను చేపట్టారు. గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా రెండు దశల్లో సరఫరా చేయడానికి పథకం రూపకల్పన చేయగా, మొత్తం 4.5 టీఎంసీల నీటిని పంప్‌హౌజ్‌ల ద్వారా చెరువుల్లోకి మళ్లించి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు కాళేశ్వరం సమీపంలోని బీరసాగర్ వద్ద స్టేజ్-1 పంప్‌హౌజ్, కాటారం సమీపంలో స్టేజ్-2 పంప్‌హౌజ్ నిర్మాణాలు జరిగాయి. ఇందులో మొత్తం 27 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను కూడా బిగించారు.


బీరాపూర్ వద్ద నిర్మించిన ఎత్తిపోతల పంప్‌హౌజ్

భూసేకరణకు యత్నాలు

చిన్నకాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం సుమారు 3,500 ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాలని ప్రతిపాదించారు. చెరువులను రిజర్వాయర్‌గా మార్చేందుకు, పైప్‌లైన్లు, కాల్వల నిర్మాణంకోసం భూమిని సేకరిస్తున్నారు. ఇందులో 640 ఎకరాలు అటవీ భూమి కాగా మిగతా 2,900 ఎకరాల్లో పట్టా భూములు, అసైన్డ్ భూములున్నాయి. అటవీ భూమిని సేకరించి పైప్‌లైన్లు వేసే కార్యక్రమం చేపట్టగా పనులు కొంతమేర మిగిలిపోయాయి. మిగతా 2,900 ఎకరాల్లో సుమారు 890 ఎకరాలను ఇప్పటి వరకు సేకరించినట్లు అధికారులు తెలిపారు. మిగతా 2వేల ఎకరాల్లో 340 ఎకరాల భూసేకరణకు రైతులను ఒప్పించేందుకు అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

కేంద్ర పెట్టుబడి సాయం రూ.18 వేలకు పెంచాలి

» తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

» 9న కలెక్టరేట్ల ముట్టడికి పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6 వేల నుంచి 18 వేలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రుణమాఫీ చట్టం, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదాను ప్రకటించాలని కోరింది. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెట్లను తొలగించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హేమంతరావు, పశ్య పద్మ కోరారు. రైతుల డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 9న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని, ఈ కార్యక్రమంలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

డ్రైవర్ కడుపులో 2 ఇంచుల సూది

» తొలగించిన కింగ్‌కోఠి వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెండు ఇంచులకుపైగా ఉన్న దుస్తులు కుట్టే సూది ఓ డ్రైవర్‌లో కడుపులో కనిపించింది. కింగ్‌కోఠి ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఆ డ్రైవర్‌కు శస్త్రచికిత్స చేసి సూదిని బయటకు తీశారు. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన మురళి(45) హైదరాబాద్‌లోని నల్లకుంటలో ఉంటూ ట్రాన్స్‌పోర్టు వాహనం నడుపుతున్నాడు. కొంతకాలం నుంచి విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. పరీక్షించిన కింగ్‌కోఠి ప్రభుత్వాస్పత్రి వైద్యులు కడుపులో పెద్దసూది ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో మురళికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ ఆధ్వర్యంలో జనరల్ సర్జన్ డాక్టర్ బాలరాజు, డాక్టర్ వెంకటేష్ ఆపరేషన్ చేసి సూదిని తొలగించారు. సూది దాదాపు 2 ఇంచులకు పైగా ఉందని డాక్టర్ బాలరాజు తెలిపారు. ప్రస్తుతం అతడు ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు చెప్పారు. కాగా ఆ సూది తన కడుపులోకి ఎలా వచ్చిందో వైద్యులకు చెప్పడానికి మురళి నిరాకరించాడు.

క్రికెట్ బెట్టింగ్‌కు మరో యువకుడి బలి

» డబ్బు పోగొట్టుకొని రైలు కింద పడి ఆత్మహత్య

» సికింద్రాబాద్ సనత్‌నగర్ సమీపంలో ఘటన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ సనత్‌నగర్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ సుచిత్ర ప్రాంతానికి చెందిన రజ్వీర్‌సింగ్ (25) ప్రైవేట్ ఉద్యోగి. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో సుచిత్ర వద్ద ఉంటున్న బాబాయి ఇంట్లో ఉంటున్నాడు. కొంత కాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ తన వద్ద ఉన్న డబ్బు మొత్తం పోగొట్టుకొని తాగుడికి బానిసయ్యాడు. తెలిసిన వ్యక్తుల వద్ద డబ్బు తీసుకుని అది కూడా బెట్టింగ్ వేసి పోగొట్టుకున్నాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన రజ్వీర్‌సింగ్ సనత్‌నగర్, అమ్ముగూడ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో రైల్‌పై బెట్టింగ్ యాప్‌ల ప్రచారం ఆపండి

» ఆర్థిక లావాదేవీలపై ఈడీ విచారణకు ఆదేశించండి

» హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లు, స్టేషన్లు, ప్రభుత్వ ఆస్తులపై అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫాంలు, యాప్‌ల ప్రదర్శన, ప్రచారం నిలిపేసేలా ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. స్థానిక కేపీహెచ్‌బీకి చెందిన న్యాయవాది నాగుర్‌బాబు ఈ పిటిషన్ దాఖలు చేశారు. విదేశీ బెట్టింగ్ ప్లాట్‌ఫాంలు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు ఆదేశించాలని పిటిషనర్ కోరారు. బెట్టింగ్ వేదికలు, యాప్‌ల ప్రచారానికి హెచ్ఎంఆర్ఎల్‌కు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? వారి మధ్య ఆర్థిక లావాదేవీలపై స్థాయీ నివేదిక సమర్పించేలా కూడా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంఆర్ఎల్ ప్రకటన విధానాలపై సమీక్షకు రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినందుకు హెచ్ఎంఆర్ఎల్, బాధ్యులైన అధికారులపై భారీ మొత్తంలో జరిమానా విధించి, బెట్టింగ్ యాప్‌ల బాధితుల సహాయ నిధికి కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులు, మౌలికసదుపాయాలపై అక్రమ బెట్టింగ్ యాప్‌ల ప్రచారం జరగకుండా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట విచారణకు రానున్నది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 50శాతానికి పైగా మహిళలకే

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.. కలెక్టర్లకు ఆదేశాలు.. యాసంగిలో మొత్తం 8,218 కేంద్రాల ఏర్పాటు

» మహిళలే ధాన్యం కొని, నిల్వ చేసి, మరాడించి ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి బియ్యం అమ్మేలా చర్యలు

హైదరాబాద్, పెద్దపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 50శాతానికి పైగా మహిళలకు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించింది. రాబోయే రోజుల్లో క్రమంగా ఈ శాతాన్ని పెంచాలని సూచించింది. ప్రతి మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్‌మిల్లులు, గోదాములను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఇప్పటికే మహిళా సంఘాలు ఐకేపీ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచితే, వారే ధాన్యాన్ని కొని, నిల్వ చేసి, మరాడించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయవచ్చని, తద్వారా మహిళా సాధికారతను సాధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరించే ప్రక్రియలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), స్వయం సహాయక సంఘాలు (ఐకేపీ) క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఈ యాసంగిలో ధాన్యం సేకరణకు 8,218 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 4,455 పీఏసీఎస్‌ల పరిధిలో ఉన్నాయి. 3,084 కేంద్రాలు ఐకేపీ(ఇందిరా క్రాంతి పథకం) మహిళా సంఘాల చేతిలో ఉన్నాయి. మరో 679 సెంటర్లు మెప్మా, ఎఫ్‌పీవోల పరిధిలో నిర్వహించనున్నారు. అయితే, నిజామాబాద్, పెద్దపల్లి లాంటి కొన్ని జిల్లాల్లో మహిళలు నిర్వహించే కొనుగోలు కేంద్రాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో, ఆయా జిల్లాల కలెక్టర్లు కనీసం 50% కొనుగోలు కేంద్రాలు మహిళల ఆధ్వర్యంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యాసంగిలో 4వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

మహిళా సంఘాలు బలోపేతం

ధాన్యం సేకరణలో పాల్గొన్న సహకార సంఘాలు, మహిళా సంఘాలకు ప్రభుత్వం 2% కమీషన్ ఇస్తోంది. వానాకాలంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రూ.11 వేల కోట్ల విలువైన ధాన్యం సేకరణ జరిగింది. పీఏసీఎస్‌లు, ఐకేపీ, మెప్మా సెంటర్లకు ప్రభుత్వం రూ.220 కోట్ల కమీషన్ చెల్లించింది. పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సింహభాగం కమీషన్ వాటికే వెళ్లింది. కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని పెంచితే వారికి కమీషన్ రూపంలో కూడా లబ్ధి చేకూరి మహిళా సంఘాలు బలోపేతం అవుతాయి.

పీఏసీఎస్‌లలో అక్రమాలు


ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పలుచోట్ల సొసైటీ కార్యదర్శులు, సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. ధాన్యం కొనుగోలులో పాలకవర్గాల జోక్యం కూడా మితిమీరుతోంది. రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై, తరుగు, తాలు, తేమ పేరుతో రైతులను మోసం చేస్తున్న ఘటనలు చాలా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోలులో పీఏసీఎస్‌ల పాత్రను తగ్గించి మహిళా స్వయం సహాయక సంఘాలకు కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి.

బత్తాయి పడిపోయి..

నల్లగొండ జిల్లాలో క్షీణించిన పండ్ల సాగు

» 3.1 లక్షల ఎకరాల నుంచి 45వేల ఎకరాలకు తగ్గుదల

నల్లగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2010 వరకు ప్రధాన పంటగా ఉన్న బత్తాయి పండ్ల తోటల సాగు క్రమంగా క్షీణిస్తోంది. స్థానికంగా మార్కెట్ సదుపాయం లేకపోవడం, మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోవడం, బత్తాయి ప్రాసెసింగ్ చేసి ఉత్పత్తులు విక్రయించే టెక్నాలజీ లేకపోవడం వంటి కారణాలతో బత్తాయి సాగు బాగా తగ్గిపోయింది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు వచ్చే అవకాశం ఉన్న పంట అయినప్పటికీ దీనిని కాపాడుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చొరవ తీసుకోకపోవడంతో రైతులు ఈ పంటను వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 2010 ప్రాంతంలో అత్యధికంగా 3.1 లక్షల ఎకరాల్లో బత్తాయి సాగైతే, ప్రస్తుతం అది 45వేల ఎకరాలకు పరిమితమవడం బత్తాయి సాగు క్షీణతను సూచిస్తోంది. కేంద్రం 2020లో ప్రవేశపెట్టిన వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ కింద కూడా నల్లగొండ జిల్లాలో బత్తాయి ఉత్పత్తులను గుర్తించినా, ఆ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన టెక్నాలజీ లేకపోవడంతో ఈ పథకాన్ని ఎవరూ వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలోనే బత్తాయి సాగుకు నల్లగొండ జిల్లా పెట్టింది పేరు. 2010లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3.10లక్షల ఎకరాల్లో బత్తాయి పంటలు సాగయ్యాయి. ఏపీ, మహారాష్ట్రలో బత్తాయి సాగు పెరగడం.. మన రాష్ట్రంలో బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్ఠంగా పది రోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండటం, జ్యూస్ రూపంలోకి మార్చాక కనీసం రెండు, మూడు రోజుల పాటు కూడా చేదు రాకుండా ఉండని పరిస్థితి బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. గత అయిదారేళ్లుగా కొత్తగా రైతులెవరూ బత్తాయి సాగు చేపట్టడం లేదు. దీంతో వచ్చే 15 ఏళ్లలో బత్తాయి సాగు కనుమరుగయ్యే పరిస్థితి జిల్లాలో నెలకొంది.


తోటలో కోసిన బత్తాయి పంట

ప్రాసెసింగ్‌కు పరిశోధనలు చేయడం లేదు: కేంద్రం

బత్తాయి జ్యూస్ తయారుచేసిన తర్వాత అది ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు అవసరమైన పరిశోధనలకు, బత్తాయి పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవసరమైన సాంకేతికత వృద్ధికి ప్రభుత్వాల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. బత్తాయి ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు, జ్యూస్ నిల్వలకు అవసరమైన సాంకేతిక సహకారానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టత ఇవ్వాలని తాజాగా లోక్‌సభలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

కౌర్‌కు స్వర్ణం.. ఇషాకు రజతం

షూటింగ్ ప్రపంచ కప్


స్విఫ్ట్ కౌర్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): భారత యువ షూటర్ స్విఫ్ట్ కౌర్, తెలంగాణ స్టార్ ఇషా సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో పతకాలతో సత్తా చాటారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో స్విఫ్ట్ కౌర్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో కౌర్ ఫస్ట్ నీలింగ్ పొజిషన్‌లో అనిటా మ్యాన్‌గోల్డ్ (జర్మనీ) కంటే 7.2 పాయింట్లు వెనుకంజలో నిలిచినా.. ఆఖర్లో అదిరే ప్రదర్శన చేసింది. కౌర్ మొత్తం 458.6 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మ్యాన్‌గోల్డ్ రజతం, అరీనా అల్టుకొవా (కజకిస్థాన్) కాంస్యం దక్కించుకొన్నారు. ఇక, మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా రజతం సాధించింది. ఫైనల్స్‌లో ఇషా 35 పాయింట్లతో రెండోస్థానంలో నిలవగా.. చైనా షూటర్లు యూజీ సన్ (38), సిజువాన్ ఫెంగ్ (30) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలను అందుకున్నారు.


ఇషా సింగ్

ఫైనల్లో జమ్వాల్

బాక్సింగ్ వరల్డ్ కప్



న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న బాక్సింగ్ వరల్డ్‌కప్‌లో భారత యువ బాక్సర్ అభినాష్ జమ్వాల్ ఫైనల్‌కు చేరుకొని కనీసం రజతం ఖాయం చేశాడు. పురుషుల 65 కిలోల సెమీస్‌లో జమ్వాల్ 5-0తో గియాన్‌లుగి మలంగ (ఇటలీ)ను మట్టికరిపించాడు. ఫైనల్లో యూరీ రీస్ (బ్రెజిల్)తో అభినాష్ తలపడనున్నాడు. కాగా, 55 కిలోల సెమీస్‌లో మనీష్ రాథోడ్ 0-5తో నూర్‌సుల్తాన్ అంటెన్‌బెక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు.

హ్యాట్రిక్

రాణించిన రాహుల్

25 పరుగులతో సూపర్‌కింగ్స్ చిత్తు

విజయాల్లో ఢిల్లీ.. ఓటముల్లో చెన్నై

చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగిస్తూ ఈ ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయం అందుకుంది. మరోవైపు చెన్నై సూపర్‌కింగ్స్ ఓటములలో హ్యాట్రిక్ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో క్యాపిటల్స్ 25 పరుగులతో చెన్నైని ఓడించింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 183/6 స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ (51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 77) సొగసైన హాఫ్ సెంచరీ చేశాడు. అభిషేక్ పోరెల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 33) సత్తా చాటాడు. స్టబ్స్ (24), కెప్టెన్ అక్షర్ పటేల్ (21) పర్వాలేదనిపించారు. ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 158/5కే పరిమితమైంది. విజయ్ శంకర్ (54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 69 నాటౌట్), ధోనీ (26 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్సర్‌తో 30 నాటౌట్) మాత్రమే రాణించారు. విప్రాజ్ 2 వికెట్లు తీశాడు. కేఎల్ రాహుల్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

మారని సీఎస్‌కే బ్యాటింగ్: మరోసారి చెన్నై బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ రచిన్ (3)తోపాటు జట్టులోకి వచ్చిన కాన్వే (13), కెప్టెన్ రుతురాజ్ (5) విఫలం కావడంతో పవర్ ప్లేలో 46/3తో నిలిచిన సీఎస్‌కే ఆపై ఏ దశలోనూ పోటీలోకి రాలేకపోయింది. శివమ్ దూబే (18), జడేజా (2) నిరాశపరిచారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన ధోనీ, విజయ్ శంకర్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 84 పరుగులు చేయడం ఓటమిలో చెన్నై జట్టుకు ఒకింత ఊరట.

కేఎల్ క్లాస్ ఇన్నింగ్స్: టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా..కేఎల్ రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రెండు అర్ధ శతక భాగస్వామ్యాలతో జట్టు ఇన్నింగ్స్‌కు వెన్నుముకలా నిలిచాడు. అభిషేక్ పోరెల్‌తో కలిసి రెండో వికెట్‌కు 54 పరుగులు, సమీర్ రిజ్వీ (20)తో కలిసి నాలుగో వికెట్‌కు 56 రన్స్ జోడించాడు.


కేఎల్ రాహుల్ (77)

15
2010 తర్వాత..అంటే 15 ఏళ్ల అనంతరం తొలిసారి చెన్నై వేదికగా సూపర్ కింగ్స్‌పై ఢిల్లీ గెలిచింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ మెక్‌గర్క్ (సి) అశ్విన్ (బి) ఖలీల్ 0, కేఎల్ రాహుల్ (సి) ధోనీ (బి) పథిరన 77, అభిషేక్ పోరెల్ (సి) పథిరన (బి) జడేజా 33, అక్షర్ (బి) నూర్ అహ్మద్ 21, రిజ్వీ (సి) జడేజా (బి) ఖలీల్ 20, స్టబ్స్ (నాటౌట్) 24, అశుతోష్ (రనౌట్) 1, విప్రాజ్ నిగమ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 183/6; వికెట్ల పతనం:** 1-0, 2-54, 3-90, 4-146, 5-179, 6-180; **బౌలింగ్:** ఖలీల్ 4-0-25-2, ముకేశ్ చౌదరి 4-0-50-0, అశ్విన్ 3-0-21-0, జడేజా 2-0-19-1, నూర్ అహ్మద్ 3-0-36-1, పథిరన 4-0-31-1.

చెన్నై: రచిన్ (సి అండ్ బి) ముకేశ్ కుమార్ 3, కాన్వే (సి) అక్షర్ (బి) విప్రాజ్ 13, రుతురాజ్ (సి) ఫ్రేజర్ (బి) స్టార్క్ 5, విజయ్ శంకర్ (నాటౌట్) 69, శివమ్ దూబే (సి) స్టబ్స్ (బి) విప్రాజ్ 18, జడేజా (ఎల్బీ) కుల్దీప్ 2, ధోనీ (నాటౌట్) 30, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 158/5; వికెట్ల పతనం:** 1-14, 2-20, 3-41, 4-65, 5-74; **బౌలింగ్:** స్టార్క్ 4-0-27-1, ముకేశ్ కుమార్ 4-0-36-1, మోహిత్ 3-0-27-0, విప్రాజ్ నిగమ్ 4-0-27-2, కుల్దీప్ 4-0-30-1, అక్షర్ 1-0-5-0.


మహీ.. మెరుపు వేగంతో..
అశుతోష్‌ను రనౌట్ చేస్తున్న ధోనీ

43 ఏళ్ల ధోనీ వికెట్ల వెనుక ఎంత చురుగ్గా ఉంటాడో ఈ ఐపీఎల్‌లో కళ్లు మూసి తెరిచేలోపు రెండు స్టంపింగ్‌లు చేయడం ద్వారా చూశాం. అలాగే ఢిల్లీతో మ్యాచ్‌లో అశుతోష్ శర్మ (1)ను అంతే వేగంగా రనౌట్ చేశాడు. పథిరన వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్ మూడో బంతిని ఢిల్లీ బ్యాటర్ అశుతోష్ డీప్ స్క్వేర్ లెగ్ దిశగా కొట్టి మొదటి పరుగు తీశాడు. అతను రెండో పరుగుకోసం వస్తుండగా బంతిని ఫీల్డ్ చేసిన జడేజా వికెట్ కీపర్ వైపు విసిరాడు. అప్పటికి వికెట్లకు దూరంగా ఉన్న ధోనీ మెరుపు వేగంతో కదిలాడు. జడేజా విసిరిన బంతిని అందుకొని క్షణాల్లో వికెట్లను గిరాటేశాడు. దాంతో అశుతోష్ రనౌట్‌గా వెనుదిరిగాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	4	1	3	0	2	0.108
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	4	1	3	0	2	-1.612

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

గెలుపే లక్ష్యంగా..

నేడు టైటాన్స్‌తో హైదరాబాద్ పోరు

హైదరాబాద్: హ్యాట్రిక్ ఓటములతో డీలా పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదివారం సొంత మైదానంలో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అటు వరుసగా రెండు విజయాలతో జోరు మీదున్న గుజరాత్ టైటాన్స్ జట్టు కమిన్స్ సేనకు సవాల్ విసరనుంది. బలంగా భావించిన బ్యాటింగ్ ఆర్డర్ వైఫల్యంతోనే రైజర్స్ తన మ్యాచ్‌లను ఓడుతూ వస్తోంది. ఆరంభ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన వీరంతా ఆ తర్వాత ప్రత్యర్థి జట్ల బౌలర్లకు దాసోహమయ్యారు. దీంతో జట్టు వరుసగా 190, 163, 120 స్కోర్లకే పరిమితమై, పట్టికలోనూ అట్టడుగున కొనసాగుతోంది. జట్టులో క్లాసెన్ మాత్రమే నిలకడగా రాణిస్తున్నాడు. 300 స్కోరు కోసం కాకుండా హెడ్, అభిషేక్, ఇషాన్, నితీశ్ జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడాలి. అటు బౌలింగ్‌లోనూ యువ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఒక్కడే ఆశాకిరణంలా మారాడు. పేసర్లు కమిన్స్, షమి సహా మిగతా బౌలర్లంతా పరుగులిచ్చుకుంటున్నారు. టైటాన్స్ తొలి మ్యాచ్‌లో ఓడినా ఆ తర్వాత రెండు విజయాలతో నిలిచింది. ఓపెనర్ సాయిసుదర్శన్, గిల్, బట్లర్, రూథర్‌ఫోర్డ్, మిల్లర్, తెవాటియాలతో బ్యాటింగ్ పటిష్ఠంగా ఉంది. పేసర్ రబాడ స్వదేశానికి వెళ్లడంతో అతడిస్థానంలో ఫిలిప్స్, కొట్జీలలో ఒకరిని ఆడించే చాన్సుంది.


ప్రాక్టీస్‌లో సిరాజ్, ఇషాన్

ఐపీఎల్‌లో నేడు వేదిక హైదరాబాద్
సన్‌రైజర్స్ x గుజరాత్ రా.7.30

పంజాబ్‌కు ఝలక్

- రాజస్థాన్ ఘన విజయం
- జైస్వాల్ హాఫ్ సెంచరీ
- కట్టడి చేసిన బౌలర్లు

చండీగఢ్: ఐపీఎల్‌లో జోరు మీదున్న పంజాబ్ కింగ్స్‌కు గట్టి షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (45 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 67) సీజన్‌లో తొలిసారి మెరవగా.. పేసర్ ఆర్చర్ (3/25) పదునైన బౌలింగ్‌తో దెబ్బతీశాడు. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రాజస్థాన్‌కిది రెండో గెలుపు కాగా.. పంజాబ్‌కు మూడు మ్యాచ్‌ల్లో తొలి ఓటమి. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 43 నాటౌట్), సంజూ శాంసన్ (26 బంతుల్లో 6 ఫోర్లతో 38) రాణించారు. ఫెర్గూసన్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 రన్స్ చేసి ఓడింది. నేహల్ వధేరా (41 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 62), మ్యాక్స్‌వెల్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 30) ఆకట్టుకున్నారు. సందీప్, తీక్షణలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆర్చర్ నిలిచాడు.

తొలి ఓవర్‌లోనే షాక్: భారీ ఛేదనలో పంజాబ్ బ్యాటర్ నేహల్ వధేరా మాత్రమే పోరాడాడు. మ్యాక్స్‌వెల్ కాస్త సహకరించినా మిగతా వారంతా తీవ్రంగా నిరాశపరిచారు. పేసర్ ఆర్చర్ బుల్లెట్ లాంటి బంతులతో తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ప్రియాన్ష్ (0), కెప్టెన్ శ్రేయాస్ (10)లను బౌల్డ్ చేశాడు. కాసేపటికే స్టొయినిస్ (1)ను సందీప్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో పంజాబ్ 26/3 స్కోరుతో కష్టాల్లో పడింది. అటు బంతికో పరుగు చొప్పున సాధించిన మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (17) ఏడో ఓవర్‌లో వెనుదిరగగా.. నేహల్, మ్యాక్స్‌వెల్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. అయితే మధ్య ఓవర్లలో రాయల్స్ బౌలర్లు కట్టడి చేశారు. పదో ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ 6,4, నేహల్ 6తో 19 రన్స్ వచ్చాయి. ఈ జోడీ అడపాదడపా బౌండరీలు సాధించడంతో పంజాబ్ విజయంపై ఆశలు పెట్టుకుంది. 33 బంతుల్లో ఓ సిక్సర్‌తో నేహల్ హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. కానీ వరుస ఓవర్లలో మ్యాక్స్‌వెల్‌ను తీక్షణ.. నేహల్‌ను హసరంగ అవుట్ చేశారు. వీరి మధ్య ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. అప్పటికి చివరి 4 ఓవర్లలో 70 రన్స్ కావాల్సి ఉండడంతో పంజాబ్‌కు పరాజయం తప్పలేదు.

జైస్వాల్ అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ అదరగొట్టింది. అలాగే రియాన్ పరాగ్ డెత్ ఓవర్లలో వేగం కనబర్చడంతో జట్టు స్కోరు 200 దాటింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఈసారి స్థాయికి తగ్గట్టుగా ఆడాడు. మరో ఓపెనర్ శాంసన్ సైతం రాణించడంతో ఆరంభంలో పంజాబ్ బౌలర్లు ఇబ్బందిపడ్డారు. నాలుగో ఓవర్‌లో జైస్వాల్ రెండు సిక్సర్లతో 19 రన్స్ సమకూరాయి. అలాగే ఈ సీజన్‌లో వికెట్ కోల్పోకుండా రాజస్థాన్ పవర్‌ప్లేలో 53 పరుగులతో నిలిచింది. చక్కగా కుదురుకున్న శాంసన్‌ను 11వ ఓవర్‌లో ఫెర్గూసన్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చాహల్ ఓవర్‌లో జైస్వాల్ 4,6తో 40 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ తర్వాత 13వ ఓవర్‌లో జైస్వాల్ 6,4, పరాగ్ 4తో 17 రన్స్ వచ్చాయి. కానీ వరుస ఓవర్లలో రాజస్థాన్.. జైస్వాల్, నితీశ్ రాణా (12) వికెట్లను కోల్పోయింది. ఇక చివరి ఐదు ఓవర్లలో వేగం పెంచిన పరాగ్‌కు హెట్‌మయెర్ (20) జత కలిశాడు. అర్ష్‌దీప్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించిన పరాగ్.. జాన్సెన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో చెలరేగాడు. అయితే అదే ఓవర్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను జాన్సెన్ అందుకోలేకపోయాడు. 19వ ఓవర్‌లో హెట్‌మయెర్ అవుటైనా.. చివరి ఓవర్‌లో పరాగ్ 6. జురెల్ (13 నాటౌట్) 6,4 కారణంగా 19 రన్స్ రావడంతో రాజస్థాన్ భారీ స్కోరందుకుంది.


జైస్వాల్ (67)

1
రాజస్థాన్‌కు ఎక్కువ విజయాలు (32) అందించిన కెప్టెన్‌గా శాంసన్. వార్న్ (31)ను అధిగమించాడు.


ధోనీ కోసం.. ప్రత్యేక అతిథులు

చెన్నై: చెన్నై-ఢిల్లీ మ్యాచ్ ఓ అరుదైన దృశ్యానికి వేదికైంది. ప్రత్యేక అతిథులతో సందడిగా మారింది. ధోనీ తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకీ దేవి ఈ మ్యాచ్‌కు హాజరయ్యారు. 2008 నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ ఆడుతున్నా..తమ కుమారుడి మ్యాచ్‌ను వీక్షించేందుకు పాన్ సింగ్, దేవకీ దేవీ స్టేడియానికి రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ధోనీ భార్య సాక్షి, కూతురు జీవా కూడా మ్యాచ్‌కు హాజరయ్యారు. అయితే ఎన్నడూ మ్యాచ్‌లకు రాని ధోనీ తల్లిదండ్రులు.. ఈసారి స్టేడియంలో దర్శనమివ్వడంతో మహీకిదే చివరి ఐపీఎల్ అన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆఖరిసారి తమ కుమారుడి వికెట్ కీపింగ్, బ్యాటింగ్ నైపుణ్యాలను కళ్లారా వీక్షించేందుకే ధోనీ తల్లిదండ్రులు వచ్చారంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

స్కోరుబోర్డు


ఆర్చర్ (4-0-25-3)

రాజస్థాన్: జైస్వాల్ (బి) ఫెర్గూసన్ 67, శాంసన్ (సి) శ్రేయాస్ (బి) ఫెర్గూసన్ 38, రియాన్ పరాగ్ (నాటౌట్) 43, నితీశ్ రాణా (సి) మ్యాక్స్‌వెల్ (బి) జాన్సెన్ 12, హెట్‌మయెర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ 20, జురెల్ (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 205/4; వికెట్ల పతనం:** 1-89, 2-123, 4-138, 4-185; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-1, జాన్సెన్ 4-0-45-1, ఫెర్గూసన్ 4-0-37-2, మ్యాక్స్‌వెల్ 1-0-6-0, చాహల్ 3-0-32-0, స్టొయినిస్ 4-0-48-0.

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (బి) ఆర్చర్ 0, ప్రభ్‌సిమ్రన్ (సి) హసరంగ (బి) కార్తికేయ 17, శ్రేయాస్ అయ్యర్ (బి) ఆర్చర్ 10, స్టొయినిస్ (సి అండ్ బి) సందీప్ 1, నేహల్ వధేరా (సి) జురెల్ (బి) హసరంగ 62, మ్యాక్స్‌వెల్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, శశాంక్ సింగ్ (నాటౌట్) 10, సుయాన్ష్ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 2, జాన్సెన్ (సి) హెట్‌మయెర్ (బి) తీక్షణ 3, అర్ష్‌దీప్ (సి) హసరంగ (బి) ఆర్చర్ 1, ఫెర్గూసన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 155/9; వికెట్ల పతనం:** 1-0, 2-11, 3-26, 4-43, 5-131, 6-131, 7-136, 8-145, 9-151; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-25-3, యుధ్‌వీర్ 2-0-20-0, సందీప్ శర్మ 4-0-21-2, తీక్షణ 4-0-26-2, కుమార్ కార్తికేయ 2-0-21-1, హసరంగ 4-0-36-1.

పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా

దిగ్వేష్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత



లఖ్‌నవూ: ముంబైతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. లఖ్‌నవూ బౌలర్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన దానికంటే ఓ ఓవర్ వెనుకబడ్డారు. దీంతో ఆఖరి ఓవర్‌లో రింగ్ వెలుపల ఓ ఫీల్డర్‌ను తగ్గించాల్సి వచ్చింది. ఇదే తొలి తప్పిదం కావడంతో సారథి పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించినట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, లఖ్‌నవూ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ రెండోసారి ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించడంతో అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. నమన్ ధిర్ అవుటైన తర్వాత కూడా అతడు మరోసారి నోట్‌బుక్ సెలబ్రేషన్స్ చేసుకొన్నాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఫీజులో సగం కోతతోపాటు రెండు డీమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో చేరాయి.



1996 వరల్డ్‌కప్ విజేతలతో మోదీ

కొలంబో: శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. 1996 వరల్డ్‌కప్ నెగ్గిన శ్రీలంక క్రికెట్ జట్టు సభ్యులను కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆ జట్టు సభ్యులైన కుమార ధర్మసేన, అరవింద డిసిల్వ, సనత్ జయసూర్య, చమింద వాస్, ఉపుల్ చందన, ఆటపట్టు.. మోదీకి జ్ఞాపికను బహూకరించారు. ప్రపంచకప్ ఫైనల్లో అర్జున రణతుంగ కెప్టెన్సీలోని లంక ఏడు వికెట్లతో ఆస్ట్రేలియాను ఓడించింది. '1996 వరల్డ్‌కప్ విజేత లంక జట్టును కలుసుకొన్నందుకు ఆనందంగా ఉంది' అని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు. వాళ్లతో దిగిన ఫొటోలను షేర్ చేశారు.

కివీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ పాక్ చిత్తు

మౌంట్ మాంగనుయ్: పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మైదానంలో చిత్తడి కారణంగా 42 ఓవర్లకు కుదించిన మూడో, ఆఖరి వన్డేలో కివీస్ 43 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత న్యూజిలాండ్ 264/8 స్కోరు చేసింది. బ్రేస్‌వెల్ (59), రైస్ (58) అర్ధ శతకాలు సాధించారు. అకిఫ్ జావెద్ 4 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో పాక్ 40 ఓవర్లలో 221 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజమ్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. బెన్ సీర్స్ 5 వికెట్లతో పాక్ వెన్నువిరిచాడు. టీ20 సిరీస్‌ను కూడా పాక్ 1-4తో కోల్పోయిన సంగతి తెలిసిందే.

TATA CAPITAL

టాటా క్యాపిటల్ రూ.17,000 కోట్ల ఐపీఓ

కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు

టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ.. టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ఈ నెల 4న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ దాదాపు 200 కోట్ల డాలర్లు (సుమారు రూ.17,000 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా టాటా క్యాపిటల్ విలువను 1,100 కోట్ల డాలర్లు (రూ.93,500 కోట్లు)గా లెక్కగట్టినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు కొంత మంది వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో తమ వాటాలను విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో టాటా క్యాపిటల్ వెల్లడించింది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 92.83 శాతం వాటా ఉంది. రెండేళ్ల వ్యవధిలో టాటా గ్రూప్ నుంచి వస్తున్న రెండో ఐపీఓ ఇది. 2023లో టాటా టెక్నాలజీస్ స్టాక్ మార్కెట్లో లిస్టయిన సంగతి తెలిసిందే.

పర్సనల్ లోన్.. తనఖా రుణం ఏది బెటర్!



వ్యక్తిగత రుణానికి తాకట్టు అవసరం లేదు. రుణమూ త్వరగానే లభిస్తుంది. కానీ, వడ్డీయే కాస్త ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తనఖా రుణాలపై వడ్డీ తక్కువ. పెద్ద మొత్తంలో రుణం తీసుకోవచ్చు. కాకపోతే, ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టాల్సిందే. పైగా ప్రహసనంతో కూడిన ప్రక్రియ. మరి ఏది సరైనది..? అంటే, మీ అవసరం, పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత రుణం తీసుకోవాలా..? తనఖా రుణం కోసం ప్రయత్నించాలా..? అనే సందిగ్ధ స్థితిలో ఉన్నవారు సరైన ఎంపిక చేసుకోవడానికి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం..

వ్యక్తిగత రుణాలతో పాటు తనఖా రుణాలకూ కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం కూడా. ఈ రెండింటి ప్రత్యేకతలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే, ఎంపిక సులభమవుతుంది. అలాగే, మీ ఆర్థిక అవసరాన్ని, క్రెడిట్ స్కోర్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

వ్యక్తిగత రుణం

ఇది తనఖారహిత రుణం. అంటే, ఈ రుణం కోసం ఏమీ తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ఈ రుణాలను మీ క్రెడిట్ స్కోర్, హిస్టరీ ఆధారంగా మంజూరు చేస్తారు. ఇందులో రుణదాతకు రిస్క్ ఎక్కువ. అందుకే, అధిక వడ్డీ వసూలు చేస్తారు. తాకట్టు అవసరం అవసరం లేకపోవడం, త్వరితగతిన రుణ మంజూరు, తీసుకున్న సొమ్మును ఏ అవసరానికైనా ఉపయోగించుకోగలిగే వెసులుబాటు ఈ రుణ అనుకూలతలు. మిగతా రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రతికూలమే. మీ ఆదాయం, పరపతి స్థాయి, క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మీకు ఎంత రుణం మంజూరు చేయవచ్చనే అంశాన్ని రుణదాత నిర్ణయిస్తారు. ఆదాయం తక్కువగా ఉంటే మీరు ఆశించినంత రుణం లభించకపోవచ్చు. క్రెడిట్ స్కోర్ అంత బాగా లేని పక్షంలోనూ అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైగా, రుణ మొత్తంలోనూ రాజీ పడాల్సిందే.

తనఖా రుణం

ఇది తాకట్టుపై లభించే రుణం. ఇందుకోసం రుణగ్రహీత తనకు చెందిన ఏ ఆస్తినైనా తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సాధారణంగా ఏదైనా స్థిరాస్తి కొనుగోలుకు లేదా ప్రస్తుత ప్రాపర్టీని తాకట్టు పెట్టి నిధులు సమీకరించేందుకు ఈ రుణాన్ని ఎంచుకుంటారు. దీని సానుకూలత విషయానికొస్తే, ఇందులో రుణదాతకు నష్ట భయం తక్కువ. కాబట్టి వ్యక్తిగత రుణంతో పోలిస్తే కాస్త తక్కువ వడ్డీకే లభిస్తుంది. ఆస్తి విలువ ఆధారంగా రుణమిస్తారు కాబట్టి, అధిక మొత్తంలో సొమ్ము లభించే అవకాశం ఉంటుంది. పైగా, తనఖా రుణాల తిరిగి చెల్లింపులకూ చాలా సంవత్సరాలు సమయం లభిస్తుంది. తద్వారా తక్కువ మొత్తంలో నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో సుదీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ప్రతికూలతల గురించి ప్రస్తావించాలంటే, రుణం కావాలంటే ఏదైనా ఆస్తిని తప్పనిసరిగా తాకట్టు పెట్టాల్సిందే. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో రుణదాత మీ ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రుణ దరఖాస్తు ప్రాసెసింగ్, మంజూరుకూ కొంత సమయం పడుతుంది. ప్రాసెసింగ్ చార్జీలూ అధికమే. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కూడా ప్రహసనంతో కూడిన ప్రక్రియ.

ఎంపిక ఎలా..?

ఉద్దేశం: ప్రాపర్టీ కొనుగోలుకైతే తనఖా రుణం మేలు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి లేదా ఏదైనా ఆర్థిక అత్యయిక పరిస్థితుల నుంచి బయటపడేందుకైతే వ్యక్తిగత రుణం మెరుగైన ప్రత్యామ్నాయం.

సమయం: తక్షణమే నిధులు కావాలంటే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కాస్త సమయం పట్టినా ఫర్వాలేదు, పెద్ద మొత్తంలో నిధులు కావాలంటే తనఖా రుణం కోసం ప్రయత్నించవచ్చు.

వడ్డీ రేటు: తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు అధిక వడ్డీ అయినా ఫర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. తక్కువ వడ్డీయే మీ ప్రాధాన్యమైతే, తక్షణ అవసరం కాని పక్షంలో తనఖా రుణాన్ని ఎంచుకోండి.

క్రెడిట్ స్కోర్: ఈ రెండింటిలో మీ అవసరానికి సరిపోయే రుణాన్ని ఎంచుకోవడంలో క్రెడిట్ స్కోర్, హిస్టరీ చాలా కీలకం. ఎందుకంటే, రుణం ఇవ్వాలా..? వద్దా..? అనే విషయంలో క్రెడిట్ స్కోరే మీ అర్హతను నిర్ణయిస్తుంది. అంతేకాదు, మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే రుణ దాత ఎంత వడ్డీ వసూలు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తాడు. కాబట్టి, తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను మరింత పెంచుకోవచ్చు. తద్వారా భవిష్యత్‌లో తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశముంటుంది.

బిజినెస్ ప్లస్

- హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్.. వాట్సాప్ ఆధారిత 'టాప్2ఇన్వెస్ట్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేవైసీని పూర్తి చేసుకున్న ప్రస్తుత ఇన్వెస్టర్లు ఎంఎఫ్ పథకాల్లో నేరుగా పెట్టుబడులు పెట్టడంతో పాటు చెల్లింపులు చేసేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	440
వరంగల్	407	గోదావరి	440
చిత్తూరు	470	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	120
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	95
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	114	అనంతపురం	100
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,660 ▼	83,100 ▼	1,03,000 ▼
విజయవాడ	91,500 ▼	86,000 ▲	90,700 ▼
విశాఖపట్నం	89,340 ▲	81,900 ▲	87,700 ▼
రాజమండ్రి	90,650 ▼	83,100 ▼	95,200 ▼
ప్రొద్దుటూరు	91,150 ▼	83,860 ▼	91,200 ▼
ముంబై	91,014 ▲	83,369 ▲	92,910 ▼

ప్రధాన పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహం!

» మహాబలిపురం నుంచి తీసుకురానున్న అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో సరస్వతీ నది పుష్కరాలకు దేవాదాయ శాఖతో పాటు ఇతర విభాగాలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సుమారు 120 పనులు చేపట్టేందుకు ప్రతిపాదించగా రూ.35 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ప్రభుత్వం ఇప్పటికే రూ.25 కోట్లు మంజూరు చేసింది. అలాగే ప్రధాన పుష్కర ఘాట్ వద్ద 20 అడుగుల ఎత్తులో సరస్వతి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. మహాబలిపురంలో ప్రత్యేకంగా తయారుచేయించి తెప్పిస్తున్నారు. మే 15న సూర్యోదయం నుంచి పుష్కరాలు ప్రారంభించేందుకు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి ముహూర్తం నిర్ణయించారు. 26 వరకు పుష్కరాలు కొనసాగనున్నాయి. ఇదే విషయాన్ని ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా సరస్వతీ నది పుష్కరాలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే అవకాశం ఉండటంతో రద్దీకి తగ్గట్లుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహా కుంభమేళాలో దేవాదాయ శాఖ అధికారులు పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. సరస్వతీ పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, ఏర్పాట్లు, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై అధ్యయనం చేసి వచ్చి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.

మరో 11 సమీకృత గురుకులాలకు టెండర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల విషయంలో మరో ముందడుగు పడింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 119 సమీకృత గురుకులాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలి విడతలో 55 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.11వేల కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడు మరో 11 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాల నిర్మాణానికి తెలంగాణ విద్య, సంక్షేమ, మౌలికవసతుల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) శనివారం టెండర్లను ఆహ్వానించింది. మంథని, ఖమ్మం, పాలేరు, కొల్లాపూర్, హుస్నాబాద్, ఆందోల్, నల్లగొండ, వికారాబాద్, వరంగల్ తూర్పు, ములుగు నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాల భవన నిర్మాణాలకు టెండర్లు పిలిచింది. సోమవారం (ఏప్రిల్ 7)నుంచి మే ఒకటో తేదీ వరకు టెండర్ల దాఖలుకు అవకాశం ఇచ్చింది. ఒక్కో సమీకృత గురుకులం ఏర్పాటుకు సుమారు రూ.200 కోట్ల వరకు ఖర్చవుతుందని టీజీఈడబ్ల్యూఐడీసీ అంచనా. ఇందులో భవన నిర్మాణానికి రూ.145కోట్లు, ఫర్నిచర్, ఇంటీరియర్‌కు రూ.15 కోట్లు, వివిధ రకాల పన్నులు చెల్లించేందుకు మరో రూ.40 కోట్లు అవుతాయి. ప్రస్తుతం భవన నిర్మాణ అంచనా వ్యయంతోనే టెండర్లు ఆహ్వానించారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఫర్నిచర్, ఇంటీరియర్‌కు సంబంధించిన పనులపై చర్యలు తీసుకుంటారు. ఒక్కో గురుకులాన్ని 20-25 ఎకరాల్లో 4,55,772 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. అయితే భవనాల నిర్మాణానికి లభ్యమయ్యే స్థలాన్ని బట్టి నిర్మాణాలు ఉండనున్నాయి.

తగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

» గత ఏడాదితో పోల్చితే 1.93% తక్కువ

హైదరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.93% తగ్గింది. 12 నెలల వ్యవధిలో 7 నెలలు ఆదాయం తగ్గగా, 5 నెలలు పెరుగుదల కనిపించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.14,588.06 కోట్ల ఆదాయం రాగా, 2024-25 ఏడాదికి రూ.14,307.01 కోట్లు వచ్చింది. వ్యత్యాసం రూ. 281.05 కోట్లుగా ఉంది.

మూడేళ్ల తరువాత ఆదాయంలో తగ్గుదల

రాష్ట్రంలో 2014-15 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు 11 సంవత్సరాల ఆదాయ వివరాలను పరిశీలిస్తే 2020-21లో 25.50% ఆదాయం తగ్గగా, ఆ తరువాత 2024-25లోనే 1.93% తగ్గింది. 11 ఏళ్ల వ్యవధిలో రూ.2746 కోట్లతో మొదలైన ఆదాయం.. 7 రెట్లు పెరిగి రూ.14,307 కోట్లకు చేరింది. ఆదాయం తగ్గిపోవడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖకు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగం కొంత మందకొడిగా ఉండటం, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల నుంచి రిజిస్ట్రేషన్ శాఖకు ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. రిజిస్ట్రేషన్లు తగ్గడంతో ఆ ప్రభావం ఆదాయంపై పడింది. అలాగే హైడ్రా దూకుడు వల్ల కూడా బఫర్‌జోన్, ఎఫ్‌ఆర్‌ఎల్ వంటి సమస్యలపై గందరగోళం తలెత్తడంతో కొనుగోలుదారుల్లో గందరగోళానికి దారితీసింది. బంగారం, షేర్ మార్కెట్ వైపు కూడా పెట్టుబడులు మళ్లించడంతో ఆ ప్రభావం కూడా కొంత పడి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

రూ. 3,769 కోట్లతో డ్రైనేజీ పనులు

రాష్ట్రంలోని 101 మున్సిపాలిటీల్లో మురుగు నీటి పనులు చేపట్టేందుకు పురపాలక శాఖ శనివారం టెండర్లు పిలిచింది. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో రూ.3,769.34 కోట్లతో ఈ పనులు చేపట్టబోతున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 8 నుంచి 28వ తేదీ వరకు బిడ్ దాఖలు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 ద్వారా ఈ నిధులు మంజూరవుతాయని తెలిపారు.

అంకుర సంస్థకు స్టార్టప్ మహారథి అవార్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన అంకుర సంస్థ యూఆర్ అడ్వాన్స్ థెరప్యూటిక్స్ ఢిల్లీలో జరిగిన "స్టార్టప్-మహారథి" పోటీలో బయోటెక్నాలజీ, ఆరోగ్య రంగంలో పురస్కారాన్ని గెలుచుకుంది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో శనివారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఆ సంస్థ సీఈవో జగన్‌మోహన్‌రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. స్టార్టప్ మహాకుంభ్‌లో కృత్రిమ మేధ, డీప్ టెక్, జీవ సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ భద్రత, ఆర్థిక-సాంకేతిక పరిజ్ఞానం, గేమింగ్, రక్షణ రంగం, అంతరిక్షరంగం, ఇంధనం-వాతావరణ పరిజ్ఞానం, కచ్చితత్వ తయారీ తదితర రంగాల నుంచి ఆయా అంకుర పరిశ్రమలు తమ లక్ష్యాలను వివరిస్తూ తమ ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్టార్టప్ మహారథి పోటీలో మొత్తం పది రంగాల్లో, ఒక్కో రంగం నుంచి టాప్-5 విజేతలను ప్రకటించగా జీవ సాంకేతిక పరిజ్ఞానం, ఆరోగ్యరంగంలో ఆవిష్కరణలకు గానూ యూఆర్ అడ్వాన్స్ థెరప్యూటిక్స్ ఐదో స్థానంలో నిలిచి పురస్కారాన్ని అందుకుంది.

గ్లోబల్ లీడర్‌గా అవతరించిన నారాయణ

» అమెరికా ఎన్ఎస్ఎస్ పోటీల్లో 99 ప్రాజెక్టులకు అవార్డులు

» వరల్డ్ గ్రాండ్ ప్రైజ్, వరల్డ్ నంబర్1 స్థానంలో 12 సెలక్షన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ పోటీల్లో నారాయణ విద్యార్థులు సత్తాచాటడంతో గ్లోబల్ లీడర్‌గా అవతరించినట్లు ఆ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ తెలిపారు. వరల్డ్ గ్రాండ్‌ప్రైజ్‌తోపాటు వరల్డ్ నంబర్ 1 స్థానంలో 12 సెలక్షన్లను తమ విద్యార్థులు దక్కించుకున్నారని, భారత్‌లో ఏ ఇతర విద్యాసంస్థ ఇలాంటి అరుదైన ఘనత సాధించలేదన్నారు. వరల్డ్ నం.2 స్థానంలో 17, వరల్డ్ నం.3 స్థానంలో 14 సెలక్షన్స్‌తోపాటు 55 హానరబుల్ ప్రైజ్‌లను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. మొత్తంగా 99 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. తమ విద్యార్థుల విజయాల శాతం అంతర్జాతీయ స్థాయిలో 34.1 శాతం ఉండగా, జాతీయస్థాయిలో 58.5శాతంగా ఉందన్నారు. పోటీ పరీక్షలకోసం ప్రత్యేకంగా ప్రోగ్రామ్స్‌ను అమలుచేస్తున్న ఏకైక విద్యాసంస్థ నారాయణేనని తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షల్లో తమ విద్యార్థులు సాధిస్తున్న విజయాల వెనుక నారాయణ ఉన్నతమైన ప్రణాళిక, బోధన వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా సీబీఎస్ఈతో కూడిన సమగ్ర పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టి విద్యనందించడం వల్లనే ఇలాంటి ఫలితాలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ అభినందించారు.

కంచ గచ్చిబౌలి.. నకిలీ ఫొటోలు, వీడియోలపై..

ముఖ్యమంత్రి సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సీఎం రేవంత్‌కు పలు కీలక విషయాలను వెల్లడించారు. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న భూముల్లో గడిచిన 25 ఏళ్లగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)తో పాటు గచ్చిబౌలి స్టేడియం, ట్రిపుల్ ఐటీ, ప్రైవేటు భవనాలు, అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని.. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు తెరపైకి రాలేదన్నారు. ఇప్పుడు అదే సర్వే నంబర్‌లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేస్తున్న సమయంలో ఎందుకు అక్కడ వివాదాస్పదం అవుతుందనే విషయంపై సమావేశంలో చర్చించారు. ఏఐ ద్వారా కొందరు ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలను సృష్టించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్ల పనులు చేస్తుండడంతో జింకలు గాయపడి, పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలను తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లోని ప్రముఖులు కూడా ఆ ఫేక్ ఫొటోలు, వీడియోలు, ఆడియోలను నిజమని నమ్మి.. సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అసత్యాలకు మరింత ఆజ్యం పోసినట్లయిందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్‌రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టాండన్ లాంటి వాళ్లు కూడా ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను పోస్టుచేసి, సమాజానికి తప్పుడు సందేశాన్ని చేరవేశారని సమావేశంలో చర్చించారు. అయితే ఈ భూముల వివాదంపై మొట్టమొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ ఝా.. కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలగించి.. క్షమాపణలు చెప్పారని, విగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా.. ఫేక్ వీడియోలను ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. మొత్తంగా కంచ గచ్చిబౌలి



బషీర్‌బాగ్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, వీహెచ్, ఎంపీ మల్లు రవి తదితరులు

భూముల విషయంలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది.

బాలీవుడ్ నటుల పాత్రపైనా ఆరా!!

ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను పోస్టుచేసి, సమాజానికి తప్పుడు సందేశాన్ని చేరవేశారనే ఆరోపణలపై పలువురు ప్రముఖులను విచారించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. శనివారం జరిగిన సమీక్షలో సీఎం ఈ అంశంపై సీరియస్ అయిన నేపథ్యంలో సీఎస్‌బీ చర్యలకు సిద్ధమవుతోంది. సీఎం సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ధ్రువ్‌రాఠీ, జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టాండన్ తదితరులపై దృష్టి సారించినట్లు తెలిసింది. దీంతోపాటు.. 'ఫ్యాక్ట్‌చెక్' పేరిట శనివారం సాయంత్రం మీడియాకు 8 పేజీల డాక్యుమెంట్‌ను సీఎస్‌బీ విడుదల చేసింది. అందులో సోషల్ మీడియాలో షేర్ అయిన వీడియోలు, ఫొటోల లింకులు.. అవి అసత్యాలని చెప్పడానికి ఆధారాలు, ఆ పోస్టులు చేసిన సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను వెల్లడించింది. ఏఐ ఫేక్ కంటెంట్‌ను షేర్ చేసిన సంస్థలు, వ్యక్తుల్లో.. కేసీవీపీ-తెలంగాణ, డిగ్‌టీవీ పేరడీ, కెప్టెన్ ఫసక్2.0, సూరజ్ ఠాకూర్, సుశీలారెడ్డి(బీఆర్ఎస్), సిరివెన్నెల గౌడ్ పల్లె, సాయి ప్రణీత్‌రెడ్డి, భరత్‌ప్రసాద్ పోతుగంటి, నాగిరెడ్డి-ఆర్గనైజేషన్, ఉత్కర్ష్ తివారీ, తనకమ్ కుమరన్, లింగప్రసాద్ గౌడ్ అనంతుల, దుర్గాప్రసాద్, అర్పితాప్రకాశ్, సత్య బండెల ఉన్నారు. తొలుత వీరికి నోటీసులు పంపి, విచారించాలని సీఎస్‌బీ నిర్ణయించినట్లు తెలిసింది. కాగా.. మొట్టమొదటి ఫేక్ వీడియోను పోస్టు చేసిన జర్నలిస్టు సుమిత్.. కాసేపటికి తన తప్పు తెలుసుకుని, తొలగించారని, క్షమాపణలు చెబుతూ ట్వీట్ చేశారని పోలీసులు చెబుతున్నారు. మిగతావారు కూడా నిజాన్ని గుర్తించినా, స్తబ్ధుగా ఉన్నట్లు గుర్తుచేస్తున్నారు.

జగ్జీవన్‌కు సీఎం నివాళులు

మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గాంధీభవన్‌లోనూ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

» లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల ప్రతినిధులతో

» మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమైనదని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల అధికార ప్రతినిధులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం(జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండియా-లాటిన్ అమెరికా, కరేబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్' రెండో ఎడిషన్‌కు ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటేలా ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

నేడు భద్రాద్రికి ముఖ్యమంత్రి

» సీతారామస్వామి కళ్యాణానికి హాజరు

» పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

» సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

» రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారు

బూర్గంపాడు, భద్రాచలం, ఖమ్మం, కొత్తగూడెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భద్రాద్రి జిల్లాల్లో పర్యటించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారామ కల్యాణం కోసం స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. కల్యాణం అనంతరం బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన బూరం శ్రీనివాసరావు అనే సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సన్న బియ్యం పంపిణీని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన నేపథ్యంలో సన్న బియ్యం అందుకున్న లబ్ధిదారుల ఇళ్లలో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆదివారం భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామ కల్యాణానికి విచ్చేస్తున్న సీఎం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం లబ్ధిదారుడి ఇంటిని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సహా పలువురు ఉన్నతాధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, దేశంలోనే మొట్టమొదటిసారిగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఆమోదం తెలిపారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం భద్రాచలం విచ్చేస్తున్న సీఎం ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ మంజూరు ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

నేడే సీతారామ కల్యాణం

భద్రాచల పుణ్య క్షేత్రంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణమండపంలో ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణం జరుగుతుంది. ఉత్సవాలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 1,800 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసింది. దేవస్థానం భక్తుల కోసం 2 లక్షల లడ్డూలను, 200 క్వింటాళ్ల తలంబ్రాలను పంపిణీకి సిద్ధం చేసింది. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో భద్రాచలానికి 197 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సోమవారం నిర్వహించే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయనున్నారు.

భద్రాద్రి రామయ్యకు టీటీడీ పట్టువస్త్రాలు

శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.



ఎర్రవల్లి ఫాంహౌస్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్ తదితరులు

ప్రజలకు పాలేవో.. నీళ్లేవో తెలిసింది!

» ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయారో అర్థం చేసుకున్నారు

» ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం నేతలతో భేటీలో కేసీఆర్

హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు పాలేవో, నీళ్లేవో స్పష్టంగా తెలిసిందని.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయారో అర్థం చేసుకున్నారని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరిగిందని, ఎన్నికలు ఏవైనా గులాబీ పార్టీదే గెలుపని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఆవిర్భావ, రజతోత్సవ మహాసభ నేపథ్యంలో శనివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల పార్టీ నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలన్నారు. సభకు లక్షలాదిగా జనం తరలివస్తారని.. వారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నల్లగొండ జిల్లాను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాను నిరంజన్‌రెడ్డి, ఖమ్మం జిల్లాను పువ్వాడ అజయ్ సమన్వయం చేసుకోవాలన్నారు. రజతోత్సవ సభ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని, గ్రామ స్థాయి నుంచి కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. రైతుల కష్టాలపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాలు, అధికారమే పరమావధిగా పనిచేసే కాంగ్రెస్ నేతలు ప్రజల పాలిట శాపంగా మారారని మండిపడ్డారు. హెచ్‌సీయూ విషయంలో ప్రభుత్వ వైఖరిని ఆయన తప్పుబట్టారు. అధికారం చేతిలో ఉందని నోటికొచ్చినట్లు మాట్లాడి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే.. అటు న్యాయస్థానాలు, ఇటు సభ్య సమాజం తిప్పికొడుతుందన్నారు. హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

'నమస్తే'పై విజిలెన్స్

తెలంగాణ టుడే, టీన్యూస్‌పైనా..

గత సర్కారు హయాంలో.. సొంత మీడియాకే భారీగా ప్రకటనలు

348.43కోట్ల యాడ్స్‌పై ప్రభుత్వం సీరియస్.. ప్రకటనల లొగుట్టు విప్పనున్న విజిలెన్స్

అప్పట్లో సమాచార శాఖకు కేసీఆర్ ప్రాతినిధ్యం.. ఈ కేసులో ఆయననూ విచారించే చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ సొంత మీడియా-నమస్తే తెలంగాణ తెలుగు దినపత్రిక, తెలంగాణ టుడే ఆంగ్ల పత్రిక, టీన్యూస్ టీవీ చానల్‌కు నిబంధనలకు విరుద్ధంగా రూ.వందల కోట్లతో ప్రకటనలను ఇవ్వడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన సొంత మీడియా సంస్థలకు రూ.348.43 కోట్లను వెచ్చించి ప్రకటనలను ఇచ్చిన వైనంపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. ఈ అంశంపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఇప్పటికే విజిలెన్స్ అధికారులు ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించినట్లు సమాచారం. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఈ తతంగంపై పలుమార్లు బాహాటంగా విమర్శించారు. "పత్రికల సర్క్యులేషన్, టీవీ చానళ్ల రేటింగ్ ఆధారంగా టారిఫ్‌లను లెక్కిస్తారు. బీఆర్ఎస్ హయాంలో సొంత మీడియా కోట్ చేసిన రేటును సమాచార శాఖ అధికారులు ఓకే చేశారు" అని ఆయన విమర్శలు చేసిన విషయం తెలిసిందే.! సమాచార శాఖ విశ్రాంత అధికారులు కూడా కేసీఆర్ కుటుంబానికి చెందిన తెలంగాణ టుడే ఆంగ్ల దినపత్రిక విషయంలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపారు. "నిబంధనల ప్రకారం.. ఓ పత్రిక 18 నెలలు నిరంతరాయంగా ప్రచురితమవ్వాలి. ఆ తర్వాత ప్రభుత్వ ప్రకటనల జారీకి ఎంప్యానల్ అవ్వాలి. ఆ తర్వాతే సంబంధిత పత్రికకు ప్రకటనలివ్వాలి. కానీ, తెలంగాణ టుడే ఏర్పాటైన మూడు నెలలకే.. ఆ పత్రికకు ప్రకటనలివ్వాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి" అని వివరించారు. ఈ జీవో వెనక ఉన్నదెవరు? ఫైళ్లపై సంతకాలు చేసిందెవరు? ఈ విషయంలో సచివాలయ బిజినెస్ రూల్స్‌ను పాటించారా? లేక.. మౌఖిక ఆదేశాలతోనే కథ నడిపించారా? అనే కోణంపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో.. సోమవారం నుంచి విజిలెన్స్ బృందాలు పూర్తిస్థాయిలో ఈ వ్యవహారంపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పత్రిక/మీడియా సంస్థల నిర్వహణ ఖర్చులకే వాడారా? లేక ఇతర వ్యవహారాలకు మళ్లించారా? అనే అంశంపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. అప్పట్లో సమాచార శాఖకు కూడా కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన నేపథ్యంలో.. ఆయనను విజిలెన్స్ అధికారులు విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కంచ గచ్చిబౌలిలో ఏం జరుగుతోంది?

» మంత్రుల కమిటీతో టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ

» వివిధ అంశాలపై ఆరా.. సంతృప్తి వ్యక్తం చేసిన నేత !



హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వివాదం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థుల ఆందోళనల అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి వచ్చిన టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. కంచగచ్చిబౌలి భూముల అంశంపై ముగ్గురు మంత్రులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీతో సచివాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ కమిటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. అసలు ఏం జరిగింది ? ఆ భూములు ఎవరివి? విద్యార్థులు ఎందుకు ఆందోళనలు చేస్తున్నారు? తదితర అంశాలపై మంత్రులను ప్రశ్నించారు. అలాగే, భూములు చదును చేసే క్రమంలో నెమళ్లు, జింకలు ఇబ్బందికి గురైనట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపైనా అడిగారు. ఇందుకు స్పందించిన కమిటీ సభ్యులు.. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో ఉన్న 400 ఎకరాల భూములకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి సంబంధం లేదని తెలిపారు. ఆ భూములు పూర్తిగా ప్రభుత్వానివేనని స్పష్టంచేశారు. ఇక, నెమళ్లు, జింకలు ఇబ్బంది పడు తున్నాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఏఐ సాయంతో ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని వివరించారు. ఆయా ఫొటోలు, వీడియోలు కల్పితాలని సైబర్ క్రైమ్ వర్గాలు తేల్చాయని తెలిపారు. సంబంధిత నివేదికను కూడా ఆమె ముందు ఉంచినట్లు సమాచారం. అదే విధంగా భూముల వివాదంపై సుప్రీంకోర్టు అడిగిన సమాచారాన్ని గడువులోగా పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి త్రిసభ్య కమిటీ తీసుకుంటున్న చర్యలను వివరించారు. కమిటీ ఇచ్చిన వివరణకు మీనాక్షి నటరాజన్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. కమిటీ చెప్పిన వివరాలను ఆమె అధిష్ఠానానికి నివేదించనున్నారు.

ఎవరికీ నష్టం లేకుండా పరిష్కారం

కంచ గచ్చిబౌలి భూముల వివాదాన్ని ఎవరికి నష్టం కలగకుండా పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆలోచనని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలతో మీనాక్షి నటరాజన్ అన్నారు. మంత్రులతో భేటీ అనంతరం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలతో గాంధీభవన్‌లో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల వివాదం పరిష్కారానికి వేసిన కమిటీతో అన్ని విషయాలు చర్చించినట్లు తెలిపారు. విద్యార్థుల లేఖలపైనా సమాచారాన్ని సేకరిస్తామని.. ఎప్పుడు ఎవరితో మాట్లాడాలనే వివరాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. అదే విధంగా ప్రతిపక్షాల ఆరోపణలపైనా వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై మీనాక్షి .. ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలతో ఆదివారం సమావేశమవుతారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

వాయుసేన, పౌర విమానయాన సేవలకు సిద్ధంగా ఆదిలాబాద్ విమానాశ్రయం

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వినతికి రక్షణమంత్రి రాజ్‌నాథ్ స్పందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో పౌర విమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వినతికి రాజ్‌నాథ్‌సింగ్ లేఖ ద్వారా స్పందించారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతోపాటు పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నామని రాజ్‌నాథ్‌సింగ్ కిషన్‌రెడ్డికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. కొంతకాలంగా స్థానిక ప్రజలు, నాయకుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు వినియోగించుకునేలా చొరవ తీసుకోవాలని విన్నవించానని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుపై రాష్ట్రప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. 2021లో నాటి పౌరవిమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినప్పటికీ గత బీఆర్ఎస్ సర్కార్ నుంచి స్పందన కరువైందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. దాన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా వివిధ కారణాలతో రక్షణశాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి.

విదేశీ డిగ్రీకి దేశీయ పట్టా

»» యూజీసీ కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా విదేశాలతో భారత్ అకడమిక్ రంగంలో భాగస్వామ్యం కుదుర్చుకున్న రీత్యా విదేశీ డిగ్రీలను గుర్తించేందుకు యూజీసీ తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. అంతర్జాతీయ విద్యార్హతలతో తిరిగి వచ్చే విద్యార్థులను భారతీయ ఉన్నత విద్యావ్యవస్థలో భాగం చేసేందుకు వీలుగా ఎలాంటి జాప్యం లేకుండా వారి డిగ్రీలను సమీక్షించేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, నిబంధనలను రూపొందించినట్లు యూజీసీ చైర్మన్ జగదీశ్ శనివారం వెల్లడించారు. తాజా నిబంధనల ప్రకారం విదేశీ విద్యాసంస్థల నుంచి పొందిన డిగ్రీలకు సమానంగా ఈక్వివాలెన్స్ సర్టిఫికెట్ పొందేందుకు యూజీసీ ఏర్పాటు చేసిన పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కమిషన్ నియమించిన స్టాండింగ్ కమిటీ పదిరోజుల్లో ఈ దరఖాస్తులను పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఈ సర్టిఫికెట్ పోర్టల్‌లోనే లభ్యమవుతుంది. దరఖాస్తులో పేర్కొన్న వివరాల పట్ల కమిటీ సంతృప్తి చెందకపోతే 15 రోజుల్లోపు అదనపు సమాచారాన్ని సమర్పించాల్సిందిగా కోరుతుంది. దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలో 30 పనిదినాల్లో నిర్దిష్ట ఫీజు చెల్లించి పునఃపరిశీలన కోరవచ్చు. దానిని ప్రత్యేక రివ్యూ కమిటీ తిరిగి పునఃపరిశీలించి పది రోజుల్లో తన నిర్ణయాన్ని తెలుపుతుంది. మెడిసిన్, ఫార్మసీ, నర్సింగ్, లా, ఆర్కిటెక్చర్ రంగాల్లో విదేశీ విద్యాసంస్థలు ప్రదానం చేసే డిగ్రీలకు ఇది వర్తించదని, వాటిని గుర్తించేందుకు ఇప్పటికే చట్టబద్ధమైన కౌన్సిళ్లు ఉన్నాయని ఆయన చెప్పారు

మావోయిస్టులారా ఆయుధాలను వదలండి: షా

దంతెవాడ, ఏప్రిల్ 5: ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బస్తర్ పాండూమ్' వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2026 మార్చి నాటికి మావోయిస్టుల బెడదను పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. "బస్తర్‌లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగిసిపోయాయి. ఆయుధాలను అడ్డం పెట్టుకొని గిరిజన సోదరులు, సోదరీమణుల అభివృద్ధిని మావోయిస్టులు ఆపలేరు' అని అమిత్ షా పేర్కొన్నారు. గత 50ఏళ్లగా బస్తర్ అభివృద్ధికి నోచుకోలేదని, బస్తర్ ప్రజలు తమ ఇళ్లను, ఊళ్లను నక్సలైట్ రహితంగా మార్చాలని బలమైన నిర్ణయం తీసుకుంటేనే అభివృద్ధికి బాటలు పడతాయని స్పష్టం చేశారు.

రూ.65వేల కోట్లతో త్వరలో 26 రఫేల్-మారిటైమ్ యుద్ధ విమానాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 26 రఫేల్-మ్యారిటైమ్ యుద్ధ విమానాల కొనుగోలుకు తాజాగా సిద్ధమైంది. 7.6 బిలియన్ డాలర్ల(సుమారు రూ.65వేల కోట్లు) విలువైన ఈ ఒప్పందం కేంద్రం ఆమోదం కోసం ఈ నెలాఖరులో భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ముందుకు రానున్నట్లు సమాచారం. ఆ తర్వాత మూడు అదనపు డీజిల్ ఎలక్ట్రిక్ జలాంతర్గాముల కొనుగోలుకు కూడా ప్రభుత్వం పచ్చజెండా ఊపే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటి నుంచి దాదాపు రూ.10 లక్షల కోట్ల విలువైన 1,096 రక్షణ ఒప్పందాలు చేసుకోవడం గమనార్హం.

2029 తర్వాతే జమిలి ఎన్నికలు: నిర్మల

చెన్నై, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టతనిచ్చారు. 2029 పార్లమెంటు ఎన్నికల తర్వాతే జమిలి ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'(జమిలి) ప్రక్రియను 2029 తర్వాతే రాష్ట్రపతి ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. శనివారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనేది కొత్త ఆలోచన కాదని, ఇది ఎప్పటి నుంచో ఉన్నదేనని తెలిపారు. రాజకీయంగా నేతలు, పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండవచ్చునని, కానీ, కేంద్రం ప్రతిపాదించిన ప్రతి విషయాన్నీ గుడ్డిగా ప్రతిఘటించడం ఎవరికీ సరికాదని వ్యాఖ్యానించారు.

రాజకీయ నాయకులుగా ఎదిగేందుకు ఫెలోషిప్

»» మన్మోహన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యక్రమం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: కొత్త తరం రాజకీయనాయకులను తయారుచేసే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరుతో ఒక ఫెలోషిప్ ప్రోగ్రాం ప్రారంభించింది. వివిధ వృత్తిపరమైన నేపథ్యాల నుంచి వచ్చిన 50 మంది నిపుణులను ప్రతిభావంతులైన ప్యానెల్ ఓ ప్రత్యేకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. వారికి రాహుల్ గాంధీ, శశిథరూర్, అజయ్ మాకెన్ వంటి ప్రముఖులు మెంటార్స్‌గా వ్యవహరిస్తారని ఏఐసీసీ తెలిపింది. ఆధునిక, ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని పేర్కొంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఏఐసీసీ నేతలు ప్రవీణ్ చక్రవర్తి, కొప్పుల రాజు ఈ ఫెలోషిప్ వివరాలను వెల్లడించారు. ఫెలోషిప్ దరఖాస్తుకు విద్యార్హతలేమీ అవసరం లేదని, కానీ అభ్యర్థులకు ఏదో ఒక వృత్తిలో 10 ఏళ్ల అనుభవం ఉండాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ శనివారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో, గురువారం రాజ్యసభలో ఆమోదం పొందింది. ఇదిలా ఉండగా, వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలపై దాడేనని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ శనివారం అన్నారు. భవిష్యత్‌లో దేశంలో ఇతర మతాలపై జరగనున్న దాడులకు ఇదో ఉదాహరణ వంటిదని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు ఆమోదం తర్వాత ఆర్ఎస్ఎస్ క్యాథలిక్ చర్చి భూములపై దృష్టి సారించిందని పేర్కొంటూ ఆరెస్సెస్ అనుబంధ పత్రికలో వచ్చిన ఒక వార్తా కథనాన్ని దానికి జోడించారు. ఇక క్రిస్టియన్లపై దృష్టి సారించడానికి ఆర్ఎస్ఎస్‌కు ఎంతో సమయం పట్టదని రాహుల్ తన పోస్టులో వివరించారు. ఇదిలా ఉండగా, వక్ఫ్ సవరణ బిల్లును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మరో రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

నిమిషాల్లోనే ఘటనాస్థలికి చేరే 'ద్రష్టి'

»» గుజరాత్ పోలీసుల వినూత్న ప్రయోగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ప్రమాదం లేదా నేరాలు జరిగినప్పుడు నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకునేలా గుజరాత్ పోలీసులు 'జీపీ-ద్రష్టి' అనే పేరుతో డ్రోన్ ఆధారిత వ్యవస్థను రూపొందించారు. ఇది పీసీఆర్ (పోలీస్ కంట్రోల్ రూమ్) వాహనాలకు సహకారాన్ని అందిస్తుందని డీజీపీ వికాస్ సహాయ్ తెలిపారు. ప్రమాద స్థలానికి సరైన సమయంలో చేరుకుని, వారికి విచారణలో ఉపకరించే విధంగా ఈ వ్యవస్థను రూపొందించారు. ఘటన జరిగినప్పుడు ఈ డ్రోన్లు ప్రత్యక్ష పరిస్థితిని చిత్రీకరించి వాటిని పోలీసులకు చేరవేస్తాయి. పదిరోజుల పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మొదట సూరత్, అహ్మదాబాద్‌లో ప్రయోగించగా పీసీఆర్ వాహనాలతో పోలిస్తే సగం సమయంలోనే ఈ డ్రోన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. కొన్నిసార్లు కేవలం రెండు మూడు నిమిషాల వ్యవధిలోనే చేరుకున్నాయని వివరించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు సక్సెస్ కావడంతో మరిన్ని డ్రోన్లను వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.

10 లక్షల ఇరాన్ రియాళ్లకు ఒక్క డాలర్

టెహ్రాన్, ఏప్రిల్ 5: మామూలుగా ఒక్క డాలర్‌కు మన కరెన్సీ ఎంత వస్తుంది. ఇప్పటి లెక్క ప్రకారం సుమారు 86 రూపాయలు. కానీ ఒక్క డాలర్‌కు ఏకంగా పది లక్షలకుపైనే అయితే!? ఇరాన్ కరెన్సీ రియాల్. శనివారం అంతర్జాతీయ మార్కెట్లో ఒక డాలర్‌కు రికార్డు స్థాయిలో 10 లక్షల 43 వేల రియాల్‌లకు విలువ పడిపోయింది. ఈ దెబ్బకు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని కరెన్సీ మార్పిడి కేంద్రమైన ఫిర్దౌసీ స్ట్రీట్‌లో ట్రేడర్లు కరెన్సీ మార్పిడి విలువల డిజిటల్ బోర్డులను ఆఫ్ చేసేశారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ వేగంగా పడిపోతోంది.

అమెరికాలో టారిఫ్‌ల కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో ఇప్పటికే ధరాఘాతం మొదలైంది. చాలా వరకు సూపర్ మార్కెట్లు, గ్రోసరీల నిర్వాహకులు పనిలో పనిగా సరుకుల ధరలను పెంచేశారని అక్కడి మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధిక సుంకాలతో కూడిన సరుకులు ఇంకా రాకున్నా, ఇప్పటికే ఉన్న పాత స్టాకు ధరలను కూడా సుంకాలకు అనుగుణంగా పెంచేసినట్లు పేర్కొంటున్నాయి.

ఎందుకీ ధరల భయం.. ఎంత ప్రభావం?

అమెరికా పౌరులు వినియోగించే వాటిలో 90శాతం వరకు దిగుమతులపై ఆధారపడినవే ఉంటాయి. తయారీ రంగం మొత్తం చైనా, ఇతర దేశాలకు తరలిపోయింది. చివరికి టిష్యూ పేపర్లు కూడా చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. అందుకే ట్రంప్ టారిఫ్‌లతో అమెరికన్ల జీవన వ్యయంపై గట్టి ప్రభావం పడుతోంది. దిగుమతులపై ఆయా దేశాలను బట్టి 25 శాతం నుంచి 52 శాతం వరకు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా ఆయా ఉత్పత్తుల ధరలు పెరిగిపోవడం ఖాయం. ఇది సగటు అమెరికన్లతోపాటు అక్కడ నివసిస్తున్న విదేశీయులలోనూ కలకలం రేపుతోంది. ఉదాహరణకు సుమారు 500 డాలర్లతో నెల రోజులు గడిపేసేవారు... సుంకాలు అమల్లోకి వచ్చి ధరలు పెరిగితే, నెలకు 650 డాలర్ల నుంచి 700 డాలర్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా. అంటే నెలవారీ బడ్జెట్‌పై 30-40 శాతం వరకు అదనపు భారం పడుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వాల్‌మార్ట్ ఒక్కటి చూసినా...

అమెరికన్ సమాజంలో సుంకాల దెబ్బ తీవ్రత అంచనా కోసం ఒక్క వాల్‌మార్ట్ స్టోర్లను పరిశీలిస్తే చాలని నిపుణులు చెబుతున్నారు. మనకు జిల్లాలు ఉన్నట్టుగా అక్కడ కౌంటీలు ఉంటాయి. ప్రతి కౌంటీలో ఓ భారీ వాల్‌మార్ట్ హైపర్ మార్కెట్ ఉంటుంది. చాలా మంది అందులోనే నిత్యావసరాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఈ స్టోర్లలో 90 శాతం వరకు దిగుమతి అయిన వస్తువులనే విక్రయిస్తుంటారని.. ఇప్పుడు టారిఫ్‌ల ధరాఘాతంతో అందరిపైనా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

జీవన శైలిలోనే మార్పు తప్పదా?

అమెరికన్ల జీవన విధానం చాలా విభిన్నమని, పొదుపు చేయడాన్ని ప్రత్యేకంగా చూడని విశ్లేషకులు చెబుతున్నారు. అంతేగాకుండా అక్కడ నెలవారీగా కాకుండా వారాంతపు వేతనాలు ఉంటాయని.. ఏవారం వేతనాలను ఆ వారం ఖర్చు పెట్టేసే తరహా జీవన శైలి ఉంటుందని వివరిస్తున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా 30 శాతం వరకు వ్యయం పెరిగితే.. ఖర్చులు తగ్గించుకోవడం, పొదుపు చేయడం ద్వారా వారి జీవనశైలినే మార్చుకోవాల్సిన పరిస్థితి తప్పదని అంటున్నారు.



వివిధ దేశాలపై విధించే ప్రతీకార సుంకాలను బోర్డు పట్టుకొని వివరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్(ఫైల్)

అప్పుల పాలవుతున్న అమెరికన్లు!

సుంకాల ధరాఘాతం నుంచి తప్పించుకునేందుకు ఎగబడి సరుకులు, వస్తువులు కొనుగోలు చేస్తున్న అమెరికన్లు.. ఇందు కోసం అప్పులు కూడా చేస్తున్నారని అక్కడి ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలలో వాహనాల విక్రయాలు ఏకంగా 11.2 శాతం పెరిగాయని, ఏప్రిల్ మొదటి వారంలోనూ భారీగా నమోదయ్యాయని చెబుతున్నారు. భవిష్యత్తులో తీర్చుకోవాలనుకున్న కోరికలను కూడా.. ధరలు అడ్డగోలుగా పెరుగుతాయన్న ఉద్దేశంతో ఇప్పుడే తీర్చేసుకుంటున్నారని... తాహతుకు మించి ఖర్చు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు, ఖరీదైన ఫోన్లు వంటివి కొంటున్నారని వివరిస్తున్నారు. సుంకాల ఆందోళనతో అనవసరమైన, తాహతుకు మించిన ఖర్చులు చేయవద్దని అమెరికన్లను హెచ్చరిస్తున్నారు.

(అమెరికాలోని డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి ఇన్‌పుట్స్‌తో..)

అక్కడి భారతీయులపై మరింత భారం



ట్రంప్ సుంకాల ధరాఘాతం అక్కడ ఉద్యోగాలు చేస్తున్న, చదువుకుంటున్న భారతీయులపై గణనీయంగానే ప్రభావం చూపనుంది. ఇప్పటికే విదేశీ విద్యార్థులు తాత్కాలిక (పార్ట్‌టైమ్) ఉద్యోగాలు చేయకుండా ట్రంప్ ఆంక్షలు విధించడంతో... భారతీయ విద్యార్థులకు ఆ మాత్రం ఆదాయం లేకుండా పోయింది. ఇండియా నుంచి కుటుంబ సభ్యులు పంపే డబ్బే దిక్కవుతోంది. ఇప్పుడు అక్కడ ఖర్చులు పెరగడంతో... ఇక్కడి నుంచి మరింత ఎక్కువ సొమ్ము పంపక తప్పదు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతుంది. మరోవైపు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులపైనా ప్రభావం గణనీయంగానే ఉండనుంది. అక్కడ జీవన వ్యయం పెరగడంతో మనవాళ్ల పొదుపునకు కోత పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏమేం కొని పెట్టుకుంటున్నారు?

ట్రంప్ సుంకాల ప్రభావం దాదాపు అన్ని రకాల ఉత్పత్తులపై కనిపించనుంది. కానీ కొన్ని ఉత్పత్తులు చాలా వరకు విదేశాల నుంచే వస్తుండటంతో వాటి ధరలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని అంచనా. ఇందులో అమెరికన్లు ఏయే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారన్నదానిపై అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం...



విదేశాల నుంచి దిగుమతి అయ్యే గ్రోసరీ వస్తువులు, కాఫీ, చిరుతిళ్లు (స్నాక్స్) వంటి వాటి ధరలు పెరిగే అవకాశం ఉండటంతో వీలైనంతగా కొని పెట్టుకుంటున్నారు.



అమెరికాలో తయారయ్యే ఎలక్ట్రానిక్ పరికరాల్లో వాడే విడిభాగాలు చాలా వరకు చైనా, తైవాన్ దేశాల నుంచే దిగుమతి అవుతాయి. సుంకాలతో ధరలపై ప్రభావం పడి వాటి ధరలు పెరగడం ఖాయమనే ఉద్దేశంతో ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, కిచెన్ అప్లయెన్సెస్ వంటివి ఎక్కువగా కొంటున్నారు.



అమెరికాకు చాలా వరకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, వాటి విడిభాగాలు చైనా, తైవాన్‌ల నుంచే వస్తాయి. ఇందులో తైవాన్‌పై 32శాతం, చైనాపై 52శాతం సుంకాలను ట్రంప్ ప్రకటించారు. దీనితో ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు కొనాలని భావిస్తున్న వారంతా.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టుగా వాటికోసం బారులుతీరుతున్నారు.



'గ్యాప్, హెచ్ అండ్ ఎం' వంటి పెద్ద బ్రాండ్లు సహా అమెరికాలో వినియోగించే దుస్తులు, ఫుట్‌వేర్‌లో చాలా వరకు వియత్నాం(21% పన్ను), భారత్, ఇండోనేషియా, బంగ్లాదేశ్ (37% పన్ను) నుంచి రావాల్సిందే. దీనితో ధరలు పెరుగుతాయని జీన్స్, బూట్లు కొనడానికి అమెరికన్లు క్యూ కడుతున్నారు.



కొత్త కార్లు ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇక రేబాన్ కళ్లజోళ్లు, సౌందర్య ఉత్పత్తులు, ఆస్పత్రుల్లో వాడే పరికరాలు, బెడ్లు, ట్రెడ్‌మిల్స్, మసాజ్ చైర్లు, ఇతర జిమ్ పరికరాలు, డైపర్లు, బొమ్మలు, స్త్రాలర్లు తదితర ఉత్పత్తులకూ డిమాండ్ పెరిగింది.



అమెరికాలో వ్యవసాయం ఎక్కువే. కానీ అందుకు అవసరమైన పరికరాలు చైనా నుంచి, ట్రాక్టర్ల విడిభాగాలు జర్మనీ నుంచి, ఎరువులేమో కెనడా, రష్యాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. దీనితో స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరుగుతాయి.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ట్రంప్ సంప్రదింపులు

న్యూఢిల్లీ, వాషింగ్టన్, ఏప్రిల్5: ఈ నెల 9 నుంచి ప్రతీకార సుంకాలు పూర్తి స్థాయిలో అమల్లోకి రానున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సంప్రదింపుల ప్రక్రియ వేగిరం చేశారు. భారత్‌తో పాటు ఇజ్రాయెల్, వియత్నాంతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా, కెనడా తరహాలో దూకుడుగా స్పందించకుండా భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. నిజానికి 10 రోజుల క్రితమే అమెరికా వాణిజ్యమంత్రి భారత్‌లో పర్యటించారు. రెండు దేశాలకు వరస్పర ప్రయోజనకరంగా ఉండేలా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందామన్న భారత ప్రతిపాదనపై లోతుగా చర్చించారు. ప్రతీకార సుంకాలపై అమెరికాతో సహా ప్రపంచ దేశాల్లో భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్.. భారత్, ఇజ్రాయెల్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సంప్రదింపులు జరపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల 7న అమెరికా వెళ్లనున్నారు. ట్రంప్‌తో ప్రతీకార సుంకాల అంశంపై చర్చించనున్నారు. ఈ నెల రెండున ట్రంప్ ఇజ్రాయెల్‌పై 17%, భారత్‌పై 26%, వియత్నాంపై 46% సుంకాలు విధించారు. శనివారం నుంచి పది శాతం సుంకాలు అమల్లోకి వచ్చాయి.

ఆధునిక రామ సేతు!



(మొదటి పేజీ తరువాయి)

పాంబన్ నుంచే! పాంబన్ దీవిని ప్రధాన భూభాగంతో అనుసంధానించేందుకు నేడు నిర్మించిన అధునాతన రైలు మార్గాన్ని శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. శ్రీలంక పర్యటన ముగించుకుని ప్రధాని ఆదివారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో తమిళనాడులోని మండపం చేరుకుంటారు. ఈ సందర్భంగా ఆయన కొత్త రైలుబ్రిడ్జిని, కొత్త లిఫ్ట్‌ను, రామేశ్వరం-తాంబరం రైలును వర్చువల్‌గా ప్రారంభిస్తారు. అనంతరం రామేశ్వరంలోని రామనాథస్వామివారి ఆలయానికి వెళతారు. శ్రీరామనవమి సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రీలంకకు-భారత్‌కు మధ్య ఉన్న పాక్ జలసంధిలో పాంబన్ దీవి ఉంటుంది. మన దేశం నుంచి కాస్త విసిరేసినట్లుగా ఉండే ఆ దీవిని దేశ ప్రధాన భూభాగంలోని రైలు నెట్‌వర్క్‌తో అనుసంధానించేదే పాంబన్ రైలు వంతెన. సముద్రంపై నిర్మితమైన 'వర్టికల్ లిఫ్ట్' ఉన్న వంతెన ఇది. దేశంలో ఇలాంటి వంతెనను నిర్మించడం ఇదే ప్రథమం. మండపం ప్రాంతం నుంచి పాంబన్ దీవికి 2.07 కి.మీ పొడవున నిర్మించిన ఈ వంతెనను 'రామ సేతు'కు వారధిగా అభివర్ణిస్తున్నారు.

బ్రిటిష్ కాలంలో తొలి వంతెన

మండపం ప్రాంతం నుంచి పాంబన్ దీవికి మీటర్ గేజ్ రైలు వంతెనను బ్రిటిష్ కాలంలో 1914లో నిర్మించి ప్రారంభించారు. నాడు ఈవంతెన నిర్మాణానికి రూ. 20 లక్షలు ఖర్చయింది. సముద్రంలో ఓడలు, నౌకలు వెళ్లే సమయంలో ఈ వంతెన మధ్యలో రెండుగా విడిపోయి పైకి లేచేలా (డబుల్ లీఫ్ బేస్క్యూల్ బ్రిడ్జి) రూపొందించారు. ఇక్కడ వంతెన మధ్య నుంచి ఓడలు వెళ్లేలా మార్గం లేకపోతే అవి మన దేశ చివరి భూభాగమైన ధనుష్కోటి అవతలి నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి. అంటే ఒక్కో ఓడ సుమారు 150 కి.మీ అదనంగా చుట్టి రావాల్సి ఉంటుంది. అందుకే పాంబన్ వంతెన మధ్యభాగం కింది నుంచి ఓడలు కూడా వెళ్లేలా నాటి పాలకులు ప్రణాళికలు రూపొందించారు. 1962లో ధనుష్కోటి ప్రాంతంలో సంభవించిన తుఫాను సమయంలో పాంబన్-ధనుష్కోటి ప్యాసింజర్ రైలుతో సహా ఆ రైలు మార్గం కూడా ధ్వంసమైంది. తర్వాత మరమ్మతులు చేసి.. 2007లో దీనిని బ్రాడ్ గేజ్‌గా విస్తరించారు. 2013 జనవరి 13న నావికాదళానికి చెందిన 'బార్జ్' వంతెనను ఢీకొట్టింది.వంతెనపై ఉన్న స్పాన్లలోని ఒక దానిలో పగుళ్లు కనిపించడంతో 2022 డిసెంబరు నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేశారు.

535కోట్లతో కొత్త బ్రిడ్జి

పాంబన్ పాత వంతెన దెబ్బతినడంతో దాని పక్కనే కొత్త వంతెన నిర్మాణానికి 2019 మార్చి 1న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణానికి కోసం మొదట రూ. 250 కోట్లు కేటాయించింది. కానీ వంతెన పూర్తయ్యేనాటికి వ్యయం రూ. 535 కోట్లకు పెరిగింది. ఓడల రాకపోకల కోసం పాత వంతెన రెండుగా విడిపోయేది. అయితే కొత్తగా నిర్మించిన రైల్వే వంతెన మార్గం అలా విడిపోకుండా మధ్యలో భాగం లిఫ్టుల ద్వారా నిలువుగా పైకి లేచేలా (వర్టికల్ లిఫ్ట్) రూపొందించారు.మోటార్ల సాయంతో రిమోట్ కంట్రోల్ ద్వారా లిఫ్ట్‌ను ఎత్తుతారు. 660 టన్నుల బరువైన 72.5 మీటర్ల వంతెన భాగాన్ని ఇప్పుడు కేవలం 5.20నిమిషాల్లో పూర్తిస్థాయిలో పైకి లేపవచ్చు. ఈ వంతెన కింద నుంచి 22 మీటర్లు ఎత్తయిన ఓడలు కూడా వెళ్లగలవు. ఇందులో వర్టికల్ బ్రిడ్జి సాంకేతికతను స్పెయిన్ నుంచి తీసుకురాగా, మిగిలినవి దేశీయంగా సిద్ధం చేశారు. విజయనగరం జిల్లాకు చెందిన రైల్వే సీనియర్ ఇంజనీర్ నడుపూరు చక్రధర్ ఈ వంతెన నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించడం విశేషం.

ఒక్క బోల్టు వాడకుండా

- వర్టికల్ లిఫ్ట్‌కు ఒక్క బోల్టు కూడా వాడకుండా వెల్డింగ్‌తోనే సిద్ధం చేశారు.
- వంతెనలో 99 దిమ్మెలున్నాయి. ఇవి పటిష్ఠంగా ఉండేలా, సముద్రం అడుగున గట్టి నేల తగిలే వరకు 25-35 మీటర్ల లోతున పునాదులు వేశారు. వంతెన నిర్మాణానికి మొత్తం 62వేల టన్నుల స్టీల్, 3.38 లక్షల బస్తాల సిమెంట్, 25వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వాడారు.
- వర్టికల్ లిఫ్ట్ స్పాన్‌ను తీరం నుంచి 600 మీటర్ల దూరంలోని ప్రతిపాదిత చోటుకు తీసుకెళ్లేందుకు 5 నెలలు పట్టింది.
- సముద్రపు అలలకు కొత్త వంతెన తుప్పు పట్టకుండా జింక్, 200 మైక్రాన్ల అప్రోక్సీ సీలెంట్, 125 మైక్రాన్ల పాలీ సిలోక్సేన్‌తో కూడిన ట్రిబుల్ కోటింగ్ పూత పూశారు.

తమిళ జాలర్లపై మానవత్వం చూపండి

»» వారిని విడుదల చేయండి

»» శ్రీలంకను కోరిన మోదీ

»» శ్రీలంకతో రక్షణ ఒప్పందం

కొలంబో, ఏప్రిల్ 5: శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తమిళ జాలర్ల సమస్యను ప్రస్తావించారు. తమిళ మత్స్యకారుల విడుదల, వారి బోట్లను వెనక్కి ఇచ్చే విషయాన్ని మానవత్వంతో పరిశీలించాలని లంక పాలకులకు విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీలంక అధ్యక్షుడు అసుర కుమార దిసనాయకేతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ చర్చల సందర్భంగా భారత్, శ్రీలంక తొలిసారి చరిత్రాత్మక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్యుత్, ఇంధనం, డిజిటల్ సహా ఏడు ప్రధాన అంశాలపైనా ఇరుదేశాల అధినేతల సమక్షంలో ఎంవోయూలు ఖరారయ్యాయి. అరబ్ ఎమిరేట్స్‌ను కూడా కలుపుకొని ట్రింకోమలీలో ఎనర్జీ హబ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. శ్రీలంకకు ఢిల్లీ సాయం ఇకముందు కూడా కొనసాగుతుందని భారత్ మోదీ హామీ ఇచ్చారు. శ్రీలంకలోని తమిళ జాతీయులకు న్యాయం, గౌరవం దక్కాలని భారత్ బలంగా కోరుకుంటోందని లంక పాలకుల దృష్టికి ఆయన తెచ్చారు. రాజకీయ ప్రక్రియలో లంక తమిళులను భాగం చేస్తూ ప్రొవెన్షియల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించే అంశాన్ని ప్రస్తావించారు. లంక తూర్పు ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం 2.4 బిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించారు. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో శ్రీలంకకు ఇచ్చిన రుణాలపై వడ్డీ రేటును తగ్గిస్తున్నట్టు చెప్పారు. రక్షణ ఒప్పందంలో భాగంగా.. పరస్పర సహకారంతో కొలంబో రక్షణ సదస్సు నిర్వహించాలని, హిందూ మహాసముద్ర జలాల్లో రక్షణపరంగా కలిసి పనిచేయాలని నిర్ణయించామన్నారు.



మోదీకి 'మిత్ర విభూషణ'

శ్రీలంక పర్యటనలో ఉన్న మోదీకి అక్కడి ప్రభుత్వం 'మిత్ర విభూషణ' అవార్డును ప్రదానం చేసింది. విదేశీ అధినేతలకు శ్రీలంక ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం ఇది. దీనిని తాను వ్యక్తిగతంగా కాకుండా, 140 కోట్లమంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తానని మోదీ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.